


అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం

20.08.2026
గురువారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 99
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


# రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం

- ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా నాలుగు రాష్ట్రాల్లో
- 9,450 కోట్లతో 4 రైల్వే ప్రాజెక్టులు
- కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం
- మల్టీ-ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు ఆమోదముద్ర 5లో..



**హైదరాబాద్, ఆగస్ట్ 19, అనంతజనశక్తి న్యూస్**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. సుమారు ₹9,450 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు భారీ మల్టీట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాల పరిధిలోని ప్రయాణికులకు, సరుకు రవాణా రంగానికి ఎంతో మేలు చేయనుంది.

# రైతుల వద్దకే బ్యాంకులు

- అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు
- రైతుల ఆదాయం పెంపే బ్యాంకుల లక్ష్యం
- ఎంఎస్ఎంఈలకు సకాలంలో నిధులు అందించాలి
- తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్



**హైదరాబాద్, ఆగస్ట్ 19, అనంత జనశక్తి న్యూస్**

స్టేట్ లెవల్ బ్యాంకర్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లకు కీలక సూచనలు చేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ సకాలంలో రుణాలు అందేలా బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సూచించారు. రుణాలు ఇవ్వడమే కాకుండా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగానికి 2026 జూన్ వరకూ రూ.52,337 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు మరింతగా రుణాలు పెంచాలని ఆదేశించారు. 2లో..

# గ్రూప్1లో భారీ అక్రమాలు

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు నాయుడు
- వైసీపీ హయాంలో స్కామ్ జరిగిందని ఆరోపణ
- అనర్హులతో పేపర్లు దిద్దించారని వెల్లడి
- 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు
- కార్మికులతోనూ మూల్యాంకనం చేయించారని వ్యాఖ్య
- పరీక్ష రాసిన లెక్చరర్‌తోనూ పేపర్లు దిద్దింపు
- తప్పు చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ 2లో..
- వైసీపీపై అసెంబ్లీలో చంద్రబాబు ఫైర్
- వెలుగొండ నిర్వాసితులకు రూ.200 కోట్ల పరిహారం



**అమరావతి, ఆగస్ట్ 19, అనంతజనశక్తి న్యూస్**

వైకాపా హయాంలో జరిగిన గ్రూప్1 పరీక్షల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అభ్యర్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని.. పేపర్లను పూర్తిగా అనర్హులతో దిద్దించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్1 అక్రమాలపై శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు.

**ఇష్టానుసారం వ్యవహరించారు..**

"గ్రూప్1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారు? మార్కులు తగ్గించడం.. పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు.

**పరీక్ష రాసిన వ్యక్తిని పేపర్లు దిద్దేందుకు..**

తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి.. డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు. ఫ్రీలాన్సర్ మహంకాళి రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్ 1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ.. 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైంది.

**వైకాపా హయాంలో అతిపెద్ద స్కామ్**

వైకాపా హయాంలో గ్రూప్1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి.. పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైకాపా నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ" అని సీఎం చంద్రబాబు అన్నారు.

దేవాలయం లాంటి అసెంబ్లీని ఓ పార్టీ మొత్తం బహిష్కరించడం తన రాజకీయ జీవితంలోనే చూడలేదని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో సీఎం చంద్రబాబు.. తాజా పరిణామాలపై కొద్దిసేపు ముచ్చటించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తేనే వాటికి విలువ, గుర్తింపు ఉంటుందని.. బయట కూర్చొని ఎంత మాట్లాడినా ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు.

# చంద్రబాబు 'క్లిక్..క్లిక్..'!



2లో..

ఏపీ సీఎం చంద్రబాబు కెమెరా చేతబట్టి 'క్లిక్'మనిపించారు. వరల్డ్ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకుని అసెంబ్లీ వద్ద ఫొటోగ్రాఫర్లను కలిసి వారికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు కెమెరా పట్టుకుని వివిధ కోణాల్లో ఫొటోగ్రాఫర్లను ఫొటోలు తీస్తూ వారిని ఉత్సాహపరిచారు. దీనికి సంబంధించిన ఫొటోలను సీఎం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## మంథనిలో అభివృద్ధి
# పనులకు శ్రీకారం

2లో..

- రూ.164 కోట్ల పనులకు శంకుస్థాపన
- రెండేళ్లలో మంథనికి రూ.800 కోట్ల నిధులు
- గోదావరి బ్రిడ్జికి నిధులు మంజూరు
- యువత కోసం రూ.20 కోట్లతో న్యాక్ సెంటర్



**పెద్దపల్లి, ఆగస్ట్ 19, అనంత జనశక్తి న్యూస్**

పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలో అభివృద్ధి పనుల జోరు కొనసాగుతోంది. బుధవారం మంథని నియోజకవర్గంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పాల్గొన్నారు.

# నీళ్లలో మూత్రం కలిపి బాలికలతో తాగించిన విద్యార్థి

- చాక్లెట్ తింటే సెట్టైపోతుంది:ప్రిన్సిపాల్
- మధ్యప్రదేశ్‌లో ఘటన

**భోపాల్, ఆగస్ట్ 19, అనంతజనశక్తి న్యూస్**

ఐదో తరగతి విద్యార్థి వాటర్ బాటిల్‌లో మూత్రం పోసి, దానిని ఇద్దరు తోటి విద్యార్థినిలతో తాగించాడు. దీనిపై స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తే.. నోరు చేడిపోయినట్టు ఉంటే చాకెట్ల తినండి అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. 2లో..

## మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా
# తూమాటి మాధవరావు

- అధికార పార్టీ సభ్యులు లేకుండానే..
- బాధ్యతలు స్వీకరణ కార్యక్రమం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ 2లో..

**అమరావతి, ఆగస్ట్ 19, అనంతజనశక్తి న్యూస్**

ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌గా వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఎన్నికయ్యారు. డిప్యూటీ ఛైర్మన్ పదవి కోసం మరో అభ్యర్థి ఎవరూ పోటీ పడకపోవటంతో మండలి డిప్యూటీ ఛైర్మన్ తూమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు అధికారికంగా ప్రకటించారు. అనంతరం డిప్యూటీ ఛైర్మన్‌గా తూమాటి మాధవరావు బాధ్యతలు స్వీకరించారు. తూమాటి మాధవరావును ఛైర్మన్ మోషేన్ రాజు.. సీటులో కూర్చోబెట్టారు. అనంతరం శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, పలువురు ఎమ్మెల్సీలు ఆయనను అభినందించారు.

# వైజాగ్ వాసులకు ఎలాంటి ఇబ్బంది లేదు



- గూగుల్ డేటా సెంటర్‌కు పోలవరం నీళ్లు
- క్లారిటీ ఇచ్చిన మంత్రి లోకేశ్
- భూగర్భ జలాలు తగ్గే అవకాశం లేదు
- వైసీపీ ఆరోపణల్లో నిజం లేదు
- సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు నమ్మొద్దు

**విశాఖపట్నం, ఆగస్ట్ 19, అనంత జనశక్తి న్యూస్**

విశాఖలో గూగుల్ డేటా సెంటర్లు ఏర్పాటు చేయడంపై నెలకొన్న అనేక సందేహాలకు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఏపీ అసెంబ్లీలో స్పష్టత ఇవ్వడమే కాకుండా, విమర్శలు చేస్తున్న వారికి కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 2లో..

## సీజేఐపై ఎస్‌సీబీఏ
# అధ్యక్షుడు ప్రశంసలు

- ప్రదీప్ రాయ్‌కు భారీ మెజార్టీతో విజయం
- సీజేవిని తండ్రిలాంటి వ్యక్తిగా అభివర్ణించిన రాయ్ 2లో..
- బెంచ్‌కు 100 శాతం సహకరిస్తామని హామీ

# కవితతో సీఎంవిజయ్ జ్యోతిష్యుడు రాధన్ భేటీ



2లో..

### హైదరాబాద్‌లోని కవిత నివాసానికి రాధన్
### సోషల్ మీడియాలో ఫోటో బాగా వైరల్

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత , తమిళనాడు సీఎం జ్యోతిష్యుడు రాధన్ పండిట్ వెట్రివెల్ భేటీ ఆసక్తికరంగా మారింది. రాధన్ హైదరాబాద్‌లో కవిత ఇంటికి వెళ్లి కలిశారు.. ఆయన్ను కవిత, తన కుమారుడితో కలిసి సత్కరించారు. ప్రస్తుతం ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. రాధన్ చెన్నై నుంచి హైదరాబాద్ వచ్చి మరీ కవితను కలవడంపై చర్చనీయాంశమైంది.

# స్థానిక పోరుకు వైసీపీ రెడీ!

- నేతలకు జగన్ దిశానిర్దేశం 2లో..
- గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు
- కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందన్న జగన్
- ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలని సూచన



# రైతుల వద్దకే బ్యాంకులు

(మొదటి పేజీ తరువాయి)

రుణం చెల్లించలేని రైతుల ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించి, సమస్యలకు పరిష్కారాలు చూపాలని బ్యాంకర్లకు సూచించారు. MSMEలకు రుణం మంజూరు చేయడమే కాకుండా సకాలంలో నిధులు అందించడం ముఖ్యమని అన్నారు. CGTMSE కింద రూ.4,463 కోట్ల విలువైన 16,265 ప్రతిపాదనలు ఆమోదించినట్లు వెల్లడించారు. రుణాల కోసం వ్యాపారులను పూచీకత్తు నిబంధనలతో ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. క్యూర్, ప్యూర్, రేర్‌కు అనుగుణంగా ప్రత్యేక బ్యాంకింగ్ వ్యూహాలను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా 'బ్యాంకింగ్ రోడ్‌మ్యాప్' సిద్ధం చేయాలని అన్నారు. 2034 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 1 ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. జనధన్ ఖాతాల్లో 19.13 లక్షల ఖాతాలు జీరో బ్యాలెన్స్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రతి గ్రామానికీ బ్యాంకింగ్ సేవలు అందేలా బిజినెస్ కరస్పాండెంట్లను మరింత క్రియాశీలం చేయాలని ఆదేశించారు.

# చంద్రబాబు 'క్లిక్..క్లిక్..'!



"చరిత్రను రికార్డు చేస్తూ.. జ్ఞాపకాలను భద్రపరుస్తూ.. మనుషుల అనుభవాలను చిత్రాల్లో బంధించే ఫొటోగ్రాఫర్లకు నా హృదయాపూర్వక అభినందనలు. వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం నిజంగా గొప్ప అవకాశం. వారి అంకితభావం, కళాత్మక ప్రతిభ, నిరంతర శ్రమ ఎన్నో చెప్పని కథలను ప్రతిబింబిస్తున్నాయి. సమాచారం, స్ఫూర్తిని అందించే మరెన్నో చిరస్థాయి క్షణాలను కెమెరాల్లో బంధిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నా" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## మంథనిలో అభివృద్ధి
# పనులకు శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడిగా పాల్గొని రూ.164 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ ప్రాంతాభివృద్ధికి ప్రభుత్వ కట్టుబాటును పునరుద్ఘాటించారు.

మంథని అభివృద్ధికి రూ.800 కోట్లు: మంత్రి శ్రీధర్ బాబు

ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గడిచిన రెండు సంవత్సరాల కాలంలో మంథని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం దాదాపు రూ.800 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని స్పష్టం చేశారు. అందులో భాగంగానే నేడు రూ.164 కోట్లతో వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని తెలిపారు. గోదావరి నదిపై ప్రతిపాదిత బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసిందని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని క్రమంగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు.

**రూ.20 కోట్లతో న్యాక్ సెంటర్ మంజూరు: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో మంథని ప్రాంతానికి ఎనలేని సేవలుందించిన దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, మాజీ స్పీకర్ శ్రీపాద రావుల సేవలను స్మరించుకున్నారు. ఈ నియోజకవర్గ పురోగతికి రూ.800 కోట్ల నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. యువతకు ఉపాధి, సాంకేతిక శిక్షణ అవకాశాలను విస్తరించేందుకు మంథనిలో రూ.20 కోట్ల వ్యయంతో న్యాక్ సెంటర్‌ను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా ప్రకటించారు.

## వైజాగ్ వాసులకు
# ఎలాంటి ఇబ్బంది లేదు

(మొదటి పేజీ తరువాయి)

డేటా సెంటర్లపై జనసేన ఎమ్మెల్యే నాగమాధవి అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేశ్ సమాధానం ఇచ్చారు. డేటా సెంటర్ల నీటి వినియోగంపై దుష్ప్రచారం జరుగుతోందని, కానీ అది అవాస్తవమని ఆయన చెప్పారు.

గూగుల్ డేటా సెంటర్లకు పోలవరం నీటిలో పారిశ్రామిక కేటాయింపుల నుంచే నీరు వస్తోందని మంత్రి లోకేశ్ వివరించారు. విశాఖ నగర ప్రజల నీటి అవసరాలకు కేటాయించిన నీటిని డేటా సెంటర్లకు మళ్లించడం లేదని స్పష్టం చేశారు. పోలవరం నుంచి విశాఖపట్నానికి గ్రావిటీ ద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేస్తున్నామని, 18 నెలల్లో అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే డేటా సెంటర్ల కోసం ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకూ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఒక జీడబ్ల్యూ థర్మల్ పవర్ ప్లాంట్‌తో పోల్చితే డేటా సెంటర్‌కు పదో వంతు నీరే అవసరమవుతుందని.. మరి థర్మల్ పవర్ ప్లాంట్ల నీటి వినియోగంపై కాకుండా డేటా సెంటర్లపైనే ఎందుకు నిరసనలు అంటూ లోకేశ్ ప్రశ్నించారు. డేటా సెంటర్ కేటాయింపులకు 6.5 జీడబ్ల్యూ పరిమితి విధించినట్లు సీఎం చంద్రబాబు చెప్పిన విషయాన్ని లోకేశ్ ప్రస్తావించారు. 6.5 జీడబ్ల్యూ డేటా సెంటర్ కేటాయింపుల లక్ష్యం ఇప్పటికే పూర్తయిందని ఆయన స్పష్టం చేశారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇచ్చే కంపెనీలకే తమ ప్రభుత్వం ప్రాముఖ్యత ఇస్తుందని చెప్పారు. విశాఖపట్నం వాసులు నీటి అవసరాల విషయంలో ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. ఏఐ ఆధారిత డిజిటల్ ఎకానమీకి డేటా సెంటర్లు అత్యంత కీలకమని చెప్పారు. గూగుల్ పెట్టుబడితో విశాఖపై ఇతర కంపెనీలకు ఆసక్తి పెరిగిందని ఆయన చెప్పారు. డేటా సెంటర్లకు సంవత్సరానికి సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే అవసరమవుతుందని లోకేశ్ వివరించారు.

## మండలి డిప్యూటీ ఛైర్మన్‌గా
# తూమాటి మాధవరావు

(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు మాధవరావును ఛైర్‌లో కూర్చోబెట్టే సమయంలో అన్ని పార్టీల సభ్యులు రావాలని శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు కోరారు. అయితే ఎన్డీఏ కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్సీలు అందుకు ముందుకు రానట్లు తెలిసింది. దీంతో మండలి ఛైర్మన్ మోషేన్ రాజు, వైసీపీ నేతలు బొత్స సత్యనారాయణ, తోట త్రిమూర్తులు మిగతా ఎమ్మెల్యేలు మాధవరావును ఛైర్మన్ సీటులో కూర్చోబెట్టి అభినందించారు.

మరోవైపు మాధవరావును మండలి అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టేందుకు కూటమి పార్టీల ఎమ్మెల్సీలు ముందుకు రాకపోవటంపై బొత్స సత్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. డిప్యూటీ ఛైర్మన్‌ను అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టే సందర్భంలో అధికార పార్టీ రాకపోవటం దురదృష్టకరమని బొత్స సత్యనారాయణ అభిప్రాయపడ్డారు. రూల్స్ గురించి మాట్లాడే మంత్రులు.. డిప్యూటీ ఛైర్మన్ పదవికి గౌరవం ఇవ్వరా అని ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి.. ఇప్పటి వరకూ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ కూడా ఇలా జరగలేదన్న బొత్స సత్యనారాయణ.. సభాధ్యక్ష స్థానం పట్ల ఇలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. మంత్రులు నీతులు చెప్పడం కాదని.. సభా విలువలు, సంప్రదాయాలు పాటించాలని విమర్శించారు. మరోవైపు కొత్తగా ఎన్నికైన డిప్యూటీ ఛైర్మన్‌ను అన్ని పార్టీల సభ్యులు కలిసి.. అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టడం సభా సంప్రదాయమని ఛైర్మన్ మోషేన్ రాజు అభిప్రాయపడ్డారు.

**మరోవైపు డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న జకియా బేగం గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన సంగతి తెలిసిందే. జకియా బేగం పదవీకాలం పూర్తి కావటంతో మరొకరిని డిప్యూటీ ఛైర్మన్ పదవికి ఎన్నుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థిగా తూమాటి మాధవరావు పేరును ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించారు. మండలిలో వైసీపీకి పూర్తిస్థాయిలో మెజారిటీ ఉన్న నేపథ్యంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌గా తూమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.**

# నీళ్లలో మూత్రం కలిపి బాలికలతో తాగించిన విద్యార్థి

(మొదటి పేజీ తరువాయి)

దిగ్భ్రాంతికి గురిచేసే ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో వెలుగు చూసింది. ఈ బాలుడు వాటర్ బాటిల్‌లో మూత్రం కలిపి, ఇద్దరు బాలికలతో తాగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయమై బాధితులు ప్రిన్సిపాల్‌కి ఫిర్యాదు చేయగా "నోరు పాడైనట్టు అనిపిస్తే రూ. 10 చాక్లెట్ తిని సరిపెట్టుకోండి" అంటూ ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు అధికారులు తెలిపారు.

గుణా జిల్లాలోని ఆరోన్ డెవలప్‌మెంట్ బ్లాక్‌లోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ఆగ్రహించిన బాలికల కుటుంబ సభ్యులు, స్థానికులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పాఠశాలకు తాళం వేశారు.

**గుణా జిల్లా మేజిస్ట్రేట్ స్పందన**

"కొందరు విద్యార్థులు వాటర్ బాటిళ్లలో మూత్రం పోసి తమతో తాపించారని ఇద్దరు బాలికలు ఆరోపించారు.. దీనిపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తే.. ఆయన అమానుషంగా ప్రవర్తిస్తూ 'మీ నోరు పాడైనట్టు అనిపిస్తే రూ.10 చాక్లెట్ తినండి' అని చెప్పినట్లు తెలిసింది" అని జిల్లా మేజిస్ట్రేట్ కన్యాత్ తెలిపారు.

ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే తహసీల్దార్, బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌లను ఘటనా స్థలానికి పంపి, ప్రిన్సిపాల్‌కు నోటీసులు జారీ చేసినట్లు ఆరోన్ సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ మంజూషా ఖత్రీ తెలిపారు. రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని బీఈఓను ఆదేశించామని, నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్డీఎం చెప్పారు.



ఓ విద్యార్థి ఈ తుంటరి పనికి ఒడిగట్టాడని, ఆ బాలుడ్ని, అతడి తల్లిదండ్రులను విచారణకు పిలిపించినట్లు జిల్లా మేజిస్ట్రేట్ పేర్కొన్నారు. ఈ ఘటనలో మరికొందరు ఇతర విద్యార్థుల ప్రమేయం కూడా ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో పరిపాలనా యంత్రాంగం భారీ పోలీస్ బందోబస్తుతో గ్రామానికి చేరుకుని బాధితులు, వారి కుటుంబ సభ్యులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థుల నుంచి వివరణాత్మక స్టేట్‌మెంట్లను సేకరించారు.

# సీజేఐపై ఎస్సీబీఏ అధ్యక్షుడు ప్రశంసలు

న్యూఢిల్లీ, ఆగస్ట్ 19, అనంతజనశక్తి న్యూస్

సీజేఐ సూర్యకాంత్‌పై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ప్రదీప్ రాయ్ ప్రశంసలు కురిపించారు. "తండ్రిలాంటి వ్యక్తి.. ఎప్పుడైనా సంప్రదించగలిగే వ్యక్తి"గా అభివర్ణించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ప్రదీప్ రాయ్ భారీ ఘన విజయం అందుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం సీజేఐ మార్గదర్శకత్వంలో పనిచేస్తుందని... న్యాయమూర్తులకు అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

**ప్రదీప్ రాయ్ విజయం**

సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు మంగళవారం జరిగాయి. అదే రోజు అర్ధరాత్రి తర్వాత ఫలితాలను ప్రకటించారు. అధ్యక్ష పదవికి పోటీ చేసిన ప్రదీప్ రాయ్‌కు 822 ఓట్లు లభించాయి. ఆయన సమీప ప్రత్యర్థి సీనియర్ న్యాయవాది అనుపమ్ లాల్ దాస్‌కు 451 ఓట్లు వచ్చాయి. ఇతర అభ్యర్థుల్లో సీనియర్ న్యాయవాది అదీష్ అగర్వాలాకు 412 ఓట్లు, గౌరవ్ భాటియాకు 370, సుకుమార్ పట్టజోషికి 269, సిద్ధార్థ్ మృదుల్‌కు 217, మహాలక్ష్మి పవానికి 128 ఓట్లు లభించాయి.




**'బార్, బెంచ్‌ది చిన్న కుటుంబం'**

సీజేఐ సూర్యకాంత్ మాట్లాడుతూ.. బార్, బెంచ్ అనేవి "చిన్న కుటుంబం" లాంటివని పేర్కొన్నారు. "మనం ఎప్పుడూ ఒకరినొకరం చూసుకున్నాం. ఇకపై కూడా ఇదే సమన్వయంతో కూడిన సంబంధాన్ని కొనసాగిస్తాం" అని ఆయన కొత్తగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు. న్యాయవ్యవస్థ, బార్ మధ్య సన్నిహితమైన, సమన్వయంతో కూడిన సంబంధం కొనసాగడం ఎంతో ముఖ్యమని సీజేఐ పేర్కొన్నారు. కొత్త కార్యవర్గం తమ పనితీరుతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా యువ న్యాయవాదులు వృత్తిలో స్థిరపడేందుకు అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

**'బెంచ్‌కు 100 శాతం సహకరిస్తాం'**

సీజేఐ వ్యాఖ్యలకు స్పందించిన ప్రదీప్ రాయ్.. బెంచ్‌కు పూర్తిగా సహకరిస్తామని స్పష్టం చేశారు. "మై లార్డ్స్.. ఈ బార్ మొత్తం మీ వెంటే ఉంది. మేం 100 శాతం సహకరిస్తాం. బెంచ్‌కు అన్ని విధాలా మద్దతు అందిస్తాం" అని రాయ్ హామీ ఇచ్చారు. ప్రదీప్ రాయ్ గతంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఎన్నికలకు ముందు న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించిన పలు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. 2025లో అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ స్థానంలో ఇప్పుడు ప్రదీప్ రాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# కవితతో సీఎం విజయ్ జ్యోతిష్యుడు రాధన్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

కవిత ఆయన్ను పిలిపించారా.. ఆయనే ఇక్కడికి వచ్చారా అన్నది తెలియాల్సి ఉంది. కవిత తన రాజకీయ భవిష్యత్ గురించి ఏదైనా ఆరా తీశారా అనే చర్చ మొదలైంది.

చాలామంది రాజకీయ నేతలు పండితులు, జ్యోతిష్యుల్ని నమ్ముతుంటారు.. వారు నిర్ణయించిన ముహూర్తాల్లోనే పార్టీ కార్యాలయాలు ప్రారంభించడం, రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకోవడం, ఎన్నికల సమయంలో నామినేషన్లు వేయడం, ప్రత్యేక పూజలు చేయించడం వంటి వాటి కోసం జ్యోతిష్యుల్ని సంప్రదిస్తుంటారు. కవిత కూడా తమిళనాడు సీఎం విజయ్ జ్యోతిష్యుడ్ని సలహాల కోసం సంప్రదించారా? అనే చర్చ జరుగుతోంది. రాధన్ తమిళనాడులో విజయ్ ముఖ్యమంత్రి అవుతారని ముందు నుంచి చెబుతున్నారు.. ఆయన చెప్పినట్లుగానే జరిగింది. తమిళనాడు ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ సమయంలో దాదాపు అన్ని సర్వే సంస్థలు టీవీకే అధికారంలోకి వచ్చే అవకాశం లేదని చెప్పగా.. తాము ఎగ్జిట్ పోల్స్ పట్టించుకోమని.. టీవీకే పార్టీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని.. విజయ్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చెప్పారు. అంతేకాదు గతంలో తమిళనాడుకు చెందిన నేతల జాతకాల గురించి రాధన్ చెప్పారు.. ఆయన చెప్పినట్లే జరిగింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణం గురించి రాధాన్ ముందే చెప్పారు. 2021 తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే గెలిచి స్టాలిన్ ముఖ్యమంత్రి అవుతారని చెప్పారు.. ఆ అంచనాలు కూడా నిజమయ్యాయి. స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్, పళనిస్వామి జాతకాలు గురించి చెప్పారు. ఇప్పుడు బీఆర్ఎస్ అధినేత్రి కవిత కూడా రాధన్ పండిట్‌ను హైదరాబాద్ పిలిపించినట్లు ప్రచారం జరుగుతోంది. కవిత తమిళనాడు ఎన్నికల్లో విజయ్ టీవీకే పార్టీ విజయాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణలో రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్న ప్రజలకు ఈ గెలుపు ఒక ఆశ కల్పించిందన్నారు. ఓటర్లు పాత పార్టీలకు గుడ్ బై చెప్పి కొత్త రాజకీయ శక్తికి మద్దతు ఇస్తారనడానికి తమిళనాడు ఎన్నికల ఫలితాలు ఒక ఉదాహరణగా భావించాలన్నారు. తమిళనాడులో టీవీకే, తెలంగాణలో టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అంటూ పోల్చారు. విజయ్ గెలుపు కేవలం సినిమా స్టార్‌కు దక్కి ప్రజాదరణగా చూడకూడదన్నారు.. కొత్త రాజకీయ శక్తికి దక్కిన విజయంగా భావించాలి అన్నారు. తమిళనాడులో విజయ్ ముఖ్యమంత్రి అవుతారన్న రాధన్.. ఇప్పుడు తెలంగాణ రాజకీయాలు, కవిత గురించి ఏం చెప్పారో మరి.



# స్థానిక పోరుకు వైసీపీ రెడీ!

అమరావతి, ఆగస్ట్ 19, అనంతజనశక్తి న్యూస్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి అంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నతలకు దిశానిర్దేశం చేశారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని జగన్ పార్టీ నేతలకు సూచించారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఏ ఒక్క వర్గం కూడా ప్రభుత్వ పాలనతో సంతోషంగా లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్థానిక ఎన్నికల్లో కనిపించకుండా చేసేందుకు పోలీసులు, అధికార యంత్రాంగాన్ని ఉపయోగించే అవకాశం ఉందని ఆరోపించిన జగన్.. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొని పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తమ పార్టీకి ప్రజల్లో అత్యంత ఆదరణ ఉందని జగన్ పేర్కొన్నారు. అందువల్ల రాబోయే ఎన్నికల్లో వైసీపీ తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమై పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నేతలకు సూచించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి అంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నతలకు దిశానిర్దేశం చేశారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేతలతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని, గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల పోరుకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని జగన్ పార్టీ నేతలకు సూచించారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందని, ఏ ఒక్క వర్గం కూడా ప్రభుత్వ పాలనతో సంతోషంగా లేదని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్థానిక ఎన్నికల్లో కనిపించకుండా చేసేందుకు పోలీసులు, అధికార యంత్రాంగాన్ని ఉపయోగించే అవకాశం ఉందని ఆరోపించిన జగన్.. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొని పోరాడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తమ పార్టీకి ప్రజల్లో అత్యంత ఆదరణ ఉందని జగన్ పేర్కొన్నారు. అందువల్ల రాబోయే ఎన్నికల్లో వైసీపీ తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిత్యం ప్రజలతో మమేకమై పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నేతలకు సూచించారు.



# గ్రూప్1లో భారీ అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాస్వామ్యంలో అసెంబ్లీ అత్యున్నత వేదిక అని తెలిపారు. 1978లో వెంకయ్యనాయుడు, జైపాల్‌రెడ్డి ఇద్దరే సభలో గట్టిగా మాట్లాడారని గుర్తు చేశారు. 198994లో ఎన్టీఆర్ కొన్ని రోజులు సభకు రాకపోయినా తామంతా పార్టీ తరపున అసెంబ్లీలో ప్రజల కోసం పోరాడామని వివరించారు.

201924 మధ్య తాను సభలో సవాల్ చేసి బయటకు వచ్చినా తమ ఎమ్మెల్యేలు చివరి రోజు వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగించారని వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని చులకన చేసే 'గొడ్డలి పార్టీ' నాయకుడికి రాజకీయాలు అవసరమా? అని చంద్రబాబు నిలదీశారు. గ్రూప్1 అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే సభకు రాకుండా బయట కూర్చొని డీఎస్సీపై బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు. గొడ్డలి ప్రభుత్వం కోత పెట్టిన బీసీ రిజర్వేషన్లను తామే పునరుద్ధరించామని, ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయాన్ని అన్ని వర్గాలు స్వాగతిస్తున్నాయని చంద్రబాబు అన్నారు. గొడ్డలి పార్టీ నాయకుడు అసత్యాలు ఎన్ని చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదని.. అతని మాటలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు.

**సీఎం చంద్రబాబు అన్ని సౌకర్యాలు కల్పించారు**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన సాయాన్ని తాము మర్చిపోలేమన్నారు. తమ 30 ఏళ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు జీవితంలో పూర్తవుతుందని తాము అనుకోలేదని అన్నారు. చూడలేం అనుకున్న ప్రాజెక్టును చూస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని నిర్వాసితులు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సీఎం చంద్రబాబు నాయుడు చెక్కులు అందజేశారు. బుధవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో సీఎంను ప్రాజెక్టు నిర్వాసితులు కలిశారు. ఈ సందర్భంగా వారికి రూ.200 కోట్ల మేర పరిహారం చెక్కులు అందించారు. అనంతరం నిర్వాసితులుపై విధంగా స్పందించారు.



# షారుక్, అజయ్ దేవ్‌గణ్‌కు నోటీసులు..
# తుకారాం ముండేకు అధికారం ఉందా?

నిషేధిత ఉత్పత్తులైన పాన్ మసాలాలకు పరోక్షంగా ప్రచారం చేసినందుకు గానూ.. ప్రముఖ బాలీవుడ్ నటులకు మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. షారుక్ ఖాన్ , అజయ్ దేవ్‌గణ్ , టైగర్ ష్రాఫ్ లకు మహారాష్ట్ర ఆహార, ఔషధ పరిపాలన విభాగంఎఫ్‌డీఏ షోకాజ్ నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. అయితే, ఒక నిషేధిత ఉత్పత్తిని ప్రచారం చేసినందుకు గానూ.. ప్రముఖులపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర స్థాయి ఆహార నియంత్రణ సంస్థకు చట్టపరమైన అధికారం ఉందా? అనేదే ఇప్పుడు అందరి మదిలో మెదిలే ప్రశ్న. మరి దీనికి చట్టం ఏం చెబుతోంది? సూపర్‌స్టార్లకు నోటీసులు జారీ చేసిన తుకారాం ముంఢే ఎవరు..?



**నోటీసుల్లో ఏముంది..?**

ఇలాచీ పేరుతో ప్రసారమవుతోన్న ప్రకటనలో నటించినందుకు గానూ.. 2006 నాటి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టంలోని 24, 53 సెక్షన్ల కింద ఎఫ్‌డీఏ.. ఈ సెలబ్రిటీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ ప్రకటన వల్ల నిషేధిత ఉత్పత్తికి పరోక్ష ప్రచారం జరుగుతోందా?అనేది తాము పరిశీలించనున్నామని ఎఫ్‌డీఏ కమిషనర్ తుకారం ముంఢే చెబుతున్నారు. ఈ ఉత్పత్తుల ప్రచారంలో మీ పాత్ర ఏమిటి? ప్రకటనకు ముందు ఉత్పత్తిపై, దాని చట్టబద్ధతపై ఎలాంటి పరిశీలన చేశారు? వంటి వాటిపై వివరణ ఇవ్వాలని నటులను ఎఫ్‌డీఏ ఆదేశించింది. తమ ఎండార్స్‌మెంట్ ఒప్పందాలు, క్యాంపెయిన్ వివరాలు, ఉత్పత్తి సమాచారం, చెల్లింపుల వివరాలు, ప్రకటన సంస్థ, బ్రాండ్ యజమాని తదితర సమాచారాన్ని సమర్పించాలని తెలిపింది. అలాగే, ఈ ప్రచార కంటెంట్‌ను తమ సోషల్ మీడియా ఛానెళ్ల నుంచి తొలగించాలని, తక్షణం ఇలాంటి ప్రచారాలకు దూరంగా ఉండాలని ఆదేశించింది. దీనిపై లిఖిత పూర్వక వివరణ ఇచ్చేందుకు ఈ నటులకు 15 రోజుల గడువు కల్పించింది. ఇలాంటి కేసుల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టప్రకారం రూ.10లక్షల వరకు జరిమానా పడే అవకాశం ఉంటుంది.

**ఎఫ్‌డీఏ చర్యలు తీసుకోవచ్చా..?**

నిషేధిత ఉత్పత్తులకు పరోక్షంగా ప్రచారం చేశారన్న ఆరోపణలపై ప్రముఖులకు షోకాజ్ నోటీసులు జారీ చేసే చట్టపరమైన అధికారం మహారాష్ట్ర ఎఫ్‌డీఏకు ఉంది. అయితే, నేరుగా రూ.10లక్షల జరిమానా విధించే అవకాశం ఎఫ్‌డీఏకు లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ చట్టం ప్రకారం.. కనీసం అదనపు జిల్లా మేజిస్ట్రేట్ హోదా కలిగిన నిర్ణయాధికారి మాత్రమే ఈ జరిమానాను విధించగలరు. అంతేగాక, ఈ జరిమానా ఉత్తర్వులను ఫుడ్ సేఫ్టీ అప్పిలేట్ ట్రైబ్యూనల్ ముందు సవాల్ చేసే అవకాశం సెలబ్రిటీలకు ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే, స్టార్లకు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో ఈ ప్రచార కంటెంట్‌ను సోషల్ మీడియా ఖాతాల నుంచి తక్షణమే తొలగించాలని ఎఫ్‌డీఏ ఆదేశించింది. అయితే, ఈ అధికారం రాష్ట్ర ఆహార నియంత్రణ సంస్థకు లేదని న్యాయ నిపుణులు వెల్లడించారు. సదరు పోస్టులు తొలగించాలని కోరే హక్కు మాత్రమే ఎఫ్‌డీఏకు ఉందని, నేరుగా ఆదేశించే అధికారం లేదని పేర్కొన్నారు. పోస్టులను తొలగించే అంశం కేంద్ర వినియోగదారు రక్షణ సంస్థ (సీసీపీఏ) పరిధిలోకి వస్తుందని తెలిపారు. అందువల్ల ఈ నటులకు జారీ చేసిన వాటిని కేవలం షోకాజ్ నోటీసులుగానే పరిగణించాలని చెబుతున్నారు.

**ట్రాన్స్‌ఫర్ కింగ్.. తుకారాం**

ఐఏఎస్ అధికారి తుకారాం ముంఢే.. మహారాష్ట్ర ఆహార, ఔషధ పరిపాలన (ఎఫ్‌డీఏ) కమిషనర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. పదవిలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ముంబయిలోని ప్రసిద్ధ హోటళ్లు, రెస్టారంట్లలో ఆయన చేపట్టిన తనిఖీలు, దాడులు చర్చనీయాంశంగా మారాయి. దీంతో ఆయన పేరు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. తుకారాంను స్థానికంగా ట్రాన్స్‌ఫర్ కింగ్ అని పిలుస్తారు. 2005 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఆయన.. రెండు దశాబ్దాలకుపైగా ఉన్న తన సర్వీసులో సుమారు 25 బదిలీలు ఎదుర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే ఆయన ట్రాన్స్‌ఫర్ అవడం గమనార్హం. తుకారాం తన కెరీర్‌లో గ్రామీణ పరిపాలన నుంచి.. పట్టణ పాలన వరకూ అనేక కీలక పదవుల్లో పనిచేశారు.

## ‘కశ్మీర్‌లోకి 10,000 మంది ఉగ్రవాదులు’: లష్కరే చీఫ్ పంపించాడంటూ వ్యాఖ్యలు వైరల్



పాకిస్థాన్ నుంచి జమ్మూకశ్మీర్‌లోకి 10వేల మంది ఉగ్రవాదులు చొరబడ్డారట. వారిని లష్కరే తయ్యిబా చీఫ్ హాఫీజ్ సయీద్ పంపాడని పాక్‌లోని ఒక మతబోధకుడు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఆగస్టు 14న బోధకుడు నాసిర్ మద్నీ మాట్లాడిన మాటలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. బహావల్ నగర్‌లో లష్కరే అనుబంధ కార్యక్రమంలో అతడు మాట్లాడుతూ.. సయీద్‌ను మాతృభూమి సేవకుడిగా అభివర్ణించాడు. దీంతో కశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాల వెనక హాఫీజ్ ప్రమేయం ఉందని మరింత తేటతెల్లమవుతోంది.
అల్‌ఖైదా, తాలిబన్లతో సంబంధాల కారణంగా 2005లో లష్కరే ఉగ్రసంస్థను ఐరాస నిషేధించింది. దాని చీఫ్ హాఫీజ్ సయీద్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. 26/11 ముంబయి దాడులతో సహా భారత్‌లో జరిగిన పలు ఉగ్రఘటనలకు సంబంధించిన దర్యాప్తులో అతడి పేరు చాలా సార్లు వెలుగులోకి వచ్చింది. గతేడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడి కేసులో జమ్ము న్యాయస్థానం అతడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ ఇచ్చింది. ఈ దాడికి ఉగ్రవాదులను ఆదేశించడం దగ్గర్నుంచి.. కుట్రకు ప్రణాళిక రూపొందించడం, దాన్ని అమలు చేసేలా సయీద్ ఎప్పటికప్పుడు సమీక్షించినట్లు ఆధారాలున్నాయని ఎన్ఐఏ అభియోగాలు మోపిన సంగతి తెలిసిందే.

## విద్యాధికారులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడులకు పంపాలి: దీప్కే



విద్యా విభాగం అధికారులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకే పంపేలా తప్పనిసరి చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మంగళవారం డిమాండ్ చేశారు. పల్లెల్లో విద్యార్థుల కష్టాలు, చదువు కోసం కిలోమీటర్ల కొద్దీ నడిచే వారి దైన్యాన్ని అర్థం చేసుకునేందుకు మంత్రులు, రాజకీయ నాయకులు తమ చిన్నారులను గ్రామాల్లోని బడులకు ఒక్క రోజైనా పంపాలని సూచించారు. గ్రామీణ విద్యార్థులకు రవాణా సదుపాయం కల్పించడంలో మహారాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ‘పాఠశాలలను మెరుగుపరచండి’ పేరిట గత వారం దీప్కే ఉద్యమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. తన సొంత జిల్లా హింగోలిలోని లింబాలాలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హింగోలి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తారా? అని ప్రశ్నించగా ప్రభుత్వ పాఠశాలలు బాగుపడితే ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇబ్బంది లేదని తెలిపారు. అంతకుముందు ఓ గ్రామంలోని జడ్పీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మద్యం తాగి తరగతి గదిలో నిద్రపోతున్న వీడియోను సామాజిక మాధ్యమంలో దీప్కే పోస్టు చేశారు. ఆ టీచర్‌ను మంగళవారం అధికారులు సస్పెండ్ చేశారు.

# వీరికి మోదం.. వారికి ఖేదం



ఝార్ఖండ్‌లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ఉద్యోగ నియామకాల పరీక్ష రద్దుతో ఆందోళన చేస్తున్న విద్యార్థులు.. సంబరాలు చేసుకుని దీక్షలు విరమించగా.. పరీక్ష రద్దుతో ఉద్యోగాలు కోల్పోయినవారు రోడ్డెక్కారు.
ఝార్ఖండ్‌లో ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలపై నిరాహార దీక్షలు చేస్తున్న ఆరుగురు విద్యార్థుల్లో ముగ్గురు దీక్షలను విరమించారు. ఝార్ఖండ్ స్టేట్ సర్వీస్ కమిషన్ ఉద్యోగ నియామక పరీక్షను రద్దు చేయడంతోపాటు ప్రైవేటు సంస్థ 2014 నుంచి నిర్వహించిన అన్ని నియామకాలను నిలిపేస్తున్నట్లు ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సోమవారం రాత్రి ప్రకటించడంతో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. జేకేఎల్ఎం నేత దేవేంద్ర మహతో సోమవారం రాత్రే దీక్ష విరమించగా.. మంగళవారం ప్రేమ్ నాయక్, ఉమ్మీ హబీబా విరమించారు. రాహుల్ క్రాంతి, సబితా కుమారి, రూపేశ్ పాల్ ఇంకా దీక్షలను విరమించలేదు. విద్యార్థుల డిమాండ్లలో ఇంకా సీబీఐ దర్యాప్తు ఒక్కటే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో ఆందోళనల విరమణలపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని విద్యార్థి నేతలు తెలిపారు.
ఝార్ఖండ్‌లో మొత్తంగా 44 నియామక పరీక్షలు రద్దయ్యాయి. 2014 నుంచి నిర్వహించిన పరీక్షలు ఇందులో ఉన్నాయి.

**2,000 మంది భవితవ్యం ప్రశ్నార్థకం..**

స్టేట్ కమిషన్ నియామక రద్దుతో ఇప్పటికే ఉద్యోగాల్లో చేరిన 2,000 మంది భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వారంతా మంగళవారం ఝార్ఖండ్ సచివాలయంవద్ద బైఠాయించారు. తమను తాము సమర్థించుకోవడానికి పారదర్శక అవకాశాన్ని ఇవ్వాలని డిమాండు చేస్తూ సచివాలయం నుంచి బిర్సా చౌక్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎవరో కొందరు చేసిన తప్పునకు అందరినీ శిక్షించడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. కోర్టుల తీర్పులతోనే తాము నియామకాలు పొందామని, ఇప్పుడు రద్దు చేస్తే ఎలాగని నిలదీస్తున్నారు. 2,000 మంది అక్రమంగా ఎలా నియమితులవుతారని ఓ ఉద్యోగి ప్రశ్నించారు.
ఆందోళన శిబిరంవద్ద పలువురు ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఒక ఉద్యోగి తన భార్యను విడాకులు తీసుకోవాలని కోరారు. ఉద్యోగం ఉందని తనను పెళ్లి చేసుకుందని, ఇప్పుడు ఉద్యోగం పోతున్నందున తన నుంచి విడాకులు తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రెండు నెలల కిందట వివాహం చేసుకున్న సందీప్‌ను మంగళవారం భద్రతా సిబ్బంది కార్యాలయంలోకి రానివ్వలేదు. దీంతో ఆయన ఆవేదనతో విడాకులు తీసుకోవాలని భార్యకు సూచించారు.

**అభయ్ తివారీ భార్య, సోదరుడి అరెస్టు**

ఉద్యోగ నియామకాల్లో అక్రమాలకు పాల్పడిన కేసులో కీలక నిందితుడు అభయ్ తివారీ భార్య సుష్మా కుమారి, అతడి సోదరుడు అక్షయ్ తివారీని మంగళవారం ఝార్ఖండ్ సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు ముందు వారిని పలు గంటలపాటు విచారించారు. బ్లాక్ సరఫరా అధికారిగా పోరియహట్‌లో నియమితుడైన అభయ్ నియామకాల్లో అక్రమాలకు సూత్రధారిగా ఉన్నారు. అతడిని జులై 22వ తేదీన సీఐడీ అరెస్టు చేసింది.

## వైద్యంకోసం వచ్చి విగతజీవులై : కోల్‌కతా హోటల్‌లో భారీ అగ్నిప్రమాదం





పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఒక చిన్నారి కూడా ఉంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్ నుంచి వైద్యంకోసం వచ్చిన పలువురు కోల్‌కతాలో న్యూమార్కెట్ సమీపంలోని ఒక హోటల్‌లో బస చేస్తున్నారు. అంతా నిద్రలో ఉన్న సమయంలో అర్ధరాత్రి దాటిన తర్వాత ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్పటికే మంటలు చుట్టుముట్టడంతో వారంతా చిక్కుకుపోయారు. చనిపోయిన తొమ్మిది మంది బంగ్లాదేశ్ జాతీయులని అధికారులు వెల్లడించారు. ఏసీలో పేలుడే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ప్రస్తుతం మంటలు ఆరిపోయాయి. ఈ ఘటనలో ఆరుగురికిపైగా గాయపడ్డారు.
పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి తర్వాత ఒక హోటల్‌లో మంటలు చెలరేగడంతో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఒక చిన్నారి కూడా ఉంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..
ఇటీవలే బెంగాల్ లోని బీర్‌భూమ్ జిల్లా తారాపీఠ్‌లో ఒక హోటల్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. మంటలు చెలరేగడంతో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. గ్రౌండ్‌ఫ్లోర్‌లోని హోటల్ రిసెప్షన్‌లో మొదలైన మంటలు.. క్షణాల్లోనే భవనమంతా వ్యాపించాయి. అప్పుడు అతిథులంతా నిద్రలో ఉండటంతో ప్రాణనష్టం జరిగింది.

## సీజేపీ నిరసనలపై సీఎం విజయ్ ఆదేశాలు.. అంతలోనే యూటర్న్



కాక్రోచ్ జనతా పార్టీ ( వామపక్ష పార్టీలు చేసే నిరసనల్లో విద్యార్థులు పాల్గొనకుండా తమిళనాడు ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దాంతో వెంటనే విజయ్ ప్రభుత్వం యూటర్న్ తీసుకుంది. ఆ ఉత్తర్వులను బుధవారం ఉపసంహరించుకుంది.
విద్యార్థులు, యువత.. సీజేపీ, వామపక్ష పార్టీల నిరసనల్లో పాల్గొనకుండా చూడాలని ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాళ్లకు కళాశాల విద్యాకమిషనర్ నుంచి ఆగస్టు 17న ఉత్తర్వులు అందాయి. ఇందుకోసం పాఠశాల విద్య, ఉన్నత విద్యా విభాగాలు.. పోలీసులు, జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆగస్టు 14న ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆ ఉత్తర్వుల్లో వెల్లడించారు. దీన్నొక అత్యవసర అంశంగా పేర్కొన్న కమిషనర్.. కళాశాలు తీసుకున్న చర్యల వివరాలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు.
నీట్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. వాటికి వామపక్ష పార్టీల నుంచి కూడా మద్దతు లభించింది. ఈ నేపథ్యంలోనే విజయ్ (Vijay) ప్రభుత్వ ఆదేశాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

## ఆజంఖాన్ ట్రస్ట్.. వర్సిటీలో ఈడీ సోదాలు




సమాజ్‌వాదీ పార్టీ నేత, మాజీ మంత్రి ఆజంఖాన్‌కు చెందిన మౌలానా మహమ్మద్ అలీ జౌహర్ ట్రస్ట్, విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు ప్రదేశాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద నమోదైన కేసులో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాంపుర్, సహారన్‌పుర్‌తో పాటు దిల్లీలో మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి. లఖ్‌నవూ కేంద్రంగా పనిచేసే ఈ ట్రస్ట్‌కు ఆజంఖాన్ ప్రధాన ట్రస్టీగా ఉండగా, ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు భాగస్వాములుగా ఉన్నారు.
సోదాల్లో ఇప్పటివరకు ఏమైనా కీలక ఆధారాలు లభించాయా? అనే విషయాన్ని ఈడీ వెల్లడించలేదు. ప్రభుత్వ కాంట్రాక్టుల ద్వారా వచ్చిన నిధులను కొంతమంది ప్రైవేట్ కాంట్రాక్టర్ల సహాయంతో ట్రస్ట్, విశ్వవిద్యాలయం ఆస్తుల నిర్మాణానికి అక్రమంగా మళ్లించారనే ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతోంది.

## ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు.. ఉప్పొంగిన నదులు



ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలకు ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దెహ్రాదూన్‌లో తమసా నది ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తోంది. దీంతో ప్రసిద్ధ తపకేశ్వర్ ఆలయ పరిసరాలు, ఘాట్లు నీట మునిగాయి. రిషికేశ్‌లో గంగానది ఉగ్రరూపం దాల్చడంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. హరిద్వార్‌లో గంగా నది ప్రవాహం ఉద్ధృతంగా మారింది. భారీ వర్షాల నేపథ్యంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం హైఅలర్ట్ జారీ చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## మంచి నీటి పైప్‌లైన్ టెస్టింగ్.. కుంగిన రోడ్డు

మంచి నీటి పైప్‌లైన్ పరీక్ష నిర్వహించగా రోడ్డు కుంగిపోయిన ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో చోటుచేసుకుంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.40 కోట్లతో గోరకుండ్ చౌక్ సమీపంలో రహదారిని నిర్మించారు. ఆ ప్రాంతంలో కొత్తగా వేసిన నర్మదా మంచినీటి పైప్‌లైన్‌ను అధికారులు పరీక్షించగా.. నీరు ఉబికివచ్చి రహదారి కుంగిపోయింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కుంగిన ప్రాంతంలో అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.





# తరుముకొస్తున్న ద్రవ్యోల్బణ భూతం

ఇరాన్-అమెరికా యుద్ధం ఆరంభమైనప్పటి నుంచి భారత్‌లో ద్రవ్యోల్బణం పెరగసాగింది. ఆ ప్రభావం మొదట టోకు ధరల సూచీ(డబ్ల్యూపీఐ)లో, తరవాత వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ)లో కనిపించింది. నిరుడు స్థిరంగా కొనసాగుతూ వచ్చిన టోకు ధరలు కొన్నాళ్లుగా పెరుగుతున్నట్లు డబ్ల్యూపీఐ సూచిస్తోంది. ఇది అల్ప, మధ్యాదాయ వర్గాలకు భారం కానుంది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం ద్వారా ధరల పెరుగుదలను కట్టడి చేసి, దేశార్థిక వృద్ధికి ఊతమివ్వడం అత్యావశ్యకం.

మొన్న ఫిబ్రవరిలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడికి దిగిన తర్వాత హర్మూజ్ జలసంధి దిగ్బంధనం వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఫలితంగా ఇంధన, రవాణా, ఉత్పత్తి ఖర్చులు మరింత భారమవడం ద్రవ్యోల్బణ వృద్ధికి దారితీసింది. దీనికి ఇండియా ఏమీ మినహాయింపు కాదు. జనవరిలో 8.3శాతంగా ఉన్న దేశీయ టోకు ద్రవ్యోల్బణం మేలో 9.68కీ, జూన్ కల్లా 9.87 శాతానికీ చేరింది. తర్వాత వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ) సైతం పెరిగిపోయింది. ఇలా అధికమైన ఉత్పత్తి, పంపిణీ ఖర్చుల భారాన్ని వినియోగదారులపై మోపడంతో ధరలు పెరిగి, ప్రజల కొనుగోలు శక్తి తగ్గింది. దాంతో దేశార్థిక వృద్ధిరేటుపై ప్రతికూల ప్రభావం పడింది. అయితే, ఇటీవల దేశీయ వినియోగదారుల ప్రాధాన్యాల్లో పూర్తి మార్పు కనిపిస్తోంది. వారు తక్కువ ధరల వస్తువుల నుంచి అధిక నాణ్యతగల విలువైన ఉత్పత్తుల వైపు మొగ్గుచూపుతున్నారు. నాణ్యతకూ ఇతర విశిష్టతలకూ అదనపు మొత్తం చెల్లించడానికి ఇష్టపడుతున్నారు. ఫలితంగా తయారీదారులు పెరిగిన ఉత్పత్తి సాధనాల ఖర్చులోనూ, ఉత్పత్తి వ్యయంలోనూ అధిక భాగాన్ని వినియోగదారులపైకి బదిలీ చేయగలుగుతున్నారు. ఇది కుటుంబాల వినియోగ వ్యయంపైనా, మొత్తం జీవన వ్యయంపైనా ఒత్తిడి పెంచుతోంది.

### ప్రాథమిక లెక్కల్లోనే తేడా!

సాధారణ ప్రజలు ఆహారం, నిత్యావసరాలకన్నా పిల్లల విద్య, ఆరోగ్యం, గృహవసతికి ఎక్కువగా ఖర్చుపెడతారు. వీటికయ్యే వ్యయం బాగా పెరిగితే, సంపాదన హరించుకుపోయి కుటుంబాలను అప్పుల్లోకి నెట్టేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో విద్య, ఆరోగ్యం, వైద్యం, గృహవసతికి అయ్యే ఖర్చు సీపీఐలో ఎలా ప్రతిబింబిస్తోంది అనేది కీలక ప్రశ్న. దీనికి సమాధానం వినియోగదారులకు ఏమీ అనుకూలంగా లేదు. వాస్తవంలో విద్య, వైద్యం, గృహవసతికి అయ్యే ఖర్చు సీపీఐలో చూపేదానికన్నా చాలా ఎక్కువగా ఉంటుంది. 2024 నాటి సీపీఐ సూచీలో విద్యకు ఇచ్చిన వెయిటేజీ 3.5 శాతం కాగా, వైద్యం-ఆరోగ్యానికి 6.10 శాతం... తాగునీరు, విద్యుత్ వంటి సేవలతో సహా గృహవసతికి 17.66 శాతం వెయిటేజీ ఇచ్చారు. మూడూ కలిసి 27.26 శాతం అన్నమాట.

వర్ధమాన దేశాలు ఆహారం, నిత్యావసరాలకు అధిక వెయిటేజీనీ; విద్య, ఆరోగ్యం, గృహవసతికి తక్కువ వెయిటేజీనీ ఇస్తాయి. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలేమో దీనికి భిన్నంగా గృహవసతి, తాగునీరు, విద్యుత్ వంటి సేవలకు ఎక్కువ వెయిటేజీ ఇస్తాయి. తద్వారా మెరుగైన జీవన పరిస్థితులను ప్రతిబింబిస్తాయి. ఆహారం, నిత్యావసరాలకు అంతటి ప్రాధాన్యం ఇవ్వవు. వాస్తవానికి చదువుల ఖర్చు సీపీఐ సూచీలో పేర్కొన్నదానికంటే చాలా ఎక్కువగా ఉంటుంది. విద్యకు ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు, సబ్సిడీలను ప్రాతిపదికగా పరిగణించడం వల్లే సీపీఐలో దీనికి కేవలం 3.5 శాతం వెయిటేజీనే ఇచ్చారు. ప్రైవేట్ విద్యాసంస్థలు వసూలు చేసే రుసుములు, ఇతర ఖర్చులు బాగా పెరిగినా... వీటిని సీపీఐ సరిగ్గా ప్రతిఫలించడం లేదు. ఆరోగ్యం, వైద్యం, గృహవసతి విషయంలోనూ అసలు వ్యయంకన్నా సీపీఐలో చూపుతున్నది చాలా తక్కువ! వివిధ వర్గాల వినియోగదారుల ఆర్థికశక్తి వేర్వేరుగా ఉంటుంది. కాబట్టి, వారిపై పెరిగిన సీపీఐ ప్రభావమూ భిన్నంగానే ఉంటుంది. గృహ వినియోగ వ్యయ సర్వే (2023-24) ప్రకారం, గ్రామీణ భారతంలో నెలవారీ సగటు తలసరి వినియోగ వ్యయం సుమారు రూ.4,122 కాగా, పట్టణాల్లో అది రూ.6,996గా తేలింది. నిరుద్యోగ పెరుగుదల సైతం జీవన వ్యయంపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది. పేదలు మరింత పేదలుగా మారడానికి కారణమవుతోంది. ఈ ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రంగా ఉండవచ్చు.

### కుటుంబాలపై ఆర్థిక భారం

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు మన పారిశ్రామిక ఉత్పత్తి సానుకూల వృద్ధిని కనబరిచింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ(ఐఐపీ) వృద్ధి జనవరిలో 5.1శాతం కాగా, జూన్ నాటికి అది 7.3శాతానికి పెరిగింది. తయారీ కార్యకలాపాలు పెరగడం, దేశీయంగా వస్తుసేవలకు గిరాకీ హెచ్చడమే దీనికి కారణం. గత అక్టోబర్-డిసెంబర్ కాలంలో జీడీపీ వృద్ధి 8శాతం ఉండగా, ఈ ఏడాది జనవరి-మార్చిలో అది 7.8 శాతానికి తగ్గింది. అయినప్పటికీ, 2025-26లో జీడీపీ వృద్ధి 7.9 శాతంగా నమోదైంది. 2026-27లోనూ జీడీపీ వృద్ధి కొనసాగుతుందని అంచనా. కానీ అధిక ఇంధన ఖర్చులు, పశ్చిమాసియా సంక్షోభం, ద్రవ్యోల్బణ ఒత్తిడి, బలహీనమైన ప్రైవేట్ పెట్టుబడుల కారణంగా జీడీపీ వృద్ధిరేటు గతేడాది కంటే తక్కువగానే ఉండవచ్చు.

రష్యా-ఉక్రెయిన్, ఇరాన్-అమెరికా యుద్ధాలు సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తున్నాయి. ఇవి ఉత్పత్తి ఖర్చుల పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఫలితంగా ధరలు అధికమై కొనుగోలు శక్తిని తగ్గిస్తాయి. అల్పాదాయ, మధ్యాదాయ కుటుంబాలకు ఆర్థిక సవాళ్లు తప్పవు. వారిని ఆదుకోవడానికి ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, పీడీఎస్ పరిధిలోకి వచ్చే వస్తువులు, నిత్యావసరాల జాబితాను విస్తరించడం ముఖ్యం. సామాజిక సంక్షేమ కార్యక్రమాలనూ బలోపేతం చేయాలి. ఆహారం, ఇంధనం, విద్యుత్, ఎరువులు వంటి వాటికి సబ్సిడీలను కొనసాగించాలి. దిగుమతి ప్రత్యామ్నాయ పథకాల కింద దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి ప్రభుత్వం వస్తు సరఫరాను పెంచడంపై దృష్టి పెట్టాలి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధనకు ఈ చర్యలు తోడ్పడతాయి.



# స్వయం ప్రతిపత్తితోనే విశ్వవిద్యాలయాలకు విశ్వస్థాయి

విశ్వవిద్యాలయం కేవలం డిగ్రీలు ప్రదానం చేసే విద్యాసంస్థ కాదు. జ్ఞానాన్ని సృష్టించే, ప్రశ్నించే, పరిశోధించే, కొత్త ఆలోచనలకు రూపమిచ్చే మేధోకేంద్రం. భారత్ అభివృద్ధి చెందిన, జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఉన్నత విద్యాసంస్థల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి. అందుకు విద్యా, పరిపాలనా స్వయం ప్రతిపత్తి కీలకం. అయితే స్వేచ్ఛకు సమానంగా జవాబుదారీతనం ఉండే వ్యవస్థను రూపొందించడమే అసలైన సవాలు.భారత ఉన్నత విద్యా వ్యవస్థ విస్తృతి దీనిలోని అవకాశాలను స్పష్టం చేస్తోంది. ఏఐఎస్‌హెచ్ఈ 2021-22 ప్రకారం దేశంలో 1,168 విశ్వవిద్యాలయ స్థాయి సంస్థలు, 45,473 కళాశాలలు, 12,002 స్వతంత్ర ఉన్నత విద్యాసంస్థలు ఉన్నాయి. ఉన్నత విద్యలో విద్యార్థుల సంఖ్య 4.33 కోట్లకు చేరింది. 2014-15లో 3.42 కోట్లుగా ఉన్న విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ఇది సుమారు 26.5 శాతం పెరుగుదల. ఇంత భారీ వ్యవస్థను ఒకే తరహా నియంత్రణలతో నడపడం కంటే, నాణ్యతకు సంబంధించిన జాతీయ ప్రమాణాలను కొనసాగిస్తూ సంస్థలకు అవసరమైన నిర్ణయ స్వేచ్ఛ కల్పించడం సమర్థవంతమైన మార్గం.

కొత్త కోర్సులు ప్రారంభించడం, పరిశ్రమలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేయడం, పరిశోధన ప్రాధాన్యాలను నిర్ణయించడం, అంతర్జాతీయ సంస్థలతో సహకారం పెంచడం వంటి అంశాల్లో విశ్వవిద్యాలయాలు వేగంగా నిర్ణయాలు తీసుకోగలగాలి. ముఖ్యంగా కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, బయోటెక్నాలజీ, క్వాంటమ్ టెక్నాలజీ వంటి రంగాల్లో పరిణామాలు వేగంగా జరుగుతున్నందున, సంవత్సరాల తరబడి అనుమతుల కోసం ఎదురుచూసే వ్యవస్థ ఆవిష్కరణలకు అనుకూలం కాదు.

అయితే స్వయం ప్రతిపత్తి అంటే నియంత్రణ నుంచి మినహాయింపు కాదు. విద్యా నాణ్యత, పరిశోధన ప్రమాణాలు, ఆర్థిక పారదర్శకత, అధ్యాపకుల నాణ్యత, విద్యార్థుల ప్రయోజనాలపై స్పష్టమైన ప్రమాణాలు ఉండాలి. ప్రతి నిర్ణయంలో జోక్యం చేసుకోవడం కంటే నియంత్రణ సంస్థలు ప్రమాణాలను నిర్దేశించి, ఫలితాలను పర్యవేక్షించే పాత్ర పోషించాలి. స్వయం ప్రతిపత్తి పొందిన సంస్థలు ప్రతి మూడు లేదా ఐదేళ్లకు పరిశోధన, పేటెంట్లు, స్టార్టప్‌లు, విద్యార్థుల ఉపాధి, పరిశ్రమ భాగస్వామ్యాలు, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలపై పనితీరు నివేదిక సమర్పించే విధానం ఉండాలి.

పరిశోధన విషయంలోనూ దృష్టికోణం మారాలి. నిధులు పెంచడం మాత్రమే కాకుండా, పరిశోధకులకు వాటిని వినియోగించే స్వేచ్ఛ, వేగవంతమైన పరిపాలనా అనుమతులు, ఆధునిక ప్రయోగశాలలు, పరిశ్రమలతో అనుసంధానం అవసరం. ప్రస్తుతం కేంద్రం పరిశోధన–ఆవిష్కరణలకు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోంది. 2025లో ఆమోదించిన రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ పథకానికి రూ.1 లక్ష కోట్ల కేటాయింపు ఉంది. దీని ద్వారా ప్రైవేటు రంగం కూడా కీలక పరిశోధనల్లో భాగస్వామి కావాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది.

ఈ నిధులు విశ్వవిద్యాలయాల ప్రయోగశాలల్లోనే ఆగిపోకుండా పేటెంట్ నుంచి ఉత్పత్తి వరకు, పరిశోధన నుంచి స్టార్టప్ వరకు ప్రయాణించాలి. పరిశ్రమలు పాఠ్యాంశాల రూపకల్పనలో భాగస్వాములు కావాలి. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, అప్రెంటిస్‌షిప్‌లు అందాలి. అధ్యాపకులకు కూడా పరిశోధన, పరిశ్రమ ప్రాజెక్టులు, అంతర్జాతీయ సహకారాల్లో పనిచేసే స్వేచ్ఛ కల్పించాలి.

స్వయం ప్రతిపత్తి అగ్రశ్రేణి సంస్థలకే పరిమితం కాకూడదు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ ఉన్నత విద్యాసంస్థలకు కూడా పనితీరు, నాణ్యత ఆధారంగా దశలవారీగా స్వేచ్ఛ ఇవ్వాలి. చివరికి ఈ సంస్కరణకు కొలమానం విశ్వవిద్యాలయానికి లభించిన అధికారాలు కాదు; విద్యార్థికి లభించిన మెరుగైన విద్య, పరిశోధన అవకాశం, నైపుణ్యం, ఉపాధి, ఆవిష్కరణ సామర్థ్యం కావాలి.

స్వయం ప్రతిపత్తి హక్కు మాత్రమే కాదు.. మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇచ్చే బాధ్యత. విశ్వవిద్యాలయాలకు స్వేచ్ఛ, అధ్యాపకులకు పరిశోధనా స్వాతంత్ర్యం, విద్యార్థులకు ప్రయోగాత్మక అవకాశాలు, సంస్థలకు స్పష్టమైన జవాబుదారీతనం కలిసినప్పుడే భారత ఉన్నత విద్య వ్యవస్థ డిగ్రీల పంపిణీ కేంద్రం నుంచి దేశ భవిష్యత్తును నిర్మించే జ్ఞానశక్తిగా మారుతుంది.

(హెచ్.ప్రతాప్)

# పొంచివున్న నైపుణ్యాల సంక్షోభం

ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఆందోళనలు ఉవ్వెత్తున ఎగసి విస్తరించటం దేశాన్ని నివ్వెరపరిచింది. 'నీట్' పరీక్షాపత్రం లీక్ పట్ల ఆగ్రహంగా మొదలైన యువత నిరసన.. చివరకు పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక నిరాశా నిస్పృహల పట్ల ప్రతిఘటనోద్యమంగా పరిణమించింది. డిగ్రీలున్నా ఉద్యోగాలు రాకపోవటం, ఆకాంక్షలు పెరుగుతున్నా తగినంతగా అవకాశాలు లేకపోవటం యువతను తిరగబడేలా చేసింది. ప్రవేశ పరీక్షాపత్రం లీకవటం యువతను సమీకరించే ఒక నిప్పురవ్వ మాత్రమే. దాని వెనక దాగివున్న సంక్షోభం నిజమైనది, సంక్లిష్టమైనది.పాఠశాలల్లో కావచ్చు, కాలేజీల్లో కావచ్చు.. మన విద్యావ్యవస్థ చాలామేర కుప్పకూలింది. పిల్లల్లో 80శాతం మంది స్కూలు విద్యలో పాసవుతున్నారు కానీ, వారికి చదువులో ఎటువంటి నిజమైన పునాదీ ఉండటం లేదు. ఇందులో వారి తప్ప కూడా ఏమీ లేదు. బట్టీపట్టటం ద్వారా నేర్చుకోవటం, మూకుమ్మడి కాపీయింగ్‌లతో పాసవటం అనే అవ్యవస్థ వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోంది.రెండోది, విద్యార్థులు ఏం నేర్చుకున్నారో బేరీజు వేసే పరీక్షా పద్ధతులు అర్థరహితంగా ఉండటంతో.. అత్యధిక శాతం ఆరాటపడే 'స్టెమ్' (సైన్స్–టెక్నాలజీ–ఇంజినీరింగ్–మ్యాథ్స్) కోర్సుల్లో చేరేందుకు ప్రత్యేకంగా పోటీ ప్రవేశ పరీక్షలు అవసరమయ్యాయి. మూడోది, చాలా సందర్భాల్లో రాష్ట్రాలు నిర్వహించే పరీక్షా పద్ధతుల్లో విశ్వసనీయత లోపిస్తోంది. బోర్డు ప్రమాణాల్లో రాష్ట్రాల మధ్య భారీ అంతరం ఉంటోంది. దీంతో, ప్రామాణిక, నిష్పాక్షిక, న్యాయమైన బేరీజు కోసం దేశవ్యాప్తంగా ఒకే ప్రవేశ పరీక్ష అవసరమవుతోంది.



నాలుగోది, వైద్య కళాశాలలు పుట్టగొడుగుల్లా పెరిగినప్పటికీ, ఎంపిక చేసిన కొన్ని కళాశాలలు మాత్రమే యువ మెడికోలకు కనీస ప్రమాణాల శిక్షణను అందించగలుగుతున్నాయి. కాబట్టి, లక్షలాది మందికి వైద్య కళాశాలల్లో సీట్లు అందుబాటులో ఉన్నా, మెరుగైన కొన్ని కళాశాలలకే డిమాండ్ ఉంది. వాటిల్లో చేరేందుకు ఉత్తమ ర్యాంకుల కోసం విపరీత పోటీ ఉంటోంది.

అయిదోది, మెడికల్ పోటీ ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసే డిమాండ్‌కు అనుగుణంగా అనేక కోచింగ్ సెంటర్లు వెలిశాయి. పదవ తరగతి తర్వాత శిక్షణ–చదువును విభాగాలవారీ ప్యాకేజీలతో అందించనారంభించాయి. పోటీ, పాఠశాల పునాదులు బలహీనంగా ఉండటం వల్ల.. ఆ రెండేళ్లపాటు యువ విద్యార్థులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు.

ఇంత మితిమీరిన ఒత్తిడి వాతావరణంలో, పరీక్షా పత్రం లీక్ అయిందంటే– అది యువతకు, వారి తల్లిదండ్రులకు శరాఘాతమే. ఈ నేపథ్యంలో నీట్ పేపర్ లీక్ అంతటి అలజడికి దారితీయటంలో ఆశ్చర్యమేమీ లేదు. విద్యార్థులు, తల్లిదండ్రుల బాధను గ్రహించి కేంద్ర ప్రభుత్వం సహానుభూతితో సకాలంలో బలంగా స్పందించి ఉండాల్సింది. రాజకీయంగా సున్నితంగా వారితో కూర్చుని మాట్లాడాల్సింది. అలాగాక, సవాలక్ష సమస్యల్లో ఇదొకటి అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరించింది. భారీఎత్తున యువత స్వచ్ఛందంగా తరలివచ్చే ఓ ఉద్యమానికి నిప్పురవ్వ రాజుకుంటోందని అంచనా వేయలేకపోయింది.

అధికారాన్వేషణలో మునిగితేలే మనలాంటి సమాజంలో ఇలాంటి తక్షణ రాజకీయ పర్యవసానాలు రసవత్తరంగా అనిపిస్తాయిగానీ, మనం ఆ నిప్పురవ్వను దాటి ఆలోచించాలి. ఏమాత్రం ఆజ్యం తగిలినా ఓ పెద్ద విస్ఫోటనానికి దారితీసే మూలాల్ని క్షుణ్ణంగా పరిశీలించాలి. మన 'విద్య–నైపుణ్యాలు– ఉపాధి అవకాశాల' అభివృద్ధి వలయాన్ని దెబ్బతీసే ఒక లోతైన సంక్షోభం అందులో దాగివుంది.

ప్రస్తుతం మన దేశంలో ప్రతిష్ఠాత్మక కోర్సుల్లో చేరుతున్నవారికి కూడా నైపుణ్యాలు ఉండటం లేదు. ఉద్యోగాల్లోకి తీసుకోవటానికి చాలామందికి తగిన నైపుణ్యాలు లేవు. 13.5 లక్షల మంది ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో కేవలం 15-20శాతం మందికే ఉద్యోగాలకు తగిన కనీస నైపుణ్యాలున్నాయని అంచనా.

ఏళ్ల తరబడి కాలేజీల్లో చదువుకున్నాక, ఒక విలువ లేని డిగ్రీతో యువత బయటకు వస్తున్నారు. వైద్య గ్రాడ్యుయేట్లకు కూడా శిక్షణ అరకొరగా ఉంటోంది. పట్టభద్రుల సంఖ్యతో పొంతన లేకుండా వైద్య పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లు అతితక్కువ సంఖ్యలో ఉండటంతో, అందులో చేరగలగటం భగీరథ ప్రయత్నంలా మారుతోంది. ఎలాగోలా మరో ప్రవేశపరీక్షలో నెగ్గి, పోస్టుగ్రాడ్యుయేట్ శిక్షణ తీసుకున్న తర్వాత కూడా, వైద్య వృత్తి ప్రాక్టీస్‌కి తగిన నైపుణ్యాలు, నమ్మకం కోసం పేరొందిన వైద్య నిపుణుల వద్ద కొన్నేళ్లపాటు సహాయకులుగా పనిచేయాల్సి వస్తుంది. ఎంతో విలువైనవిగా భావించే 'స్టెమ్' కోర్సుల పరిస్థితే ఇంత ఇబ్బందికరంగా ఉంటే, ఇతర అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఏటా చేరే సుమారు 90లక్షల మంది విద్యార్థుల పరిస్థితేమిటో ఊహించుకోవచ్చు.

ఉద్యోగ మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా మారిపోతోంది. యూనివర్సిటీ డిగ్రీలు అంతేవేగంగా ప్రాధాన్యాన్ని కోల్పోతున్నాయి. ఈ చదువులోనూ అత్తెసరు ప్రమాణాలుంటే.. ఇక ఆ దుస్థితికి అంతుండదు. కాబట్టి, నైపుణ్యాల అంతరం అనేది మనం తక్షణం దృష్టి సారించాల్సిన అంశం.

ఏ ఆధునిక ఆర్థిక వ్యవస్థకయినా అత్యున్నత నైపుణ్యాలున్న టెక్నోక్రాట్లు పరిమిత సంఖ్యలోను, నైపుణ్యాలున్న శ్రామిక ఉద్యోగులు పెద్దసంఖ్యలోను అవసరం. కానీ భారత్‌లో ఆ పిరమిడ్ తలకిందులుగా ఉంది. భారత్‌లో కేవలం 50శాతం ఐ.టి.ఐ సీట్లు భర్తీ అవుతున్నాయి. కొద్దిమంది యువత మాత్రమే ఐ.టి.ఐల్లో చేరుతున్నారు (సుమారు 13.20 లక్షలు). పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ఇంకా తక్కువమంది (సుమారు 6.4లక్షలు) విద్యార్థులు నమోదు చేసుకుంటున్నారు. ఇంజినీరింగ్‌లో చేరేవారితో (13.54లక్షలు) పోలిస్తే, వారి సంఖ్య అలా తక్కువగా ఉండటం ఏ అభివృద్ధి చెందిన దేశంలోనూ కనిపించని సరళి. ఈ కోర్సులన్నిటిలోనూ ఎక్కువమంది విద్యార్థులు నిజమైన నైపుణ్యాలు, ఉత్పాదకత లేకుండా కేవలం సర్టిఫికెట్లు, డిగ్రీలు అందుకుంటారు.

చైనా ప్రతి సంవత్సరం 16.62 లక్షల మంది ఇంజినీర్లకు అద్భుతమైన శిక్షణనిస్తుంది. వారంతా నిజమైన టెక్నోక్రాట్లు, నైపుణ్యాలున్న ఇంజినీర్లు. అదేవిధంగా, ఆ దేశం వృత్తి విద్యలో 56.40 లక్షల యువతకు నిజమైన నైపుణ్యాల్ని అందిస్తుంది. చైనాలో పాఠశాల విద్య పునాదులు కూడా చాలా ప్రామాణికంగా ఉన్నాయి.

మనం స్కూళ్లు, కళాశాలలను దాదాపు అందరికీ అందుబాటులోకి విస్తరించాం. కానీ కొన్ని ఖరీదైన విద్యాసంస్థల్లో తప్ప, చాలా సందర్భాల్లో చదువుల నాణ్యత అధ్వానంగా ఉంటోంది. ఈ మొత్తంలో బాధితులు– మధ్యతరగతి, పేద కుటుంబాల విద్యార్థులు, తల్లిదండ్రులు. సంపదసృష్టిలో 'జెన్ జీ'కి నిజమైన అవకాశం లభించాలంటే, మన విద్యను, నైపుణ్యాల అభివృద్ధిని సమూలంగా మార్చుకోవాలి.

ఆపైన సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలను సృష్టించటానికి మనం చేయాల్సింది చాలా ఉంది. అది వేరే చర్చ. నిశితంగా పరిశీలించే ప్రతి ఒక్కరికీ విద్యారంగంలో ప్రస్తుతం నెలకొన్న సంక్షోభం గురించి తెలుసు. యువ జనాభాపరంగా మనకున్న అద్భుతావకాశాల్ని మనం వృథా చేసుకుంటున్నాం. ఆ అవకాశం ఎల్లకాలం కొనసాగదు. త్వరలో ముగుస్తుంది. త్వరపడి, దృఢ సంకల్పంతో వ్యవహరిస్తేనే అవకాశాన్ని మనం సద్వినియోగం గావించుకోగలం. రాజకీయంగా ఒక స్థూల ఏకాభిప్రాయానికి రావాల్సిన అంశమిది. ఎందుకంటే, ప్రతి పార్టీకీ ఇందులో గరిష్ఠ వ్యూహాత్మక రాజకీయ ప్రయోజనం దాగివుంది. విద్యను నియంత్రించేది రాష్ట్రాలు కాబట్టి, ఎక్కువ కార్యాచరణ రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటుంది. రాజకీయాలు, పరిపాలన, పౌర సమాజం, మీడియా, విద్యారంగంలోని మనమంతా సంఘటితమై నిర్మాణాత్మక, సృజనాత్మక పరిష్కారంతో ఈ సంక్షోభంపై స్పందించాల్సి ఉంది. ఆయాసం తప్ప ఫలితంలేని పడికట్టు పదాలకు, చేసిన తప్పుల్నే మళ్లీ మళ్లీ చేసే యథాతథ పాలనా ధోరణికి ఇక కాలం చెల్లింది. మనం ఈ సవాలుకు దీటుగా, యుద్ధ ప్రాతిపదికన స్పందించకపోతే.. ఈ సంక్షోభం మన రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్ని, సమాజాన్ని కమ్మేస్తుంది. మన భవిష్యత్తును కుంగదీస్తుంది.

# యూపీఐ కళ తప్పకూడదంటే...

బడ్డీకొట్లు మొదలు సూపర్ మార్కెట్ల దాకా అన్నిచోట్లా నేడు నగదు లావాదేవీలు చాలావరకు తగ్గిపోయాయి. క్యూఆర్ కోడ్ స్కానర్ల సాయంతో చెల్లింపులు సర్వసాధారణమయ్యాయి. డెబిట్, క్రెడిట్ కార్డులు ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ నగదుపైనే అధికంగా ఆధారపడిన భారత ఆర్థిక వ్యవస్థను డిజిటల్ బాట పట్టించడంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్(యూపీఐ) కీలక పాత్ర పోషించింది. అంతర్జాతీయ రియల్‌టైమ్ చెల్లింపుల్లోనూ 49శాతం వాటాతో యూపీఐ అగ్రస్థానంలో నిలుస్తోంది. ఎప్పుడైనా ఎవరికైనా సులువుగా సురక్షితంగా వేగంగా డబ్బు పంపే వీలుండటంతోపాటు సంబంధిత సేవలు ఉచితంగా లభిస్తుండటం వల్లే యూపీఐ ఇంతగా జనాదరణ పొందగలిగింది. రోజువారీ జనజీవితాల్లో విడదీయరాని భాగమైపోయిన యూపీఐపై సేవా రుసుముల విధింపు గురించి ఆర్‌బీఐ గవర్నర్ నిరుడు ప్రస్తావించినప్పుడు గగ్గోలు రేగింది. అంతకు ముందూ అలాంటి కథనాలే వెలువడటం కలకలం సృష్టించింది. కేంద్రం వాటిని ఖండించింది. కానీ, ఇప్పుడు నిర్దేశిత యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్) విధించే దిశగా అడుగులు పడుతుండటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. లెక్కాపత్రం ఉండని నగదు లావాదేవీలను తగ్గించి ఆర్థిక వ్యవస్థలో పారదర్శకతను పెంపొందించిన యూపీఐ కళ తప్పకూడదంటే- సామాన్య వినియోగదారులు, చిన్న వ్యాపారులపై రుసుముల భారం పడకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలి!



పదేళ్ల కిందట ఉనికిలోకి వచ్చిన యూపీఐ మహానగరాల నుంచి మారుమూల పల్లెల వరకు అన్ని వర్గాల ప్రజలకూ చేరువైంది. ఈ క్రమంలో మొన్న జూన్ నాటికి దేశవ్యాప్తంగా యూపీఐ వినియోగదారుల సంఖ్య 55.49 కోట్లకు చేరింది. అయిదేళ్లలోనే యూపీఐ లావాదేవీల పరిమాణం 425శాతం పెరిగింది. కిందటి ఆర్థిక సంవత్సరంలో వాటి సంఖ్య 24వేల కోట్లకు పైబడింది. 202122లో రూ.84లక్షల కోట్లుగా ఉన్న యూపీఐ లావాదేవీల విలువ 202526లో సుమారు రూ.314లక్షల కోట్లకు చేరింది. దేశీయ డిజిటల్ చెల్లింపుల్లో యూపీఐ వాటా 85శాతం అయినప్పటికీ, వాటిలో చిన్న మొత్తాల బట్వాడాలే ఎక్కువ. లెక్కకుమిక్కిలిగా జరుగుతున్న ఆ చెల్లింపులను సజావుగా పూర్తిచేయడానికి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఇతర సర్వీస్ ప్రొవైడర్లకు సర్వర్లూ నెట్‌వర్క్ నిర్వహణ, సైబర్ భద్రతా ఖర్చులు బాగా అవుతున్నాయంటున్నారు. కేంద్రం అందిస్తున్న ఆర్థిక తోడ్పాటుతోపాటు ఎండీఆర్ ద్వారా మార్కెట్ నుంచి కొంత సొమ్ము సమకూరితే యూపీఐ సేవలను మరింత సమర్థంగా అందించడానికి వీలుచిక్కుతుందని చెబుతున్నారు. నిర్ణీత పరిమితికి మించిన లావాదేవీలపై వ్యాపారులే రుసుము చెల్లించాల్సి ఉంటుందని, వినియోగదారులపై ప్రభావం పడదని ప్రభుత్వం భరోసా ఇస్తోంది కానీ, కీలక సమస్యలు కొన్ని తలెత్తే ప్రమాదముంది! ఎండీఆర్ రూపంలో తమపై పడే భారాన్ని వస్తువుల ధరల పెంపు ద్వారా వినియోగదారులపై మోపడానికి బడా వ్యాపారులు ప్రయత్నించవచ్చు. లేదంటే నగదు లావాదేవీలవైపే మొగ్గుచూపవచ్చు. అదే జరిగితే నల్లధనం, పన్ను ఎగవేతల ముప్పు తీవ్రతరమవుతుంది. ప్రజలు మళ్లీ ఏటీఎంల చుట్టూ తిరగాల్సి వస్తుందని, చిల్లర సమస్య సైతం తరుముకొస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎండీఆర్ అమలులోకి వస్తే సగం మందికి పైగా వినియోగదారులు అధిక విలువ కలిగిన లావాదేవీలకు యూపీఐని వాడటం మానేయవచ్చునని ఇటీవల 322 జిల్లాల్లో జరిగిన ఒక సర్వేలో తేలింది. ఆ పరిస్థితే వస్తే, అది డిజిటల్ ఇండియా లక్ష్యాల సాధనకు విఘాతమవుతుంది. కాబట్టి జనభారత దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకుని ఎండీఆర్ విషయంలో ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాలి.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం | 20.08.2026 | 01

## అర్హత కలిగిన యువతి, యువకులకు అకాడమిక్ ఇన్స్పెక్టర్ పోస్టులు.

- ప్రభుత్వ పాఠశాలల్లో అకాడమిక్ ఇన్స్పెక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి..
- ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్.

**ధర్మవరం ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్:**

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో గల 24 ప్రభుత్వ పాఠశాలలో అకాడమీ ఇన్స్పెక్టర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్కూల్ అసిస్టెంట్లకు 12,500 రూపాయలు, ఎస్జిటి టీచర్లకు పదివేల రూపాయలు వేతనం ఉంటుందని తెలిపారు. ఎస్జీటీ పోస్టులు 6, హిందీ 7, తెలుగు 10, గణితం 01, ఫిజికల్ సైన్స్ 2, ఆంగ్లము 01 మొత్తం 27 పోస్టులు భర్తీ చేయనున్నామని తెలిపారు. ఇందులో అకాడమిక్ సంబంధించి 75 శాతము ప్రొఫెషనల్ కు 25 శాతం ప్రాతిపదికగా తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. అదేవిధంగా స్థానికతను కూడా తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు. ఆగస్టు 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కావున నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగునీటి సరఫరాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- రెండేళ్లలో రూ.25 కోట్లతో 548 పనులు చేపట్టాం.
- రెండేళ్ళలో 1800కోట్లతో పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేశాం.
- చంద్రబాబు ముందుచూపు వల్లే ఏలేరు ఆయకట్టుకు నీరిస్తున్నాం.
- అసెంబ్లీలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు.

**అమరావతి ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్**

ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు సాగు, తాగు నీటి సరఫరా పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సూచనల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. బుధవారం అసెంబ్లీలో యల్లసిరి కెనాల్ పనులు, ఏలేరు జలాశయం పరిధిలోని ఆయకట్టుకు నీటి సరఫరాపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చారు. ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల సూచనలతో ఇటీవలే అధికారులు, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టామని మంత్రి తెలిపారు.పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేలోపు ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టుకు నీరందించాలనే ముందుచూపుతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంను నిర్మించారని పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో వంటి క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ 53 వేల ఎకరాల



ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు, 1.48 లక్షల ఎకరాల పుష్కర ఆయకట్టుకు సాగు, తాగునీరు అందిస్తున్నామని తెలిపారు.గత ప్రభుత్వం ఉత్తరాంధ్రకు సాగు, తాగునీరు అందించే పోలవరం ఎడమ కాలువ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, కనీసం తట్టమట్టి పని కూడా చేయలేదని మంత్రి విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే పోలవరం ఎడమ కాలువ పనులపై రూ.1,800 కోట్లు ఖర్చు చేసి, అత్యంత క్లిష్టమైన పాంపా, తాండవ, ఏలేరు నదుల క్రాసింగ్ పనులతో పాటు 11 హైవే క్రాసింగ్ వంతెనల పనులను పూర్తి చేశామని తెలిపారు. పురుషోత్తపట్నం లిఫ్ట్ స్కీంతో పాటు పోలవరం ఎడమ కాలువ పనులను ముందుకు తీసుకెళ్లడం వల్లే ఏలేరు ఆయకట్టుకు సాగు, తాగు నీరు అందించే పరిస్థితి ఏర్పడిందని మంత్రి స్పష్టం చేశారు.ప్రస్తుతం ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు సాగునీటి అవసరాల కోసం 950 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఏలేరు ఆయకట్టుకు ఇప్పటివరకు 2.6 టీఎంసీల నీటిని పంపిణీ చేశామని మంత్రి వెల్లడించారు. గత ఐదేళ్ల పాలనలో ఏలేరు నదీగర్భంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాల కారణంగా బెడ్ లెవల్ పడిపోయిందని, దీంతో గ్రావిటీ ద్వారా నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. గత ప్రభుత్వం ఏలేరు ఆయకట్టు పరిధిలో నిర్వహణ, మరమ్మతుల (O&M) పనులకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే ఏలేరు రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో 548 O&M పనులకు రూ.25 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందని తెలిపారు. ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏలేరు ఆయకట్టుకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు మరో రూ.15.84 కోట్లతో O&M పనులకు ప్రతిపాదనలు పంపామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ఏలేరు ఆయకట్టు రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు నిరంతరం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

## వరల్డ్ ఫోటోగ్రఫీ డే సందర్భంగా వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ దుర్గా ప్రసాద్‌ను అభినందించిన మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్**

.ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తన వ్యక్తిగత ఫోటోగ్రాఫర్ దేవినేడి దుర్గా ప్రసాద్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి పర్యటనలు, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజలతో మమేకమైన పలు అరుదైన మరియు ఆకట్టుకునే చిత్రాలతో కూడిన ఆల్బమ్‌ను సచివాలయంలో మంత్రి దుర్గేష్ కి చూపించారు. ప్రతి చిత్రాన్ని ఆసక్తిగా తిలకించిన మంత్రి దుర్గేష్ ఆయనలోని నైపుణ్యాన్ని, పనిపట్ల ఉన్న నిబద్ధతను ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. "ఒక దృశ్యం వేయి మాటలతో సమానం. ఫోటోగ్రఫీ అనేది కేవలం ఒక చిత్రం తీయడం మాత్రమే కాదు.. అది కాలంతో పాటు నిలిచిపోయే ఒక గొప్ప భావోద్వేగం, మరచిపోలేని జ్ఞాపకం. నిత్యం క్షేత్రస్థాయిలో మన వెంట ఉంటూ, ప్రజల సేవలో మనం తీసుకునే నిర్ణయాలు, పాల్గొనే అభివృద్ధి కార్యక్రమాలను సమాజానికి, మీడియాకు స్పష్టంగా చేరవేయడంలో ఫోటోగ్రాఫర్ల పాత్ర అత్యంత కీలకమైనది అన్నారు.కాలంతో పాటు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ, సమాజంలో జరుగుతున్న విశేషాలను తమ కెమెరా కంటితో బంధించి ప్రపంచానికి అందిస్తున్న ఫోటోగ్రాఫర్లందరికీ ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ హృదయపూర్వక ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యవసాయ, అనుబంధ శాఖలపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష..



**అనంతపురం, ఆగస్టు 19 :అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులతో ప్రైమరీ సెక్టార్ పై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సమీక్ష నిర్వహించారు. ముందుగా గత ప్రైమరీ సెక్టార్ సమావేశంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖ అధికారులు తీసుకున్న చర్యలను జాయింట్ కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈపంట డిజిటల్ క్రాప్ సర్వే 68 శాతంపైగా పూర్తి కాగా, పూర్తిగా చేపట్టాలన్నారు. జిల్లాలో 502 గ్రామాల పరిధిలో 48,900 ఎకరాల్లో హాఫ్ మూన్ మోడల్ లో పంటల సాగు చేయాల్సి ఉండగా, ఇందులో పురోగతి తక్కువగా ఉందని, మరింత పెంచాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీలో (ఏపీఎఫ్ఆర్)లో రైతుల రిజిస్ట్రేషన్ మరింత చేపట్టాలన్నారు. హార్టికల్చర్ పంటల పరిధిలో ఈ క్రాప్ బుకింగ్ వచ్చే నెల 15వ తేదీలోపు పూర్తిగా చేపట్టాలని ఆదేశించారు. పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి డిసిఓ పరిధిలో పిఏసిఎస్ లో ఒకటి పైలెట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టాలని, ఇందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కెసిసి కార్డులు ఉన్న మత్స్యకారులకు బ్యాంకులలో రుణాలు ఇవ్వడం లేదని, రుణాలు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంకి సూచించారు.ఇందులోభాగంగా ఈ ఖరీఫ్ లో మైనస్ 36 శాతం వర్షపాతం తక్కువగా నమోదు కావడం జరిగిందని, జిల్లాలో సాధారణ పంటల సాగు విస్తీర్ణం 3,43,394 హెక్టార్లకు గాను, 1,87,598 హెక్టార్లలో అనగా 55 శాతం మాత్రమే పంటల సాగు చేయడం జరిగిందని, వేరుశెనగ 30 శాతం మాత్రమే సాగు కాగా, కంది 116 శాతం సాగు కావడం జరిగిందని, ఎల్‌నినో పరిస్థితుల వల్ల ఐడి పంటలు సాగు చేసుకోవాలని రైతులకు తెలియజేయదం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన, సిరికల్చర్, ఎపిఎంఐపి, పశుసంవర్ధక శాఖ, మార్క్ఫెడ్, మార్కెటింగ్, డ్వామా, తదితర శాఖల పరిధిలో ఆయా కార్యక్రమాల ప్రగతి గురించి జాయింట్ కలెక్టర్ సమీక్ష చేశారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, డ్వామా పిడి సలీమ్ భాష, ఎల్డిఎం మారుతి శ్రీనివాసులు, ఏపీసీఎన్ఎఫ్ ఎస్పీఎం డా.నవీన్, కెవికె శాస్త్రవేత్త మల్లీశ్వరి, జిల్లా సెరికల్చర్ అధికారి మెహతాజి సుల్తాన్, జిల్లా ఫిషరీస్ అధికారి విజయకృష్ణ, మార్కెటింగ్, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మరో మారు పందుల చోరీ



- వరుస చోరీలతో బెంబేలేత్తుతున్న బాధితులు
- అనుమానితులను ఎందుకు వదిలేశారు...?

**యల్లనూరు, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్;**

యల్లనూరు మండల కేంద్రంలో ఎరికల కులస్తులకు చెందిన 60 పందులను మంగళవారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు మరోమారు దొంగలించడంతో బాధితుడు ఎరికల నాగన్న లబోదిబోమంటున్నారు. ఈనెల మూడో తేదీన 38 పందులను ఎత్తుకెళ్లారని దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడం కూడా జరిగిందని ఇంతలోపే మరో మారు 60 పందులను ఎత్తుకెళ్లడంపై బాధితులు బోరున విలపించాడు. ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు తనపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారంటూ వాపోయాడు.

**అనుమానితులు ఏమయ్యారు.....**

ఈ నెల మూడో తేదీన 38 పందులను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించగా సీసీ కెమెరాలు, కొందరు సాక్షుల, వివిధ సాంకేతిక ఆధారాలతో పోలీసులు అనంతపురం కు చెందిన పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న అనుమానితులను పోలీసులు వెంటనే వదిలేశారని బాధితులు తెలిపారు. దీనిపై పోలీసులను అడిగితే తమ మీదే కోపాన్ని ప్రదర్శిస్తున్నారంటూ వాపోయారు. కేసు విచారణలో ఉండగానే మరో మారు పందులు చోరీ అయ్యాయి అంటే ఇక తమ పరిస్థితి ఏమిటి అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పోలీసులు తనకు న్యాయం

# థాంక్యూ సర్..

- సీఎం చంద్రబాబుకి ఎమ్మెల్యే దగ్గుపాటి నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి కృతజ్ఞతలు
- ముఖ్యమంత్రి చంద్రబాబుని ప్రత్యేకంగా కలిసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**విజయవాడ ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్**

ఒక సామాన్య క్లస్టర్ ఇంచార్జ్ కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకుకి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నూతన ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర సామాజిక వర్గానికి చెందిన రమాదేవిని ఎమ్మెల్సీగా ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మరియు రమాదేవి దంపతులు, ముఖ్యమంత్రి చంద్రబాబుని ప్రత్యేకంగా కలిశారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి రమాదేవితో పాటు ఆమె భర్త టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దళవాయి వెంకటనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు. అనంతపురం నియోజకవర్గంలోని టిడిపి క్లస్టర్ ఇంచార్జ్, వడ్డెర సామాజిక వర్గానికి చెందిన మహిళకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు... ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కూడా కృతజ్ఞతలు తెలిపారు.ఎమ్మెల్యే తో



పాటు జిల్లాలో ప్రజా ప్రతినిధులు అందరితో కలిసి సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రమాదేవికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు వస్తాయి అని చెప్పడానికి ఇది ఒక నిదర్శనమని అన్నారు. ఒక సామాన్య బీసీ మహిళకు ఎమ్మెల్సీ పదవి రావడం అన్నది చిన్న విషయం కాదని.. తెలుగుదేశం పార్టీతోనే ఇది సాధ్యమని అన్నారు.

అనంతపురం జిల్లాకు చెందిన బీసీ మహిళలకు ఎమ్మెల్సీ అవకాశం అందించడంపై సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు నూతన ఎమ్మెల్సీ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా పనిచేస్తానని చెప్పారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి కచ్చితంగా న్యాయం చేస్తానని ఆమె తెలిపారు.

# మేయర్, మున్సిపల్ చైర్మన్‌లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు

- ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన మంత్రి నారాయణ

**అమరావతి ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలు కల్పించే ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ శాసనసభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మేయర్, మున్సిపల్ చైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న నేపథ్యంలో, ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను ప్రతిపాదించింది.

**1986 వరకు పరోక్ష ఎన్నికలు**

బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, 1986 వరకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని తెలిపారు. అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని, 2005 నుంచి ఇప్పటి వరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని వివరించారు. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు.

**ప్రత్యక్ష ఎన్నికలతో అనేక ప్రయోజనాలు**

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్ లేదా చైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని వివరించారు.

**వేగవంతమైన నిర్ణయాలకు అవకాశం**

ప్రత్యక్ష ఎన్నికల విధానంతో మేయర్, చైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**వివిధ శాఖలతో మెరుగైన సమన్వయం**

అభివృద్ధి పనుల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యక్ష ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు అవకాశం ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు.

**పెట్టుబడులు, పరిశ్రమలు, టూరిజం ప్రోత్సాహం**

నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని చురుకుగా ప్రోత్సహించేందుకు మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌కు మరింత అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

**రాజకీయ ప్రభావం తగ్గుతుంది**

ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా చైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నాయకత్వం ద్వారా పట్టణాభివృద్ధిపై మరింత సమర్థవంతంగా దృష్టి సారించవచ్చని చెప్పారు. అదేవిధంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యక్ష ఎన్నికలు మరింత ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి వివరించారు.ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజామోదంతో కూడిన నాయకత్వం, వేగవంతమైన నిర్ణయాలు, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు,



శాఖల మధ్య మెరుగైన సమన్వయం,పెట్టుబడులు-పరిశ్రమలు-పర్యాటక రంగాల ప్రోత్సాహం వంటి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చట్ట సవరణను తీసుకొచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం లభించడంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లోకి రానుంది.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
గురువారం | అనంతపురం
20.08.2026


# ఘనంగా ధ్వజ శిఖర, ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం



- ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం....
- అందజేసిన జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి....

**ధర్మవరం ఆగష్టు 19 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పట్టణంలోని ఎర్రగుంటలో శ్రీ మహా గణపతి, శ్రీ లక్ష్మీదేవి, శ్రీ ధన్వంతరి వైద్య నారాయణ స్వామి, శ్రీ త్యాగరాజ స్వామి ధ్వజ శిఖర, ప్రాణ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు తనవంతు సహకారంగా రూ.50,000 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ఆకాంక్షించారు. మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, స్థానికులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పుట్టపర్తి సఖి సెంటర్‌లో సెక్యూరిటీ గార్డ్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

- శ్రీ సత్యసాయి జిల్లా ఐసీడీఎస్ పీడీ ప్రమీల

**పుట్టపర్తి, ఆగస్టు 19:అనంత జనశక్తి న్యూస్**



శ్రీ సత్యసాయి జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి పరిధిలోని వన్ స్టాప్ సెంటర్, పుట్టపర్తి నందు కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయుటకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి Security Guard / Night Guard పోస్టు భర్తీకై దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ అధికారిణి కటారి ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోస్టుకు సంబంధించిన వివరాలు క్రింది విధంగా ఉన్నాయిపోస్టు పేరు: సెక్యూరిటీ గార్డ్ / నైట్ గార్డ్ (Security Guard / Night Guard).నెలసరి వేతనం: రూ. 15,000/. అర్హతలు: ప్రభుత్వ లేదా ఏదైనా గుర్తింపు పొందిన సంస్థలో జిల్లా/రాష్ట్ర స్థాయిలో కనీసం 2 సంవత్సరాల పాటు సెక్యూరిటీ పర్సనల్‌గా పనిచేసిన అనుభవం ఉండాలి. రిటైర్డ్ మిలిటరీ లేదా పారామిలిటరీ సిబ్బందికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.దరఖాస్తు గడువు: అర్హులైన అభ్యర్థులు 22082026 నుండి 29082026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.చివరి తేదీ & సమయం: 29082026 సాయంత్రం 5:00 గంటల వరకు మాత్రమే దరఖాస్తులు స్వీకరించబడతాయి.ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను పుట్టపర్తిలోని జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారిణి వారి కార్యాలయంలో నిర్ణీత గడువులోగా సమర్పించి రశీదు పొందవలెనని కోరడమైనది. గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించేది లేదన్నారు.

# ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజా



**యాడికి, ఆగష్టు 19,అనంత జనశక్తి న్యూస్**

**మండల కేంద్రంలోని బుగ్గరోడ్డు లో ఉన్నశ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజా కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ అయ్యప్పస్వామి కి విశేష అభిషేకం చేసి, వివిధ పూల మాలలతో అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.అయ్యప్పస్వామి పాటలతోను, ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్ప అనే నామం మారుమ్రోగింది.అయ్యప్పస్వామి కి మహా మంగళహారతి ని సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను , అందచేశారు .పడి పూజా కార్యక్రమం ను, భక్తులకు భిక్ష ను కృష్ణా జిల్లా పామర్రు కు చెందిన తుమ్మలచెర్ల శివ నవీన్,తేజస్వీణి లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు హరినాథ్ స్వామి, చిట్టి స్వామి, ఆలయ అధ్యక్షుడు నాగరాజు, పూజారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.**

# అత్యవసర సమయంలో అరుదైన ఎయిర్‌వే ప్రక్రియతో యువకుడికి పునర్జన్మ

- కిమ్స్ సవీరలో అరుదైన చికిత్స
- రాయలసీమలో తొలిసారిగా అత్యవసర రిజిడ్ బ్రాంకోస్కోపీ, వై-స్టెంట్ అమరిక
- ఈ ప్రాంతంలో రిజిడ్ బ్రాంకోస్కోపీ సదుపాయం ఉన్న ఏకైక కేంద్రం కిమ్స్ సవీర

**అనంతపురం, ఆగస్టు 19,అనంత జనశక్తి న్యూస్**



తీవ్ర శ్వాసకోశ సమస్యతో అపస్మారక స్థితిలో ఆసుపత్రికి వచ్చిన 22 ఏళ్ల యువకుడికి కిమ్స్ సవీర వైద్యులు అరుదైన అత్యవసర ఎయిర్‌వే ప్రక్రియ నిర్వహించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు చికిత్సనందించిన కన్సల్టెంట్ - క్లినికల్, అడ్వాన్స్‌డ్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ & అలర్జీ స్పెషలిస్ట్ డా. యశో వర్ధన్ మంగిశెట్టి.
అనంతపురం జిల్లాకు చెందిన ఓ 22 ఏళ్ల యువకుడికి శ్వాస తీసుకోవడంలో తీవ్రమైన ఇబ్బందితో అత్యవసర విభాగానికి తీసుకురాగా, అప్పటికే పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే వెంటిలేటర్‌పై ఉంచారు. అతనికి చేసిన వైద్య పరీక్షల్లో ఊపిరితిత్తులకు వెళ్లే ప్రధాన శ్వాసనాళం విడిపోయే ప్రాంతమైన కారినా వద్ద భారీ కణితి కారణంగా ప్రధాన శ్వాసనాళం తీవ్రంగా కుంచించుకుపోయినట్లు గుర్తించారు. అంతేకాకుండా ఒక ఊపిరితిత్తికి వెళ్లే శ్వాసనాళం దట్టమైన శ్లేష్మంతో పూర్తిగా మూసుకుపోవడంతో ఆక్సిజన్ సరఫరా మరింత దెబ్బతింది."ఇది అత్యంత ప్రమాదకరమైన సెంట్రల్ ఎయిర్‌వే ఆబ్స్ట్రక్షన్. కణితి కారణంగా శ్వాసనాళం దాదాపు మూసుకుపోవడంతోపాటు, ఒక వైపు బ్రాంకస్ పూర్తిగా శ్లేష్మంతో బ్లాక్ అయింది. వెంటనే శ్వాసనాళాన్ని తెరవకపోతే ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి. అందుకే మొదటి ప్రాధాన్యతగా ఎయిర్‌వేను తెరిచి, రోగిని స్థిరపరచాల్సి వచ్చింది" అని తెలిపారు. సాధారణ చికిత్సతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం కష్టంగా ఉండటంతో అత్యవసరంగా రిజిడ్ బ్రాంకోస్కోపీ నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియలో ప్రత్యేకమైన రిజిడ్ ట్యూబ్ ద్వారా శ్వాసనాళం, ఊపిరితిత్తులకు వెళ్లే మార్గాలను నేరుగా పరిశీలించి, అడ్డంకులను తొలగించడంతోపాటు అవసరమైన చోట చికిత్స అందించవచ్చు.ఈ ప్రక్రియలో కారినా వద్ద 16 × 60 మిల్లీమీటర్ల వైఆకారపు మెటాలిక్ ఎయిర్‌వే స్టెంట్‌ను అమర్చాం. శ్వాసనాళం సహజంగా రెండు ఊపిరితిత్తులకు విడిపోయే ప్రాంతాన్ని పోలిన ఆకారంలో ఉండే ఈ స్టెంట్ కుంచించుకుపోయిన శ్వాసనాళాన్ని తెరిచి ఉంచి, రెండు ఊపిరితిత్తులకూ గాలి సక్రమంగా చేరేలా చేస్తుంది.స్టెంట్ అమర్చిన అనంతరం యువకుడి శ్వాస పరిస్థితిలో వేగంగా మెరుగుదల కనిపించింది. ఆక్సిజన్ స్థాయిలు గణనీయంగా పెరగడంతో వెంటిలేటర్ అవసరం తగ్గి, మరుసటి రోజే స్వయంగా శ్వాస తీసుకునే స్థితికి చేరుకున్నాడు. అనంతరం పరిస్థితి నిలకడగా మారడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసి, కణితికి సంబంధించిన తదుపరి క్యాన్సర్ చికిత్సను కొనసాగించేలా సూచించాం.కణితి శ్వాసనాళంలో పెరగడం లేదా బయట నుంచి శ్వాసనాళంపై ఒత్తిడి కలిగించడం వల్ల సెంట్రల్ ఎయిర్‌వే ఆబ్స్ట్రక్షన్ ఏర్పడుతుంది. శ్వాసనాళం తీవ్రంగా మూసుకుపోతే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంలో ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం, శ్వాసకోశ వైఫల్యం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. కొన్ని సందర్భాల్లో ఇది ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంటుంది.
"శ్వాసనాళం పూర్తిగా లేదా తీవ్రంగా మూసుకుపోయినప్పుడు ప్రతి నిమిషం ఎంతో కీలకం. రిజిడ్ బ్రాంకోస్కోపీ, ఎయిర్‌వే స్టెంటింగ్ వంటి ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ చికిత్సలు ఎంపిక చేసిన రోగుల్లో తక్షణ ఉపశమనం కలిగించగలవు. శ్వాసనాళాన్ని తెరవడం ద్వారా రోగిని స్థిరపరచడమే కాకుండా, తదుపరి క్యాన్సర్ చికిత్స పొందేందుకు అవసరమైన సమయాన్ని కూడా అందించవచ్చు" అని డా. యశో వర్ధన్ మంగిశెట్టి వివరించారు.

**రాయలసీమలో తొలిసారిగా**

ఈ చికిత్స రాయలసీమ ప్రాంతానికి వైద్యపరంగా ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందన్నారు. రాయలసీమలో రిజిడ్ బ్రాంకోస్కోపీ నిర్వహించేందుకు అవసరమైన ప్రత్యేక సదుపాయాలు ఉన్న ఏకైక కేంద్రం కిమ్స్ సవీర హాస్పిటల్ అని పేర్కొన్నారు. ఈ తరహా అత్యవసర ఎయిర్‌వే ఇంటర్వెన్షన్ రాయలసీమలో తొలిసారిగా నిర్వహించినట్లు తెలిపారు. తీవ్రమైన శ్వాసకోశ అత్యవసర పరిస్థితుల్లో రోగులను దూర ప్రాంతాల్లోని పెద్ద నగరాలకు తరలించాల్సిన అవసరం లేకుండా, అనంతపురంలోనే ఆధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు అందుబాటులో ఉండటం ఎంతో కీలకమని వైద్యులు పేర్కొన్నారు.

# వివిధ ప్రజా పంపిణీ, LPG సమస్యలపై అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష

- జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**పుట్టపర్తి,ఆగస్టు,19:అనంత జనశక్తి న్యూస్**



శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (PDS) అమలు, గ్యాస్ సిలిండర్ల సరఫరా, ఇకేవైసీ సేవల పురోగతిపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ గారు బుధవారం కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలోని సిఎస్డిటిలు, ఆర్ఎస్డిటిలు, ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్లు మరియు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ...
ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు సంక్షేమ పథకాల పారదర్శక అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.దీపం పథకం గ్యాస్ బుకింగ్స్, రేషన్ లబ్ధిదారులకు ఐవిఆర్ఎస్ ద్వారా అందుతున్న సేవలపై అధికారులతో సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా గ్యాస్ సిలిండర్ల లభ్యత, వినియోగదారులకు సకాలంలో రీఫిల్స్ అందించడం మరియు నిలిచిపోయిన (బ్యాక్‌లాగ్) సరఫరాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.దీపం పథకం కింద సబ్సిడీ జమకాని కేసులను తక్షణమే పరిశీలించి లోపాలను సరిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.గ్యాస్ కనెక్షన్ల ఇకేవైసీ పెండింగ్ సమాచారాన్ని సమీక్షించడమే కాకుండా, రైస్ కార్డుల ఇకేవైసీ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.కొత్త రైస్ కార్డుల జారీ, మార్పులు చేర్పుల సేవలతో పాటు, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్ (PGRS) ద్వారా వచ్చిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు.ఆహార భద్రతను పర్యవేక్షించేందుకు ప్రతి మండలంలో విజిలెన్స్ కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఈ ఆగస్టు నెలకు సంబంధించిన రేషన్ బియ్యం మరియు నిత్యావసర వస్తువుల పంపిణీ ప్రక్రియ సుఫీలంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుండి చౌక ధరల దుకాణాలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల రవాణా వేగవంతంగా జరగాలని సూచించారు.ఈ సమావేశంలో డిఎస్ఓ వంశీ కృష్ణ రెడ్డి,డిఎం రాజు నాయక్,మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వడ్డెరలను గుర్తించిన సీఎం చంద్రబాబు

- దళవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు సంబరాలు
- సీఎం చిత్రపటానికి పాలభిషేకం

**అనంతపురం, ఆగస్టు 19 :అనంత జనశక్తి న్యూస్**



కూటమి ప్రభుత్వం గవర్నర్ కోటాలో వడ్డెర సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి కేటాయించడంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వడ్డెర సంఘం నాయకులు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతపురం నగరంలోని వడ్డెర సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచపు వడ్డే వెంకటేశులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వడ్డెర నాయకులు, సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ సందర్భంగా కుంచపు వడ్డే వెంకటేశులు మాట్లాడుతూ.. ఎన్నో ప్రభుత్వాలు మారినప్పటికీ వడ్డెర సామాజిక వర్గాన్ని గుర్తించి రాజకీయంగా ప్రోత్సహించిన పార్టీ తెలుగుదేశం పార్టీయేనన్నారు. వడ్డెరలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే దిశగా టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెరలకు రాజ్యాధికారం కల్పిస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. వడ్డెర జాతి ముద్దుబిడ్డ దలవాయి రమాదేవికి ఎమ్మెల్సీ పదవి కల్పించడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెరల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర సామాజిక వర్గానికి కల్పించిన ఈ రాజకీయ గుర్తింపును స్వాగతిస్తున్నామని, భవిష్యత్తులో వడ్డెరలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉరవకొండ వడ్డెర్ల సంఘం అధ్యక్షులు విఎస్ రాయుడు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వడ్డే నాగేంద్ర, నాగరాజు వడ్డెర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణదుర్గం, కోనాపురం నారాయణస్వామి ఉరవకొండ వడ్డెర సంఘం ఉపాధ్యక్షులు, కొండపల్లి మల్లెల జయరాం, పుట్లూరు వడ్డే మంజుల, కొండన్న రాణినగర్, దేరంగుల గంగరాజు, రామసాగరం వడ్డే ఆదినారాయణ, కొర్రపాడు రామాంజనేయులు, కూడేరు వడ్డే బ్రహ్మయ్య,శ్రీనివాసులు కళ్యాణదుర్గం,గంగాధర్ సెట్టూరు మండలం అధ్యక్షులు, పాలవాయి అనిల్, కో క్లస్టర్, ఈశ్వరయ్య అనంతపురం అర్బన్ స్టోర్ డీలర్, ఎర్రగుంట సురేష్, ఎర్రగుంట హనుమంతప్ప, పెద్దన్న బెలుగుప్ప వడ్డెర అధ్యక్షులు, వడ్డే వెంకటేష్ తగరకుంట యూనియన్ ప్రెసిడెంట్, శ్రీనివాసులు, తగరకుంట గ్రామ కమిటీ మెంబర్ నరేష్ చౌదరి, మహబూబ్ బాషా, వడ్డెర నాయకులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలల చేతుల్లో పుస్తకాలా.. వాటర్ క్యాన్లా...?





- ధర్మవరం శివానగర్ పాఠశాలలో ఘటనపై విద్యార్థి సంఘాల ఆగ్రహం.....

**ధర్మవరం ఆగష్టు 19 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం పాఠశాలకు వెళ్లే చిన్నారుల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాల్సింది పోయి.. వాటర్ క్యాన్లు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ధర్మవరం పట్టణంలోని శివానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో సుమారు 500 మీటర్ల దూరంలోని వాటర్ ప్లాంట్ నుంచి పాఠశాల వరకు నీటి క్యాన్లు మోయిస్తున్నారంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ ఘటన పై సమగ్ర విచారణ జరిపి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్మవరం ఆర్డీవో రాంభూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు విద్యాబోధనలో నిమగ్నం కావాల్సిన సమయంలో వారితో బోధనేతర పనులు చేయించడం సరికాదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 500 మీటర్ల దూరం నుంచి నీటి క్యాన్లను మోయించడం వల్ల విద్యార్థులకు శారీరక ఇబ్బందులు కలగడంతో పాటు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యం పై ఉందన్నారు. ఈ సందర్భంగా పీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఏఐఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు కనుమ దామోదర్ మాట్లాడుతూ.. విద్యార్థులను బోధనేతర పనులకు వినియోగించడం వారి విద్యా హక్కులను దెబ్బతీయడమే కాకుండా భద్రతకు ముప్పుగా మారుతుందని అన్నారు. ప్రధానోపాధ్యాయుడి విధుల పై గతంలోనూ విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆరోపించారు.

**ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్.....**

విద్యార్థులతో వాటర్ క్యాన్లు మోయించిన ఘటన పై ఉన్నతస్థాయి అధికారులతో విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చి, బాధ్యత వహించిన ప్రధానోపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల హక్కులు, భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.విద్యార్థులు పాఠశాలకు వచ్చేది చదువుకోవడానికి తప్ప ఇతర పనులు చేయడానికి కాదని, పాఠశాలల్లో వారి కి సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిజంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది

**- ఎంపీ బస్తిపాటి నాగరాజు**
**- ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు**
**- అందరికీ అండగా ఉంటానన్న ఎంపీ**

**కర్నూలు, ఆగస్టు 19:అనంత జనశక్తి న్యూస్**




జర్నలిజంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. బుధవారం ఆంధ్ర ప్రదేశ్ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ (ఏపీపీజేఏ) జిల్లా అధ్యక్షుడు ఎన్ సుధాకర్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని మీడియా రూం ముందు ఏర్పాటు చేసిన ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు తో పాటు ఐ అండ్ పీఆర్ డీడీ జయమ్మ, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ గౌడ్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) జాతీయ కార్యవర్గ సభ్యులు, ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు ఈ.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర సమితి సభ్యులు వైవీ కృష్ణారెడ్డి, జిల్లా కోశాధికారి అంజి, జిల్లా సహాయ కార్యదర్శి శివ రాజ్ కుమార్, సీనియర్ జర్నలిస్టు శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరంజీవి పాల్గొన్నారు. ముందుగా ఫోటో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి ఎంపీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... జర్నలిజంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదన్నారు. జర్నలిస్టులు రాసే వార్తలకు ఫోటో ప్రాణం అన్నారు. ఒక్క ఫోటో వార్త మొత్తం చెప్పేస్తుందని, అంతేకాక కోట్లాది మందిని కూడా కదిలిస్తుందని చెప్పారు. ప్రపంచం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నా.. ఫోటో జర్నలిస్టులకు మాత్రం విలువ తగ్గదన్నారు. మంచి ఫోటోలు తీసే వారికి ఎప్పటికీ సమాజంలో, మీడియాలో ఆదరణ ఉంటుందన్నారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ప్రధాని ఫోటో జర్నలిస్టులకు మొదట ప్రాధాన్యం ఇస్తారని, వారు ఫోటోలు తీసుకొని వెళ్లిన తర్వాతే మిగతా కార్యక్రమాలు మొదలవుతాయన్నారు.కర్నూలు లో కూడా చాలా మంది సీనియర్ ఫోటో జర్నలిస్టులు రాయలసీమ దుర్భిక్షం, కరువు, కాటకాల పైన, వరదలు, సమస్యలు, ఇబ్బందులు, అవినీతి, అక్రమాల పైన ఎన్నో ఫోటోలు తీయడం జరిగిందన్నారు. ఎంతో మందికి ఉత్తమ జర్నలిస్టుగా అవకాశం లభించిందన్నారు. కనుక జర్నలిస్టులకు, ఫోటో జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానన్నారు. అలాగే రైల్వేలలో జర్నలిస్టులకు రాయితీ ఉండేదని, కరోనాలో అది రద్దు చేసినట్లు తన దృష్టికి తెచ్చారని, తప్పకుండా ప్రధాని దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని చెప్పారు.అనంతరం సీనియర్ ఫోటో గ్రాఫర్స్ ను ఎంపీ, డీడీ ఘనంగా సన్మానించారు. అలాగే ఫోటో జర్నలిస్టులు ఎంపీ, డీడీని, ఏపీయూడబ్ల్యూజే నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు చిన్న నాగేశ్వర రావు, బీ మల్లికార్జున, నాయకులు హరికృష్ణ, ఏపీ ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ, ఫోటో జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బిసిల పక్షపాతి తెలుగుదేశం పార్టీ

**- నవోదయ కాలనీలో ప్రజలకు కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమంపై వివరణ**
**- కార్యక్రమంలో పాల్గొన్న అనంతపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ దేవేంద్రప్ప**

**అనంతపురం ఆగస్ట్ 19, అనంత జనశక్తి న్యూస్**



తెలుగుదేశం పార్టీ బీసీల పక్షపాతి అని అనంతపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప పేర్కొన్నారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచనల మేరకు నగరంలోని నవోదయ కాలనీలో నిర్వహించిన 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం' కార్యక్రమంలో అనంతపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అబ్జర్వర్ దేవేంద్రప్ప పాల్గొన్నారు. టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ సాకే లక్ష్మీనరసింహ, టిడిపి నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, టిడిపి నాయకులతో కలిసి 24వ డివిజన్, నవోదయ కాలనీ లోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34శాతం రిజర్వేషన్లు కల్పించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు తీసుకున్న కీలక నిర్ణయాన్ని ప్రజలకు వివరించారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం, అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీసీలకు సామాజిక, రాజకీయ సాధికారతకు మరింత బలం చేకూరుస్తుందని దేవేంద్రప్ప తెలిపారు. అనంతపురం నగర అభివృద్ధికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా దృష్టి సారించి చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను కూడా ప్రజలకు వివరించారు. నగరంలో మౌలిక వసతుల మెరుగుదల, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చేస్తున్న కృషిని వివరించారు. కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి, రాజకీయ సాధికారతకు పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని దేవేంద్రప్ప గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుల లక్ష్మీ నరసింహులు, పరమేశ్వర్, టిడిపి నాయకులు సరిపూటి రమణ, కృష్ణకుమార్, మారుతి కుమార్ గౌడ్, జగదీశ్, పవన్, రమేష్, భరత్, విజయ్, పోతులయ్యా, ఎర్రిస్వామి, నారాయణస్వామి, అమర, చందు, జైనుభి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెలలోనే వెలిగొండ వెలుగులు

**- నెరవేర బోతున్న మూడు దశాబ్దాల చంద్రన్న కల**
**- నిర్వాసితులకు మరో రెండు వందల కోట్లు**
**- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు**

**అమరావతి ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్**



కరువు పీడిత, ఫ్లోరైడ్ బాధిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల జీవితాల్లో వెలిగొండ ద్వారా వెలుగులు నింప బోతున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1996లో నేటి ముఖ్యమంత్రి , అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా వెలిగొండ శంకుస్థాపన జరిగిందన్నారు. అదే చంద్రబాబు నాయుడు నేడు కూటమి ప్రభుత్వ అధినేతగా ఈ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేసి ఈ నెలలోనే నీరు ఇవ్వటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఇదే వెలిగొండ పూర్తికాకుండానే ప్రారంభోత్సవం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేసిన గొడ్డలి పార్టీ అధినేత జగన్ చరిత్ర హీనుడిగా ప్రజల మదిలో మిగిలిపోయాడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 లో జలవనరుల శాఖ సమీక్షలో 2026 ఆగస్టు కల్లా వెలిగొండని పూర్తి చేయాలని ఆ రోజు చంద్రబాబు నాయుడు లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ఆ లక్ష్యసాధనకు అనుగుణంగా ఈ రెండేళ్లలో, హెడ్ రెగ్యులేటర్ కి సంబంధించి CC వాల్స్ గానీ, వింగ్స్ గానీ అవన్నీ కూడా మొన్న 2026 మే నెలకి పూర్తి చేశామన్నారు. అలాగే కృష్ణా నది నుంచి టన్నెల్ కి వచ్చేటువంటి ఆ నీటికి అప్రోచ్ ఛానల్ దగ్గర 80 వేల మెట్రిక్ టన్నులు మక్ ను కూడా తొలగించినట్లు చెప్పారు. నీరు వచ్చే మార్గాన్ని కూడా ఈ ఏడాదే ఏర్పాటు చేశామన్నారు. 5 కిలోమీటర్ల బెంచింగ్ టన్నెల్ లో ఉండిపోతే, ఈ రెండేళ్లలోనే ఆ 5 కిలోమీటర్ల బెంచింగ్ ని పూర్తి చేశామన్నారు. టన్నెల్ 2 లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే సమయానికి చూస్తే 7 కిలోమీటర్లు, అంటే 7,000 మీటర్ల లైనింగ్ మిగిలి ఉన్నటువంటి పరిస్థితి ఉందన్నారు. ఈ రెండేళ్లలో రేయింబవళ్లు పనిచేసి 6,907 మీటర్లు పూర్తి చేసినట్లు చెప్పారు. మిగిలిన 81 మీటర్లు ఐదారు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. అదే విధంగా టన్నెల్ బోరింగ్ మిషన్ తొలగింపు విషయంలో అప్పటి వైకాపా ప్రభుత్వం చేతులెత్తేసింది అన్నారు. అటువంటి TBM తొలగింపు విషయంలో న్యాయవివాదాలను గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా పట్టించుకుని పరిష్కరించారన్నారు. 1900 టన్నులు బరువు, 175 మీటర్ల పొడవు ఉన్నటువంటి TBM మిషన్ తొలగింపు.. సంక్లిష్ట పనిని చాకశక్యంగా దాదాపు చేశామన్నారు. టిబిఎం శకలాల తాలూకు వ్యర్థాలు ఇంకా 300 టన్నులు ఉన్నాయని వీటిని మరో నాలుగు, ఐదు రోజుల్లో తొలగిస్తామని మంత్రి చెప్పారు.అలాగే అతి ముఖ్యమైన ఫీడర్ కెనాల్ నడవడానికి వీలు లేని పరిస్థితిలో ఉండేదన్నారు. అటువంటి 21 కిలోమీటర్ల పొడవున్న ఫీడర్ కెనాల్ కు కూటమి ప్రభుత్వ అధినేతగా చంద్రబాబు నాయుడు 460 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ 2026 జనవరిలోనే శంకుస్థాపన చేసిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అన్నిటి కంటే మించి వెలిగొండ నిర్వాసితులకు 900 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంది. ఐదేళ్ల పదవీకాలంలో జగన్ నిర్వాసితులకు ఒక పైసా కూడా చెల్లించకుండా మోసం చేశాడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2557 మంది నిర్వాసితులకు 318 కోట్లు అందజేసిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు మళ్లీ మరో 1600 మంది నిర్వాసితలకు 200 కోట్లు ఇచ్చామని చెప్పారు. మిగిలి మొత్తాన్ని కూడా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి తో పాటు చెల్లిస్తామన్నారు. తమ ప్రభుత్వానికి ప్రాజెక్టు ఎంత ముఖ్యమో నిర్వాసితులు కూడా అంతే ముఖ్యమని రామానాయుడు చెప్పారు. ఈ రెండేళ్లలోనే 3,000 కోట్ల రూపాయలు వెచ్చించి వెలిగొండ కల సాకారం చేసినందుకు చంద్రబాబు నాయుడు కి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిర్వాసితులకు కోసం ఏర్పాటు చేసిన ఏడు కాలనీలలో నాలుగు పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. మిగిలిన మూడు కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు.

# రిజర్వేషన్లతో బీసీలకు అందలం

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**

**అమరావతి ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్**



స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత నేతృత్వంలో బీసీ నాయకుల సంబరాలు జరుపుకున్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి బీసీ నేతలు హర్షాతిరేకాలు వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందన్నారు. బీసీలకు వెన్నుదన్నుగా అన్న ఎన్టీఆర్, సీఎం చంద్రబాబునాయుడు నిలిచారన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపు టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే లభించాయన్నారు. తొలుత అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పించి, వారిని రాజ్యాధికారంలో భాగస్వామ్యులు చేశారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలను అన్నిరంగాల్లో ముందంజలో ఉండేలా చర్యలు తీసుకున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 1995లో సీఎం చంద్రబాబునాయుడు ఆ సంఖ్యను 34 శాతానికి పెంచారన్నారు. 2021 వరకూ ఆ రిజర్వేషన్లు కొనసాగుతూ వచ్చాయన్నారు. జగన్ వచ్చిన తరవాత స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు కోత విధించి, 24 శాతం అమలు చేశారన్నారు. దీనివల్ల బీసీలు 16,800 పదవులకు దూరమయ్యారన్నారు. బీసీలకు పదవులే కాకుండా ఆర్థికంగా లబ్ధి కలిగించే పథకాలను సైతం జగన్ రద్దు చేశారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో బీసీలు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారన్నారు. ఇదేంటని ప్రశ్నించిన బీసీలను, ఆ సామాజిక వర్గ నేతలను తప్పుడు కేసులతో వేధించారన్నారు. మరోసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, బీసీలకు మంచిరోజులు ప్రారంభమయ్యాయన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతూ
సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇది చారిత్రాత్మక నిర్ణయమన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలు కోల్పోయిన పదవులు మరోసారి లభించనున్నాయన్నారు. నిర్ణయాధికారంతోనే బీసీలకు అందలం దక్కుతుందని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వర్, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటి, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేలు జరిమానా.

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 19 అనంత జన శక్తి న్యూస్.**

మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడిపిన కేసులో పుట్టపర్తి పట్టణ పోలీసులు పుట్టపర్తి మెజిస్ట్రేట్ న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు.ఈ కేసుల్లో నిందితుడు తమ తప్పును అంగీకరించడంతో, బుధవారం పుట్టపర్తి జడ్జ్ రూ.10,000 వేలు జరిమానా విధించినట్లు పుట్టపర్తి టౌన్ సీఐ యువరాజు తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఐ యువరాజు సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపిన బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన అటువంటి వారిపై పోలీస్ శాఖ పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



## అగాపే ఆశ్రమం లో అన్నదానం



**యాడికి, ఆగష్టు 19, అనంత జనశక్తి న్యూస్**

: మండల కేంద్రంలోని కమలపాడు రోడ్డు పక్కన ఉన్న అగాపే ఆశ్రమం లో వృద్ధులకు బుధవారం అన్నదానం కార్యక్రమం ను నిర్వహించారని ఆశ్రమ ఫౌండర్ బత్తుల ప్రసాద్ తెలిపారు. కార్తీక్ శాంతరాజు, భార్య బ్లేస్సీ ఏంజెల్ 26వ జన్మదినం సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు తండ్రి పెద్ద జీవయ్య, తల్లి జయమ్మ , అన్నలు , వదినలు ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. బ్లేస్సీ ఏంజెల్ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, కుటుంబం సభ్యులు ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్ళ సుఖశాంతులతో జీవించాలని వృద్ధులు, ఆశ్రమం ఫౌండేషర్ బత్తుల ప్రసాద్ లు దీవించారు. ఈ కార్యక్రమంలో కుటుంబం సభ్యులు పాల్గొన్నారు.

## వి బి జి రామ్ జి పనులపై సమావేశం



**యాడికి, ఆగష్టు 19, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీవో కే సి హెచ్ మద్దిలేటి , జే ఈ ఈశ్వర రెడ్డి ఆధ్వర్యంలో వి బి జి రామ్ జి పనులపై సమావేశంను నిర్వహించారు .ఈ సందర్భంగా ఏపీవో కే సి హెచ్ మద్దిలేటి , జే ఈ ఈశ్వర రెడ్డి లు మాట్లాడుతు వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నందువలన ప్రతి గ్రామపంచాయతీలో టార్గెట్ ప్రకారం కూలీల సంఖ్యను పెంచాలని తెలిపారు .సరాసరి వేతనం రూ. 312 లు వచ్చే విధంగా , పనులు నాణ్యతగా ఉండేటట్లు కూలీలతో పనులు చేయించాలన్నారు.భూగర్భ జలాలు పెరిగే విధంగా ఖండిత , సమతల, కందకాలు పనులు, ఫామ్ పాండ్స్, సంకెన్ పిట్స్, మ్యాజిక్ డ్రయిన్స్, ఇండివిజువల్ , హౌస్ హోల్డ్ కంపోస్ట్ పిట్స్ రూఫ్ టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ వర్క్స్ చేయించాలని తెలిపారు. ఆర్టికల్చర్ ఐడెన్సిటీ ప్లాంటేషన్, భువన్ పేస్ 2 , వి బి జి రాంజీ కి సంబంధించిన ఇతర విషయాలను గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమం

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 19 అనంత జన శక్తి న్యూస్.**



క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నివేదిత తెలిపారు. పుట్టపర్తి మండల పరిధిలోని బొంతలపల్లి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ 2.0 లో భాగంగా జిల్లా వైద్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు హ్యాండ్ హెల్డ్ ఎక్స్రే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎక్స్ రే తీసినట్లు తెలిపారు.ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రిపోర్టును రెండు నిమిషాలలోనే తెలియజేయబడునని దీని ముఖ్య ఉద్దేశం త్వరితగతిన టీబీ నిర్ధారణ చేయడానికి నేరుగా ప్రజల వద్దకే వెళ్లి ఎక్స్రే పరీక్ష చేసి వెంటనే రిపోర్టు ను తెలియజేయవచ్చునని టీబీ ముఖ్య లక్షణాలు రెండు వారాల మించి దగ్గు ఉన్న దగ్గినప్పుడు గళ్ళతోపాటు రక్తం పడడం సాయంత్రం పూట తరచుగా జ్వరం రావడం చెమటలు పట్టడం ఆకలి మందగించడం బరువు తగ్గడం చక్కెర వ్యాధి గ్రస్తులకు 60 ఏళ్ల పైబడిన వారికి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ధూమపానం పొగాకు సేవించు వారికి ఇటుక బట్టి లో పనిచేసే వారికి పరిశ్రమల్లో పనిచేసే వారికి కంకర పని చేయు వారికి ఎక్కువ టీబీ ఉండవచ్చని ఇలాంటివారు ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉచితంగా గళ్ళపరీక్ష చేయించుకుని టీబీ నిర్ధారణ అయినచో ఆరు నెలల చికిత్స ఉచితంగా అందజేస్తారు కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాధి ఉన్న వాళ్లకు నెలకు వెయ్యి చొప్పన ఆరు నెలల చికిత్స కాలానికి ఆరువేల, అందించనున్నారని, ఇది వారి పౌష్టికాహారం కొరకు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా టీబి యూనిట్ సూపర్వైజర్ అబిద్ భాష, ఎం పి హెచ్ పద్మావతి సిహెచ్ ఓ లు గౌతమి ,హర్షిత, ఏఎన్ఎంలు సుకన్య, ఆశ వర్కర్లు శివమ్మ, చిట్టెమ్మ, వెంకటరమణమ్మ, కృష్ణవేణి, మహేశ్వరమ్మ ,నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేకు రైతులు సహకరించండి

**– తహసీల్దార్ రవి నాయక్**

**నల్లచెరువు ఆగస్టు 19 అనంత జనశక్తి న్యూస్**

మండల పరిధిలోని నల్లచెరువు గ్రామ పొలంలో రిసర్వే ప్రక్రియకు సంబంధించి అధికారులు రైతులకు కీలక సూచనలు జారీ చేశారు పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన ప్రతి రైతు తమ ఫోటో ఆధార్ కార్డు ఫోన్ నంబర్ వివరాలతో నేడు ఉదయం 10 గంటలకు బసవన్న కట్ట వద్ద హాజరు కావాలని తెలిపారు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరు కొరకు ఈ వివరాలు అవసరమని రైతులు తప్పనిసరిగా సహకరించాలని తహసీల్దార్ రవి నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు వివరాలు సమర్పించని పక్షంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల మంజూరులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

## ఎస్సీలకు టీడీపీలో పెద్దపీట.. వర్ల రామయ్యకు ఎమ్మెల్సీగా అవకాశం

రాప్తాడు ఆగస్టు 19 అనంత జనశక్తి న్యూస్



తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వర్ల రామయ్యను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేయడం పట్ల హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి పాలచర్ల ముత్యాలప్ప హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ పెద్దపీట వేస్తుందని ముత్యాలప్ప పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి, అన్ని వర్గాల అభ్యున్నతికి టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. వర్ల రామయ్యకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ఇందుకు నిదర్శనమన్నారు.

రాబోయే రోజుల్లో కూడా తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని, చంద్రబాబునాయుడు నాయకత్వంలో టీడీపీ మరోసారి రాష్ట్రాన్ని సమర్థవంతంగా పరిపాలిస్తుందని ముత్యాలప్ప ధీమా వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

ఎమ్మెల్సీగా ఎంపికైన వర్ల రామయ్యకు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

## పోలీసు పిల్లలకు 'ప్రతిభా పురస్కారాలు' అందజేసిన జిల్లా ఎస్పీ పి. జగదీష్

- పదవ తరగతి నుండీ పి.జి వరకు చదువులో ప్రతిభ చూపిన 109 మంది పోలీసు పిల్లలకు రూ. 6.35 లక్షలు అందజేత
- ఆందోళన లేకుండా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపు
- స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం

అనంతపురం ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్




పదో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) వరకు చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 109 మంది పోలీసు పిల్లలకు జిల్లా ఎస్పీ పి.జగదీష్,బుధవారం 'ప్రతిభా పురస్కారాలు' అందజేశారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో అత్యంత వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను బహుకరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో రాత్రింబవళ్లు విధి నిర్వహణలో బిజీగా ఉండే సిబ్బంది పిల్లలు చదువుల్లో రాణించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి, లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ భవిష్యత్తులో దేశానికి, సమాజానికి మంచి పేరు తేలాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నాగభూషణం, పలువురు పోలీసు అధికారులు, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్, పలువురు పోలీసు అధికారుల సంఘం అడ్హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సూర్య కుమార్ , గాండ్ల హరినాథ్ , లక్ష్మినారాయణ, సరోజ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రక్త బంధం ట్రస్ట్ అంబులెన్స్ కోసం విరాళం



- రోటరీ క్లబ్ నరేందర్ రెడ్డి.

ధర్మవరం ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్:

రక్త బంధం ట్రస్ట్ అంబులెన్స్ కోసం ఎన్నో తీవ్ర ప్రయత్నాలు చేస్తూ సహాయంగా ఉండటానికి విరాళాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా రోటరీ క్లబ్ సీనియర్ నరేందర్ రెడ్డి ధనవంతుగా రక్త బంధం ట్రస్ట్ అంబులిన్ కోసం 50 వేల రూపాయల నగదును ట్రస్ట్ వారికి అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.... తోటి మనసుల బాధను చూసి చరించే గుణమే ఒక అద్భుతమైన వరము అని, ఆ మంచి మనసుతో ఆపదలో మనవారికి నేను ఉన్నాను అనే భరోసా ఇవ్వడానికే ఈ విరాళం ఇచ్చానని తెలిపారు. సాయం చేయడానికి ధన బలము కంటే ఇతరుల కష్టాన్ని ప్రేమించే కరుణా హృదయం ముఖ్యమని తెలిపారు. అంబులెన్స్ ఒక నిస్సహాయుడి ప్రాణాన్ని కాపాడినప్పుడు ఆ పుణ్యపణములో ప్రతి ఒక్కరూ భాగం పంచుకోవాలని తెలిపారు. అప్పుడే మానవతా విలువలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం రక్షబంధన్ ట్రస్ట్ వారు దాత కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ కూడా పాల్గొన్నారు.

## పశువులను నిర్లక్ష్యంగా వదిలేస్తే చర్యలు

- మూడు సార్లు నోటీసులు జారీ చేసినా మారకపోతే పశువులను స్వాధీనం చేసుకుంటాం

అనంతగిరి గ్రామ పంచాయతీ హెచ్చరిక

అనంతగిరి,ఆగస్టు 19(అనంత జనశక్తి న్యూస్):




అనంతగిరి గ్రామ పంచాయతీ పరిధిలో పశువులను నిర్లక్ష్యంగా వదిలేస్తున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ నిర్ణయించింది. పశువులు ఇతర రైతుల పంట పొలాల్లోకి వెళ్లి పంటలను నష్టపరుస్తున్నాయని రైతుల నుంచి పంచాయతీకి ఫిర్యాదులు అందడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పంచాయతీ అభివృద్ధి అధికారి, సి.హెచ్.దేవా తెలిపారు.అదేవిధంగా రాత్రి వేళల్లో పశువులు మండల కేంద్రానికి వచ్చి ప్రధాన రహదారులపై అడ్డంగా పడుకోవడం, వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం జరుగుతోందని పేర్కొన్నారు.కొన్ని సందర్భాల్లో పశువులు వాహనాలకు అడ్డంగా వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. సరైన పోషణ, సంరక్షణ, కాపలా లేకపోవడంతో కొన్ని పశువులు అనారోగ్యానికి గురై మండల కేంద్రంలోనే మృతి చెందిన సందర్భాలు కూడా ఉన్నాయని పంచాయతీ అధికారులు వెల్లడించారు. పశువులను నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల రైతులు, ప్రజలు, వాహనదారులతో పాటు మూగజీవులకు కూడా నష్టం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**మూడు నోటీసుల తర్వాత స్వాధీనం**

పశువుల యజమానులు ఇకపై తమ పశువులను నిర్లక్ష్యంగా బయటకు వదలకుండా బాధ్యతగా కాపలా కాయాలని గ్రామ పంచాయతీ సూచించింది. పశువులను రోడ్లపైకి, ఇతరుల పంట పొలాల్లోకి వదిలేస్తే ముందుగా మూడు సార్లు నోటీసుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తామని, అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోతే నిబంధనల ప్రకారం సంబంధిత పశువులను గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకుని యజమానులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రజలు, రైతులు, వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పశువుల యజమానులు పంచాయతీకి సహకరించాలని అధికారులు కోరారు.

## జిల్లేడుబండ రిజర్వాయర్‌పై కదలిక

- పరిహారం లేకుండానే గతంలో పనులు....
- ఎత్తు పెంచితే ముంపు భయంతో రైతుల ఆందోళన....
- మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడుతో బాధిత రైతుల భేటీ......
- ఇంజినీర్ల బృందంతో పరిశీలన.....

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి,

ఆగష్టు 19, అనంత జనశక్తి న్యూస్ :



శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం పాడరాళ్లపల్లి రైతుల సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లేడుబండ రిజర్వాయర్ ఎత్తు పెంచే ప్రతిపాదనతో తమ సాగుభూములు, ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఇంజినీర్ల బృందాన్ని గ్రామానికి పంపాలని మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు నిర్ణయించారు.

బాధిత రైతులు బుధవారం శాసనసభ ప్రాంగణంలో మంత్రులను కలిసి తమ సమస్యలను వివరించి విజ్ఞాపన పత్రం అందజేశారు. గతంలో రిజర్వాయర్ పనులు చేపట్టినప్పటికీ ప్రభావిత రైతులకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదని, పునరావాస చర్యలు కూడా చేపట్టలేదని తెలిపారు. పనులు పూర్తిస్థాయిలో సాగకుండా మట్టిపనులకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. ముదిగుబ్బకు నాలుగు కిలోమీటర్ల దూరంలోని పాడరాళ్లపల్లి పరిసరాల్లో జిల్లేడుబండ వాగుపై సుమారు 18 ఏళ్ల క్రితం రిజర్వాయర్ నిర్మించారు. అప్పట్లో కొంత భూమి ముంపునకు గురైనా మిగిలిన భూములకు సాగునీరు అందడంతో రైతులు ఏటా రెండు, మూడు పంటలు సాగుచేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్ ఎత్తు పెంచితే తమ మిగిలిన భూములు కూడా ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ముంపునకు గురయ్యే భూములకు తగిన పరిహారం, ఇళ్లు కోల్పోయే వారికి పునరావాసం కల్పించాలని వారు కోరుతున్నారు. గతంలో పుట్టపర్తి రహదారి సమీపంలో ఇంటి స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న మంత్రులు.. ఇంజినీర్ల బృందంతో పాడరాళ్లపల్లిలో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని నిర్ణయించారు. గ్రామం, సాగుభూములు, ఇళ్లు, నీటి ప్రవాహ మార్గాలను పరిశీలించి నివేదిక రూపొందించనున్నారు. ఆ నివేదిక ఆధారంగా రైతులకు న్యాయం జరిగేలా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రులు తెలిపారు.

## టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం.. ఇది మరోసారి నిరూపితమైంది



- స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ పై టీడీపీ నేతల సంబరాలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం
- జగన్ రెడ్డి బీసీలకు రిజర్వేషన్లకు 24శాతానికి తగ్గించారని ఆగ్రహం

అనంతపురం ఆగస్టు 19 అనంత జనశక్తి న్యూస్

తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని.. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇది మరోసారి నిరూపితం చేసిందని.. అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీ నాయకులు, బీసీ విభాగం నేతలు అన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.33 శాతం చొప్పన బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంపై వారు సంబరాలు చేసుకున్నారు.అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు వారు టవర్ క్లాక్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.బీసీలంతా ముక్తకంఠంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎప్పటికీ చరిత్రలో ఉంటుందన్నారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, మంత్రి లోకేష్ కి ధన్యవాదాలు తెలినారు. బీసీలు అన్నింటా ప్రాధాన్యత ఇవ్వాలని ఆ రోజు పరితపించారని.. ఎంతో మంది బీసీలను చట్టసభలకు పంపారన్నారు. అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు కి బీసీలకు మొట్టమొదటిసారిగా 1995లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన గొడ్డలి పార్టీ నాయకుడు 2019లో బీసీ రిజర్వేషన్లలో కోత పెట్టి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16వేల మందికి పైగా బీసీలు పదవులకు దూరమయ్యారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు కి తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోనే బీసీలకు 34శాతాన్ని మళ్లీ అమలు చేస్తామని చెప్పడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబు గారి అధికారంలో ఉన్న ప్రతిసారీ బీసీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారని అన్నారు. తాజాగా గవర్నర్ కోటాలో ఇద్దరికి ఎమ్మెల్సీలుగా అవకాశం ఇస్తే.. ఇందులో ఒక బీసీ మహిళ అందునా వెనుకబడిన వడ్డెర కులానికి చెందిన మహిళకు అవకాశం కల్పించారన్నారు. అది కూడా ఒక సామాన్య కార్యకర్తగా ఉన్న మహిళకు అవకాశం కల్పించారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి అర్బన్ నియోజకవర్గ నేతలంతా కృతజ్ఞతలు తెలిపారు.

## పాత్రికేయుల స్థలాల ఆక్రమణ పై జిల్లా కలెక్టర్ కి వినతి

పుట్టపర్తి రూరల్ ఆగష్టు 19 అనంత జన శక్తి న్యూస్.



2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించిన భూమిలో కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్న నేపథ్యంలో పట్టాలు పొందిన పాత్రికేయులు, జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్కు బుధవారం వివిధ ప్రముఖ పత్రికల్లో పని చేస్తున్న జర్నలిస్టులు కలసి వినతిపత్రం అందించి విషయాన్ని తెలియపరిచారు. 2009 కప్పల బండ పొలంలో సర్వేనెంబర్ 275 8లో ఒక ఎకరం నాలుగు సెంట్లు. అప్పటి తాసిల్దార్ 18 మంది జర్నలిస్టులకు మూడు సెంట్లు చొప్పున పట్టాల మంజూరు చేశారు. కానీ కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి అదే భూమిలో ఫేక్ పట్టాలు సృష్టించి కోర్టుకు వెళ్లారు. కోర్టులో సైతం జర్నలిస్టులకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. కోర్టు తీర్పును కూడా లెక్కచేయకుండా ఆక్రమణదారులు ఆ స్థలం అవతలి వైపున ప్రభుత్వ భూమిని ప్లాట్లు వేసి అమ్మడం కోసం జర్నలిస్టులో స్థలంలో 40 అడుగుల రోడ్డు చూపించి సైట్లు అమ్ముకోవడానికి ప్రయత్నాలు చేస్తున్న తరంలో జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్డిఓ, తాసిల్దార్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు రికార్డులను పరిశీలించి పాత్రికేయులకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు.

## ఐగాట్ కర్మయోగి కోర్సులను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి,ఆగస్టు,19:అనంత జనశక్తి న్యూస్

ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్య పెంపుదల కోసం రూపొందించిన 'ఐగాట్ కర్మయోగి' (iGOT Karmayogi) వేదికపై కేటాయించిన కోర్సులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ నుండి జిల్లా అధికారులు, ముఖ్యంగా విద్యాశాఖ అధికారులతో ఐగాట్ కర్మయోగి కోర్సుల పురోగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి, ఉపాధ్యాయుడు తమకు కేటాయించిన ఐగాట్ కర్మయోగి కోర్సులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలి. పెండింగ్‌లో ఉన్న కోర్సులను వెంటనే పూర్తి చేసేలా శాఖాధిపతులు పర్యవేక్షించాలి. ప్లాట్‌ఫారమ్‌లో నిష్క్రియాత్మకంగా (In active) ఉన్న ఉద్యోగులను గుర్తించి, వారితో వెంటనే కోర్సులు పూర్తి చేయించేలా విద్యాశాఖ మరియు ఇతర శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలి.పరిపాలనా నైపుణ్యాలు, ప్రజా సేవల్లో పారదర్శకత పెంచేందుకు ఈ డిజిటల్ శిక్షణా కోర్సులు ఎంతో దోహదపడతాయని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సిపిఓ విజయ్ కుమార్,జిల్లా విద్యాశాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## బీసీల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

- 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించేందుకు ధన్యవాదాలు
- భవిష్యత్తులోనూ బీసీలకు అన్నిరకాలుగా అండగా నిలుస్తామని మంత్రి కొల్లు రవీంద్ర భరోసా

అమరావతి ఆగస్టు 19 అనంత జనశక్తి న్యూస్

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ప్రత్యేక ధన్యవాదాలు అని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. దేశానికి 1947లోనే స్వాతంత్ర్యం వచ్చినా.. బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించి అసలైన స్వాతంత్రం ఇచ్చింది తెలుగుదేశం పార్టీ. పటేల్ పట్వారి, కరణం మనసబు వ్యవస్థలు రద్దు చేసిన ఎన్టీఆర్ బీసీలకు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించి సామాజిక గౌరవం కల్పించారు. చంద్రబాబు వచ్చాక బీసీ రిజర్వేషన్లను 34 శాతం చేశారు. 1995 నుండి 34 శాతం రిజర్వేషన్లు అమలవుతుంటే.. జగన్ రెడ్డి కుట్ర చేసి 24 శాతానికి కుదించాడు. దాదాపు 16,800 మందికి రాజకీయ అవకాశాలు లేకుండా చేశారు. టిడిపిలోని బీసీలను అణచివేసే లక్ష్యంతో తప్పుడు కేసులు పెట్టాడు.. హత్యలు చేశారు. కూటమి రెండేళ్ల పాలన బీసీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పనిచేస్తుంది. బీసీలు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా ఎదిగేలా తోడ్పాటు అందిస్తున్నాం. భవిష్యత్తులోనూ బీసీ రిజర్వేషన్లకు ఇబ్బందులు లేకుండా చట్టం చేస్తామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

గురువారం | అనంతపురం
20.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# చిన్న పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



- ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు జయరాజ్, రేపటి రామాంజినేయులు

అనంతపురం, ఆగస్టు 19:అనంత జనశక్తి న్యూస్

రాష్ట్రంలోని మధ్యతరహా, చిన్న పత్రికల పరిరక్షణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ కవరకుంట్ల జయరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజినేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆంధ్రప్రదేశ్ మధ్యతరహా, చిన్న దినపత్రికలు అండ్ పీరియాడికల్స్ జర్నలిస్ట్ అసోసియేషన్ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం డీఎస్పీ చంద్రశేఖర్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు మాట్లాడుతూ చిన్న, మధ్యతరహా పత్రికల పరిరక్షణతో పాటు వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టుల హక్కుల కోసం కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం జారీ చేసే ప్రకటనల్లో మధ్యతరహా, చిన్న, ఇతర పత్రికలకు 30 శాతం వాటా కల్పించాలని నూతన కమిటీ సభ్యులు కోరారు. పత్రికల ఎంపానెల్‌మెంట్ సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు, వార్తల కవరేజీలో చిన్న, మధ్యతరహా పత్రికలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్, జర్నలిస్టులందరికీ ప్రమాద బీమా వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**అనంతపురం జిల్లా కమిటీ.**
గౌరవాధ్యక్షుడిగా శంకర ప్రసాద్, అధ్యక్షుడిగా డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా లోకేష్, రామాంజినేయులు, జోడు రమేష్, ప్రధాన కార్యదర్శిగా కే. శ్రీరాములు, సహాయ కార్యదర్శులుగా ప్రసాద్, నాగేంద్ర, శరత్ కుమార్ రెడ్డి, కోశాధికారిగా జీ. ఆనంద్, కార్యవర్గ సభ్యులుగా సుబ్బయ్య, సంజీవరెడ్డి, భూపాలం సతీష్ కుమార్, భాస్కర్, భాస్కర్, నరసింహమూర్తి, హరికృష్ణ, బాలరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సిరిసాల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**శ్రీ సత్యసాయి జిల్లా కమిటీ.**
గౌరవాధ్యక్షుడిగా ఎన్. నారాయణ, అధ్యక్షుడిగా బి. రవీంద్రనాయక్, ప్రధాన కార్యదర్శిగా కే.ఎన్. నాగరాజు, ఉపాధ్యక్షులుగా సాకే శ్రీనివాసులు, కోలా బ్రహ్మయ్య, జాయింట్ సెక్రెటరీగా పి. మల్లిక, కోశాధికారిగా పి. మహబూబ్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ గౌరవాధ్యక్షుడు తలారి రామాంజనేయులు, జిల్లా నాయకులు డాక్టర్ సూర్య, సీనియర్ జర్నలిస్టులు ఆజాద్, సుబ్బయ్య, శంకరప్రసాద్, బాబ్జాన్, సురేష్, శ్రీరాములు, ఓ. భాస్కర్, డాక్టర్ ఉద్దండం చంద్రశేఖర్, రామ్మూర్తి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులను అందచేసిన ఆర్డిటి



యాడికి , ఆగష్టు 19, అనంత జనశక్తి న్యూస్

మండల కేంద్రంలోని వినాయకుని గుడి సమీపంలో బాధితుడు వెంకటేష్ కు బుధవారం నిత్యవసర సరుకులను ఆర్ డి టి సంస్థ అందచేశారు. మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఇంట్లోని కిరాణా సామగ్రితో పాటు తినుబండారాల తయారీకి వినియోగించే వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి.సుమారు రూ.లక్ష మేర ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా, బుధవారం ఆర్డీటీ సంస్థ సిబ్బంది వెంటనే స్పందించి సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు.బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు, ఇతర అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు.ఆర్డీటీ సంస్థ సిబ్బంది, యాజమాన్యానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి చైర్మన్ హరినారాయణ, రీజనల్ డైరెక్టర్ శాంతమ్మ, తాడిపత్రి ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ లలిత, కోఆర్డినేటర్ నాగమణి పాల్గొన్నారు

# క్రీడలకు మరింత ప్రోత్సాహం అందించే దిశగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

- శాప్ ఛైర్మన్ రవినాయుడు ని, శాప్ ఎండీ భరణి ఐఎఎస్ ని కలిసిన ఎమ్మెల్యే
- ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మించాలని విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు

అనంతపురం ఆగస్ట్ 19,అనంత జనశక్తి న్యూస్



అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో క్రీడల్ని, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా విజయవాడలో ఆయన శాప్ ఛైర్మన్ రవినాయుడుని, శాప్ ఎండీ భరణి ఐఎఎస్ ని కలిశారు. నియోజకవర్గంలోని యువత మరియు క్రీడాకారుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించేందుకు, వారికి మెరుగైన క్రీడా మౌలిక వసతులు, శిక్షణా సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఖేలో ఇండియా' పథకం కింద అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో మల్టీపర్పస్ ఇండోర్ హాల్ మరియు స్క్వాష్ కోర్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతిపాదిత మల్టీపర్పస్ హాల్ మరియు స్క్వాష్ కోర్టు ద్వారా స్థానిక యువత, క్రీడాకారులు నిత్య శిక్షణ పొందడంతో పాటు వివిధ స్థాయి పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాలను మరింతగా మెరుగుపరుచుకునే అవకాశం లభిస్తుందన్నారు. అదేవిధంగా యువతలో ఆరోగ్యకరమైన జీవనశైలిని, క్రమశిక్షణను, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఈ సదుపాయాలు ఎంతో దోహదపడతాయన్నారు. అర్బన్ నియోజకవర్గంలో అనువైన స్థలాన్ని గుర్తించి మల్టీపర్పస్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రతిపాదనను సిద్ధం చేసి... ఖేలో ఇండియా పథకం కింద అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు తెలిపారు. వీటిని నిర్మాణానికి కావాల్సిన నిధులను మంజూరు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై శాప్ ఛైర్మన్ రవినాయుడు గారు సానుకూలంగా స్పందించారు. మల్టీపర్పస్ ఇండోర్ హాల్, స్క్వాష్ కోర్టు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

# స్వరం లోనే కాదు... పరిశోధనలో కూడా దిట్టే..!!

- చారిత్రక పరిశోధకురాలైన సోమిశెట్టి సరళ కు "విశిష్ట మహిళారత్న" బిరుదు ప్రధానం.

ధర్మవరం ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్:



80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ప్రముఖ జానపద గాయని, చారిత్రక పరిశోధకురాలైన సోమిశెట్టి సరళకు విశిష్ట మహిళరత్న బిరుదు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా పెద్దకాకాని ఉప్పల ఫంక్షన్ హాల్ లో తేజోద్భావం ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ గాయత్రి సమక్షంలో లో నిర్వహించిన ఇరు తెలుగు రాష్ట్రాల్లో ని పలు రంగాలలో విశేష కృషి చేసిన మహిళ లకు విశిష్ట మహిళా రత్న పురస్కారాలకు ఎన్నికచేసి పురస్కారాలను అందచేశారు అని తెలిపారు. తానుఒక గాయనిగా జానపద కళారంగానికు మరియు స్వాతంత్ర్య సమర ఉద్యమ చారిత్రక విశేషాలను పరిశోధించి వ్యాసాలు వ్రాసి జాతీయస్థాయిలో టాప్ కాంట్రిబ్యూటర్ గా ఉన్నత సేవలు అందించిన వైనాన్ని గుర్తింపు ఇస్తూ ఈ పురస్కారానికి ఎన్నిక చేయగా కార్యక్రమంలో గుంటూరు మెంబెర్ ఆఫ్ లెజిస్లేటివ్ మెంబెర్ అయిన శ్రీమతి పోతుల సునీత ట్రస్ట్ చైర్మన్ గాయత్రి చేతుల మీదుగా ఈ విశిష్ట మహిళా రత్న పురస్కారం అందచేశారు అని తెలిపారు. ఈ సందర్భంగా ఎం ఎల్ సి పోతుల సునీత సోమిశెట్టి సరళ యొక్క విశేష కళా ప్రయాణాన్ని అడిగి మరీ తెలిసికొని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ అవార్డు కళాకు అంకితం అని తెలిపారు.

# బ్రహ్మం చౌదరిని తన నివాసానికి వెళ్లి పరామర్శించిన ఎమ్మెల్యేలు పరిటాల సునీత, ఎమ్.ఎస్.రాజు

- ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ కు గురైన బ్రహ్మంచౌదరి
- త్వరలోనే మళ్లీ కీలకంగా పని చేస్తారన్న ఎమ్మెల్యేలు సునీత, రాజు

అమరావతి ఆగస్టు 19 అనంత జనశక్తి న్యూస్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్.ఎస్.రాజు పరామర్శించారు. ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఆసుపత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్న అయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విజయవాడలో ఉన్న ఎమ్మెల్యేలు బ్రహ్మం చౌదరి ఇంటికి వెళ్లారు. ఆయన్ని పరామర్శించి.. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం బాగా ఉందని బ్రహ్మం చౌదరి తెలిపారు. మరింత విశ్రాంతి తీసుకుని.. మళ్లీ మీ సేవలు ప్రారంభించాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీతో పాటు వివిధ సమయాల్లో పార్టీ కోసం అనేక సేవలందించిన బ్రహ్మంచౌదరి చిన్న వయసులోనే ఇలా అనారోగ్యానికి గురి కావడం బాధాకరమని ఈసందర్భంగా ఎమ్మెల్యేలు అన్నారు. దేవుని దయ వలన ఆయన త్వరగా కోలుకున్నారని.. మరికొద్ది రోజుల్లో కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ గా తన సేవల్ని తిరిగి ప్రారంభిస్తారని వారు తెలిపారు...

# సీఐ రాజగోపాల్ నాయుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- సిఐ ని సస్పెండ్ చేసే వరకు పోరాటం ఆపేది లేదు
సాకే వినయ్ కుమార్*
- విచారణలో కాలయాపనపై మండిపాటు.
- ఆగస్టు 21న "ఛలో ఎస్పీ ఆఫీస్" పిలుపు

శ్రీ సత్యసాయి జిల్లా ప్రతినిధి,
ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్:




హిందూపురం వన్ టౌన్ సీఐ రాజగోపాల్ నాయుడు తన అధికార పరిధిని తీవ్రంగా ఉల్లంఘిస్తూ, కుల దురహంకారంతో వ్యవహరించడాన్ని బహుజన సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని బిఎస్పీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు సాకే వినయ్ కుమార్ స్పష్టం చేశారు. ధర్మవరం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి కొట్టాము ప్రసాద్, నాయకులు రాజు నాయక్ మరియు ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు రాచర్ల నారాయణస్వామితో కలసి ఆయన మాట్లాడారు. హిందూపురంలోని మాతృవందం ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల సిజరిన్ ఆపరేషన్ వికటించి రమ్యశ్రీ అనే గర్భిణి మరణించిన ఘటనలో నిజాలను దాచిపెట్టగా, బాధితులకు అండగా నిలిచిన దళిత నేత, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణపై సీఐ రాజగోపాల్ నాయుడు దౌర్జన్యానికి దిగి, కాలర్ పట్టుకుని నెట్టివేస్తూ అక్రమంగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఈ దౌర్జన్యంపై ఇదివరకే ప్రజా స్పందన ద్వారా జిల్లా ఎస్పీ కి అధికారికంగా ఫిర్యాదు అందించామని, ఈ వ్యవహారంలో కదిరి డిఎస్పీని విచారణాధికారిగా నియమించినప్పటికీ ఎలాంటి పురోగతి లేకుండా కాలయాపన చేయడం శోచనీయమని పేర్కొన్నారు. స్పష్టమైన ఆడియో, వీడియో ఆధారాలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడం పక్షపాత వైఖరికే నిదర్శనమని ఆరోపించారు.పోలీస్ యంత్రాంగం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సీఐ రాజగోపాల్ నాయుడిపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 115, 129, 130, 131 కింద కేసు నమోదు చేసి, ఆయనను విధుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేకూరేలా ఉమ్మడి అనంతపురం జిల్లా దళిత, గిరిజన, బహుజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 21, శుక్రవారం ఉదయం 10.00 గంటలకు తలపెట్టిన "ఛలో ఎస్పీ ఆఫీస్" (శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయం ముట్టడి) కార్యక్రమానికి బిఎస్పీ పూర్తి మద్దతు ప్రకటిస్తోందని వెల్లడించారు. ధర్మవరం నియోజకవర్గంలోని ప్రజాసంఘాల నాయకులు, దళిత, బహుజన సోదరులు మరియు ప్రజాస్వామ్యవాదులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అక్రమాలకు పాల్పడిన సీఐపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకునేంత వరకు తమ పోరాటం ఆగదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

# బొర్రపాలెంలో గిరిజనులకు రి-సర్వేపై అవగాహన



అనంతగిరి,ఆగస్టు 19 అనంత జనశక్తి న్యూస్

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట పంచాయతీ పరిధిలోని బొర్రపాలెం గ్రామంలో భూముల రి-సర్వేపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతగిరి డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం గ్రామస్తులకు రి-సర్వే ప్రక్రియపై వివరించారు.రి-సర్వే ప్రారంభానికి ముందు గ్రామాల్లో భూములు కలిగిన రైతులు చేపట్టాల్సిన పనులు, అవసరమైన పత్రాలు, సర్వే సమయంలో పాటించాల్సిన అంశాలను ఆయన వివరించారు. రి-సర్వేలో భాగంగా గ్రామంలోని భూములు కలిగిన రైతులందరూ తప్పనిసరిగా పాల్గొని, తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.అలాగే గ్రామ సభలో పాల్గొని రి-సర్వేపై తమకు ఉన్న సందేహాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలని కోరారు. రి-సర్వే ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు గ్రామస్తులు అధికారులకు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, మాజీ సర్పంచ్ గణేష్, పేసా కమిటీ సభ్యులు బొంజు నాయుడు, జైరాజ్, మాజీ వార్డు సభ్యుడు నాగరాజు, ఇన్‌చార్జి వీఆర్వో రామకృష్ణ, వీఆర్ఏలు, గ్రామ పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే నెట్‌వర్క్‌ను బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

**నాలుగు కీలక రైల్వే లైన్లు ఇవే..**

**ఈ కొత్త ప్రాజెక్టుల ద్వారా రైల్వే నెట్‌వర్క్‌కు అదనంగా మరో 410 కిలోమీటర్ల మేర లైన్లు తోడవనున్నాయి. ఆమోదం పొందిన ప్రాజెక్టుల వివరాలు:**

**ఖరగ్‌పూర్ - భద్రక్ (రాణితాల్) 4వ లైన్: 173 కిలోమీటర్లు**

**గుమ్మిడిపూడి - గూడూరు 3వ, 4వ లైన్: 90 కిలోమీటర్లు (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలకు అత్యంత కీలకం)**

**భద్రక్ - హరిదాస్‌పూర్ 4వ లైన్: 75 కిలోమీటర్లు**

**కటక్ - పారాదీప్ (బడబంధ) 3వ, 4వ లైన్: 72 కిలోమీటర్లు**

60 లక్షల మంది ప్రజలకు నేరుగా ప్రయోజనం
ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే రైళ్ల రాకపోకల వేగం పెరగడమే కాకుండా, పట్టాలపై రద్దీ గణనీయంగా తగ్గుతుంది. 'పీఎం గతిశక్తి' జాతీయ మాస్టర్ ప్లాన్ ప్రాతిపదికన రూపొందించిన ఈ పథకాల ద్వారా దాదాపు 6,448 గ్రామాలకు, సుమారు 60 లక్షల మంది జనాభాకు నేరుగా మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఇది ప్రాంతీయంగా స్వయం సమృద్ధిని సాధించడమే కాక, కొత్త ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విరివిగా సృష్టిస్తుందని కేంద్రం స్పష్టం చేసింది.

పర్యాటక రంగానికి బూస్ట్.. పర్యావరణానికి రక్షణ
ఈ కొత్త లైన్లు అందుబాటులోకి వస్తే నేలపట్టు పక్షుల కేంద్రం, పులికాట్ సరస్సు, భితర్కనిక నేషనల్ పార్క్, కుల్దిహా వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, చండీపూర్ బీచ్, లలితగిరి బౌద్ధ క్షేత్రం, లార్డ్ వీరరాఘవ పెరుమాళ్ కోవెల, దబలేశ్వర్ ఆలయం వంటి ప్రసిద్ధ పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలకు ప్రయాణం మరింత సులభతరం కానుంది.



దీంతో పాటు బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఉక్కు, ఆటోమొబైల్, ధాన్యాల రవాణా వేగవంతమై, ప్రతి ఏటా అదనంగా 76 మిలియన్ టన్నుల (MTPA) సరుకు రవాణా సాధ్యమవుతుంది. రైలు రవాణా పెరగడం వల్ల సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతులు తగ్గడమే కాకుండా, 65 కోట్ల కిలోల కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. ఇది 2.60 కోట్ల చెట్లను నాటడంతో సమానమని కేంద్రం తన ప్రకటనలో వివరించింది.

# తప్పుడు ప్రచారానికి చెంపపెట్టు

- రేగా కాంతారావుపై కేసు కొట్టివేత
- రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలు

తగవు: బీఆర్ఎస్ శ్రేణులు

మణుగూరు, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్ :



బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన కేసును కోర్టు కొట్టివేయడంతో నిజం గెలిచిందని ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా కొంతమంది మీడియా సంస్థలు, కాంగ్రెస్ నాయకులు రాజకీయ కక్షతో రేగా కాంతారావు ప్రతిష్టను దెబ్బతీసేలా అసత్య ప్రచారం చేశారని ఆరోపిస్తూ తీవ్రంగా ఖండించారు. కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజా నాయకుడి వ్యక్తిత్వాన్ని కించపరిచే ప్రయత్నాలను ఇకనైనా మానుకోవాలని కోరారు. రాజకీయ విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రేగా కాంతారావు ఎప్పుడూ ప్రజల సమస్యలు, కార్యకర్తల సంక్షేమం, పినపాక నియోజకవర్గ అభివృద్ధి కోసం పోరాడిన నాయకుడని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నాయి. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నాలు చేస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కోర్టు తీర్పు అనంతరం వాస్తవాలను గుర్తించి, ఆధారాలు లేని ఆరోపణలకు దూరంగా ఉండాలని సూచించారు. ఇకనైనా తప్పుడు ప్రచారాన్ని నిలిపివేయాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కోరారు.

# గిన్నిస్ రికార్డు సాధించిన ఈశ్వితకు ఘన సన్మానం



- గిన్నిస్ రికార్డుతో గుండాల మండలానికి గర్వకారణం
- ఈశ్వితకు కాంగ్రెస్ పార్టీ తరఫున అండగా ఉంటాం: ఊకే బుచ్చయ్య

గుండాల, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గంలోని గుండాల మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గుండెబోయిన లక్ష్మీనారాయణ కుమార్తె గుండెబోయిన ఈశ్విత ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఈ విషయం తెలుసుకున్న గుండాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఊకే బుచ్చయ్య బుధవారం ఈశ్విత నివాసానికి వెళ్లి ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఊకే బుచ్చయ్య మాట్లాడుతూ.. చిన్నారి ఈశ్విత ఇంత చిన్న వయసులోనే గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం గుండాల మండలానికే గర్వకారణమన్నారు. ఈశ్వితను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మొత్తం 1,212 మంది పాల్గొన్న కరాటే పోటీల్లో ఇంత చిన్న వయసులో ధైర్యంగా పాల్గొని ప్రతిభ కనబరిచిన ఈశ్వితను చూసి ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈశ్విత భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుండాల మండల కాంగ్రెస్ నాయకులు వాంకుడోత్ రమేష్, ఎస్కే కాశీం, పల్లపు రాజేష్, నూనావత్ రవి, బానోత్ నరేందర్, గడ్డం రాజేష్, తిర్రి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు పచ్చని భద్రాచలం అందిద్దాం



- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి: ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు పచ్చని భద్రాచలాన్ని అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ పిలుపునిచ్చారు. భద్రాచలం పాత మార్కెట్ సెంటర్‌లోని భద్రాద్రి గిరిజన మార్ట్ ప్రాంగణంలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. "ఒక్క మొక్క నాటి.. భవిష్యత్తును కాపాడుదాం" అనే సందేశంతో గ్రీన్ భద్రాద్రి చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. భద్రాచలం పట్టణాన్ని హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, వృక్ష ప్రేమికులు సమష్టిగా ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు రామకృష్ణ రెడ్డి, కార్యదర్శి భూక్యా రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రాంప్రసాద్ రెడ్డి, వ్యవస్థాపక సభ్యులు జి. రాజారెడ్డి, గంగాధర వీరయ్య, కృష్ణార్జునరావు, డాక్టర్ కృష్ణప్రసాద్, తుమ్మలపల్లి సావిత్రి, లక్ష్మి, తులసి, పూసం రవికుమారి, పద్మ, పద్మావతి, పద్మప్రియ, టాటా మ్యాజిక్ అసోసియేషన్ సభ్యులు, దాతలు, వృక్ష ప్రేమికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌పుట్ డీలర్లు రైతులకు సహాయకులుగా పనిచేయాలి

- కలెక్టర్ అంకిత్
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి
- 39 మంది ఇన్‌పుట్ డీలర్లకు డిప్లొమా సర్టిఫికెట్లు అందజేత

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్

చుంచుపల్లి రైతు వేదికలో దేశీ శిక్షణ పూర్తి చేసుకున్న 39 మంది ఇన్‌పుట్ డీలర్లకు జిల్లా కలెక్టర్ అంకిత్ డిప్లొమా సర్టిఫికెట్లు అందజేశారు. ఇన్‌పుట్ డీలర్లు రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పిస్తూ సాంకేతిక సహాయకులుగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో వర్షపాతం లోటు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటలు, పంటల మార్పిడిపై దృష్టిసారించేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయిల్‌పామ్, కూరగాయలు, మిరప వంటి పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. దేశీ




శిక్షణలో ప్రతిభ కనబరిచిన గుడిపాటి విజయభాస్కర్‌కు గోల్డ్ మెడల్, అనగారి కళ్యాణ్‌కు సిల్వర్ మెడల్ లభించడంతో కలెక్టర్ అభినందించారు. అనంతరం చుంచుపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి, సాదా బైనామా దరఖాస్తులతో పాటు వివిధ ధ్రువీకరణ పత్రాల పెండింగ్ వివరాలను పరిశీలించారు. పెండింగ్ దరఖాస్తులను దరఖాస్తుల వారీగా పరిశీలించి, జాప్యానికి కారణాలను గుర్తించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు పారదర్శకంగా, వేగంగా అందించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో సుభాషిని, ఫెసిలిటేటర్ డేవిడ్ జైపాల్ రావు, వ్యవసాయ శాఖ అధికారులు, ఇన్‌పుట్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై విస్తృత చర్చ

- ఎస్ఐఆర్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి
- సచిన్ సావంత్‌కు పాయం వెంకటేశ్వర్లు ఘన సత్కారం

తెలంగాణ ప్రతినిధి, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్ :




ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్ (డీసీసీ కార్యాలయం)లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) జిల్లా రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యులు సచిన్ సావంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్న, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. అలాగే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియపై పార్టీ శ్రేణులను అప్రమత్తం చేయాలని నిర్ణయించారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, ఓటర్ల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సమావేశంలో నాయకులు సూచించారు. పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం అయ్యేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**సచిన్ సావంత్‌కు పాయం ఘన సత్కారం**

ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సచిన్ సావంత్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శాలువాతో ఘనంగా సత్కరించారు. పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఏకలవ్య పాఠశాల ముందు ఏకమైన ఆదివాసీ జేఏసీ నేతలు

- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి: జేఏసీ డిమాండ్

గుండాల, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్

ముత్తాపురం గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కొనసాగుతున్న దీక్షకు మద్దతుగా ఆదివాసీ జేఏసీ నాయకులు ధర్నా నిర్వహించారు. ముత్తాపురం గ్రామపంచాయతీ సర్పంచ్‌లు కల్తీ రాధా, కల్తీ రజిత జేఏసీ చైర్మన్ చుంచ రామకృష్ణకు పూలమాల వేసి దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ చుంచ రామకృష్ణ మాట్లాడుతూ.. పాఠశాలలో అనుమతులు లేకుండా తీజ్ పండుగ నిర్వహించిన ఉపాధ్యాయులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంఘ నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తూ, ఉద్యోగులను బెదిరిస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ధర్నా శిబిరాన్ని ఆర్‌సీవో అరుణ సందర్శించి నాయకులతో మాట్లాడారు.

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెస్ మేనేజ్మెంట్ ఉపాధ్యాయుడు రమేష్‌పై విద్యార్థుల పట్ల జాతి వివక్ష చూపుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. అనంతరం ఆదివాసీ సంఘాల నాయకులు ఆర్‌సీవోకు డిమాండ్ పత్రం అందజేశారు. డిమాండ్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, సస్పెండ్ చేసే అధికారం తమకు లేదని ఆర్‌సీవో తెలిపారు.

కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు వాగబోయిన చంద్రయ్య దొర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెం వెంకటేశ్వర్లు, పినపాక జేఏసీ మండల అధ్యక్షులు వెంకట్, పెండకట్ల నాగరాజు, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు అలెం కోటి, మోకాల వీరస్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారింది

- ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం
- కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత: బీఆర్ఎస్ ఎంపీ

భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, ఆగస్టు 19, అనంత జనశక్తి న్యూస్ :



కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకులపై కేసులు, నిర్బంధాలతో అణచివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సనత్‌నగర్ టిమ్స్ భవనాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించినప్పటికీ, వాటిని ప్రస్తుత ప్రభుత్వం తానే నిర్మించినట్లుగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. రైతుభరోసా, సాగునీరు, విద్యుత్, యూరియా, ఫీజు బకాయిలు, ఉద్యోగ ఖాళీలు, పీఆర్సీ, డీఏలు వంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రజల్లో ఆందోళన నెలకొందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనపై రైతులు, మహిళలు, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, యువత సహా అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారని, తిరిగి కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.

# విద్యార్థులే నిందితులు

- ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసు
- ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడి
- జల్సాలకు డబ్బుల కోసమే హత్య
- ఇద్దరు మైనర్ విద్యార్థులు హత్య చేశారు

హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్



జల్సాలకు డబ్బుల కోసమే ప్రిన్సిపాల్ రూపారెడ్డిని ఇద్దరు మైనర్ విద్యార్థులు హత్య చేశారని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. బుధవారం నల్గొండలో విలేకర్ల సమావేశంలో ఈ హత్యకు సంబంధించిన వివరాలను ఆయన వివరించారు. నిందితుల నుంచి రక్తంతో తడిచిన రూ.1,54,000 నగదుతోపాటు ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.15 రోజుల క్రితం హాస్టల్‌లో ఈ విద్యార్థుల బ్యాగ్‌లో సెల్ ఫోన్‌తోపాటు నగదు దొరకడంతో స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి వారిని మందలించారని తెలిపారు. ఈ విషయాన్ని వారి తల్లిదండ్రుల దృష్టికి ఆమె తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హాస్టల్ నుంచి ఇంటికి వారిని పంపి.. డే స్కాలర్‌గా మార్చారని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ రూపారెడ్డిపై వారిద్దరు పగ పెంచుకున్నారని అన్నారు. అయితే వారిద్దరిలో ఒకరు మద్యానికి బానిసగా మారారని.. దీంతో ముందే ప్లాన్ ప్రకారం రెక్కీ నిర్వహించి ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. ఇక యూట్యూబ్‌లో డబ్బులు సంపాదించడంపై ప్లాన్ వేసుకుని.. ప్రిన్సిపాల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేశారని వివరించారు. అందుకోసం ముందే కత్తిని వారు కొనుగోలు చేశారని అన్నారు. ఈ చోరీ సమయంలో వీరిని ప్రిన్సిపాల్ గుర్తు పట్టిందని చెప్పారు. దీంతో రూపారెడ్డిని 27 సార్లు కత్తితో పొడిచి హత్య చేశారని వివరించారు. జల్సా చేసేందుకు నెల క్రితం వీరు గోవా కూడా వెళ్లారని తెలిపారు. వీరిద్దరికి గంజాయి టెస్ట్ నిర్వహించగా.. నెగిటివ్ వచ్చిందని నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.





## స్పష్టమైన కంటి చూపు కోసం పాటించాల్సిన

# చిట్కాలు, తినాల్సిన ఫుడ్స్

**ప్రస్తుత కాలంలో అంటే డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల వాడకం, స్క్రీన్‌ల ముందు గంటల తరబడి గడపడం వల్ల కంటిచూపు, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో కంటి సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన జీవనశైలి మార్పులు, పోషకాహారం చాలా కీలకం. ఈ రోజుల్లో చిన్న వయసులోనే కంటి సమస్యలు పెరిగిపోతున్నాయి. ఆహారపు అలవాట్ల నుంచి జీవనశైలి వరకు సరైన జీవన విధానం లేకపోవడం కంటి చూపుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్ల వాడకం పెరగడం వల్ల కంటి సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. కంటి చూపును సహజంగా మెరుగుపరుచుకోవడానికి, అలసటను తగ్గించడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. 20 -20 -20 రూల్‌తో పాటు పోషకహారంపై దృష్టి పెట్టాలి.**



**20-20-20 సూత్రం**

ఎక్కువ సేపు స్క్రీన్‌ను చూడటం వల్ల కంటి కండరాలపై ఒత్తిడి పడి, కళ్ళు పొడిబారతాయి. డిజిటల్ స్క్రీన్ల వల్ల కలిగే ఒత్తిడిని తగ్గించడానికి ఇది అత్యంత ప్రభావవంతమైన పద్ధతి. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి స్క్రీన్ చూడటం ఆపాలి.

కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడాలి.

ఆ వస్తువును కనీసం 20 సెకన్ల పాటు గమనించాలి.

ఇది కంటి కండరాలకు విశ్రాంతినిచ్చి, తలనొప్పి, కళ్ళు పొడిబారడం వంటి సమస్యల్ని తగ్గిస్తుంది.

**సరైన భంగిమ**

మనం కూర్చునే విధానం కూడా కంటి చూపుపై ప్రభావం చూపుతుంది. అందుకే కూర్చునే విధానంపై దృష్టి పెట్టాలి.

దూరం: స్క్రీన్ కళ్ళకు కనీసం ఒక చేతి దూరంలో ఉండాలి.

స్థానం: స్క్రీన్ కంటి చూపు స్థాయి కంటే కొంచెం కిందకు ఉండేలా చూసుకోవాలి.

వెలుతురు: గదిలో మరీ చీకటిగా లేదా మరీ ఎక్కువ కాంతి ఉండకూడదు. తగినంత వెలుతురు ఉంటే కళ్ళు త్వరగా అలసిపోవు.

**పాటించాల్సిన ఇతర చిట్కాలు**

కనురెప్పలు వాల్చండి: కనురెప్పలు వాల్చడం వల్ల కళ్ళు తేమగా ఉండి, పొడిబారడం తగ్గుతుంది. స్క్రీన్ ఉపయోగిస్తున్నప్పుడు చాలా మంది సుమారు 60% తక్కువగా కనురెప్పలు వాల్చుతారు. దీంతో తరచుగా కనురెప్పలు వాల్చడాన్ని అలవాటు చేసుకోండి.

తగినంత నిద్ర: కళ్ళు సరిగ్గా పనిచేయడానికి విశ్రాంతి అవసరం. ప్రతిరోజూ 7–9 గంటల పాటు మంచి నిద్ర పొందండి. నిద్రలేమి వల్ల కళ్ళు పొడిబారడం, కనురెప్పలు అదరడం, దృష్టి మసకబారడం వంటి సమస్యలు వస్తాయి.

హైడ్రేషన్: డీహైడ్రేషన్ వల్ల కళ్ళు పొడిబారి, దృష్టి మసకబారుతుంది. అందువల్ల, ప్రతిరోజూ 8–10 గ్లాసుల నీరు తాగండి. కెఫీన్, ఆల్కహాల్ తీసుకోవడాన్ని పరిమితం చేసుకోండి.

UV కిరణాల నుంచి రక్షణ: బయట ఉన్నప్పుడు UV-రక్షణ ఉన్న సన్ గ్లాసెస్ ధరించండి. ఇది కంటి శుక్లాలు, రెటీనా సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

**పోషకాహారం కూడా చాలా ముఖ్యం**

కంటి ఆరోగ్యం మనం తీసుకునే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి.విటమిన్ A: క్యారెట్లు, బొప్పాయి

లూటిన్ & జింక్: ఆకుకూరలు ముఖ్యంగా పాలకూర, గింజలు.

ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్: చేపలు, వాల్‌నట్స్, విత్తనాలు.

సిట్రస్ పండ్లు: నారింజ, నిమ్మ వంటివి కంటిలోని రక్తనాళాలకు మేలు చేస్తాయి.



**ప్రయోజనకరమైన కంటి వ్యాయామాలు**

కనురెప్పలు ఆర్పండి: మీ కళ్ళను 10–15 సార్లు వేగంగా ఆర్పండి. ఆ తర్వాత విశ్రాంతి కోసం కొన్ని సెకన్ల పాటు కళ్ళు మూసుకోండి.

కనుబొమ్మలను తిప్పడం: నిటారుగా కూర్చొని పైకి చూస్తూ.. మీ కళ్ళను నెమ్మదిగా వృత్తాకారంలో తిప్పండి. మొదట క్లాక్ వైజ్ డైరక్షన్, ఆ తర్వాత యాంటీ క్లాక్ వైజ్ డైరెక్షన్.

దృష్టిని మార్చడం: మీ బొటనవేలును ముఖానికి సుమారు 10 అంగుళాల దూరంలో ఉంచండి. కొన్ని సెకన్ల పాటు దానిపై దృష్టి పెట్టండి. ఆ తర్వాత మరింత దూరంగా ఉన్న దానిపై దృష్టి పెట్టండి. దీనిని 10–15 సార్లు రిపీట్ చేయండి.

దగ్గర, దూర దృష్టి: మొదట దగ్గరగా ఉన్న వస్తువుపై దృష్టి పెట్టండి. ఆ తర్వాత కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువుపై దృష్టి పెట్టండి. ఇది కళ్ళ దృష్టి కేంద్రీకరించే సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది.

**ముఖ్య గమనిక**

ఈ అలవాట్లు కంటిపై ఒత్తిడిని తగ్గించి, చూపు దెబ్బతినకుండా కాపాడతాయి. అయితే, ఇవి కంటి అద్దాలకు ప్రత్యామ్నాయం కాదు. ఒకవేళ మీకు చూపు మసకబారడం వంటి తీవ్రమైన సమస్యలు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం.

## నెలసరి సమయంలో విపరీతంగా

# మొటిమలు వస్తున్నాయా



**చాలామంది మహిళలు ఎదుర్కొనే అతిపెద్ద సమస్యల్లో నెలసరి సమయంలో వచ్చే మొటిమలు ఒకటి. నెలసరి తేదీలకు కొన్ని రోజుల ముందు నుంచి ముఖంపై, ముఖ్యంగా దవడ భాగంలో మొటిమలు రావడం సర్వసాధారణం. పీరియడ్స్ సమయంలో జరిగే హార్మోన్ల మార్పులు మొటిమలు రావడానికి గల అత్యంత సాధారణ కారణాల్లో ఒకటి. అమెరికన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ వారి సమాచారం ప్రకారం ఋతుస్రావానికి ముందు ఆండ్రోజెన్ హార్మోన్ అధికంగా విడుదల కావడం వల్ల సెబేషియస్ గ్రంధులు ఎక్కువ నూనెను ఉత్పత్తి చేస్తాయి. ఇది చర్మ రంధ్రాల్ని మూసివేసి మొటిమలకు కారణం కావచ్చు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ ద్వారా అందుబాటులో ఉన్న పరిశోధన ప్రకారం, ఋతుచక్రంలోని ల్యూటియల్ దశలో హార్మోన్ల హెచ్చుతగ్గులు చర్మంలో సెబమ్ ఉత్పత్తిని, వాపును పెంచుతాయి. దీనివల్ల ఋతుస్రావానికి ముందు లేదా ఆ సమయంలో మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని కూడా తెలుస్తోంది. ఈ సమస్యకు పరిష్కార మార్గాల్ని నిపుణులు సూచించారు. కొన్ని చిన్నపాటి జీవనశైలి మార్పులతో ఈ మొటిమలను నియంత్రించవచ్చు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.**



**హార్మోన్ల మార్పులే ప్రధాన కారణం**

నెలసరి సమయంలో శరీరంలో జరిగే హార్మోన్ల హెచ్చుతగ్గులు చర్మంపై నేరుగా ప్రభావం చూపుతాయి. ఈ సమయంలో ఈస్ట్రోజన్, ప్రజెస్టిరాన్ హార్మోన్ల స్థాయిలు గణనీయంగా తగ్గుతాయి. అదే సమయంలో టెస్టోస్టిరాన్ హార్మోన్ల ప్రభావం పెరుగుతుంది. ఈ హార్మోన్ మార్పుల వల్ల చర్మ గ్రంథులు ఎక్కువ ఆయిల్‌ను ఉత్పత్తి చేస్తాయి. చర్మంలో సీబమ్ శాతం పెరగడం వల్ల సమస్య మొదలవుతుంది. ఈ ఆయిల్ చర్మంపై ఉండే చనిపోయిన కణాలతో కలిసిపోయి చర్మ రంధ్రాలను మూసివేస్తుంది. ఫలితంగా ముఖం కింది భాగంలో, దవడల వద్ద నొప్పి కలిగించే మొటిమలు వస్తుంటాయి.

**ఒత్తిడి, ఆహారపు అలవాట్ల ప్రభావం**

హార్మోన్లతో పాటు జీవనశైలి కూడా మొటిమల తీవ్రతను పెంచుతుంది. విపరీతమైన ఒత్తిడి, ఎక్కువ చక్కెర పదార్థాలు తీసుకోవడం, నిద్రలేమి వల్ల శరీరంలో కార్టిసాల్ అనే హార్మోన్ పెరుగుతుందని నిపుణులు తెలిపారు. ఇది శరీరంలో మంటను పెంచి, మొటిమల తీవ్రతను రెట్టింపు చేస్తుంది. హార్మోన్ల అసమతుల్యతతో పాటు ఈ చెడు అలవాట్లు తోడైతే చర్మ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుంది. కాబట్టి ఈ సమయంలో ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్త అవసరం.







**వీటిని తింటే మొటిమలు తగ్గుతాయి**

మొటిమలను నివారించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. శరీరానికి తగినంత తేమ అవసరం. కాబట్టి రోజూ కనీసం మూడు లీటర్ల నీటిని తాగడం తప్పనిసరి. నీరు శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపి, చర్మంపై ఆయిల్ ఉత్పత్తిని క్రమబద్ధీకరిస్తుంది. ఆహారంలో పసుపు పాలు చేర్చుకోవడం ద్వారా చర్మంపై మంట తగ్గుతుంది. అంతేకాకుండా వాల్‌నట్స్, ఫ్లాక్స్ సీడ్స్ వంటి వాటిని తీసుకోవడం ఎంతో మంచిది. ఇవి చర్మానికి అవసరమైన మంచి కొవ్వులను అందిస్తాయి. జింక్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకుంటే మొటిమలు తగ్గుముఖం పడతాయి.

**ఏం తినకూడదు?**

ఏ ఆహార పదార్థాలు మొటిమలను పెంచుతాయో తెలుసుకోవడం ముఖ్యం. నెలసరి సమయంలో పాల పదార్థాలకు దూరంగా ఉండటం మంచిది. పాలలోని కొన్ని అంశాలు చర్మంపై మొటిమలను ప్రేరేపిస్తాయి. అలాగే చక్కెర ఎక్కువగా ఉండే మిఠాయిలు, స్వీట్లు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను పూర్తిగా మానేయాలి. చక్కెర పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచి, హార్మోన్ల అసమతుల్యతను మరింత తీవ్రతరం చేస్తాయి. ఈ చిన్న మార్పులు చర్మ ఆరోగ్యంలో పెద్ద తేడాను తీసుకువస్తాయి.

**మొటిమలు రావొద్దంటే ఇలా చేయండి**

చర్మంపై ఉండే అదనపు ఆయిల్‌ను తొలగించడానికి తేలికపాటి సబ్బులు లేదా ఫేస్ వాష్ ఉపయోగించి ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. రోజుకు రెండుసార్లు కడుక్కోవడం సరిపోతుంది. అలా అని అతిగా ముఖాన్ని కడుక్కోవడం వల్ల చర్మం మరింత పొడిగా మారి ఎక్కువ ఆయిల్ ఉత్పత్తికి దారితీస్తుంది. వీటితో పాటు తగినంత నిద్ర అవసరం. నిద్రలేమి ఒత్తిడిని పెంచి మొటిమలకు కారణమవుతుంది. కాబట్టి రోజుకు ఏడు నుండి ఎనిమిది గంటల నిద్ర ఉండేలా చూసుకోవాలి.

# ‘రాకా’.. కీలక పాత్రలో హాలీవుడ్ నటుడు?



అగ్ర నటుడు అల్లు అర్జున్ హీరోగా, కోలీవుడ్ డైరెక్టర్ అట్లీ తెరకెక్కిస్తోన్న భారీ బడ్జెట్ మూవీ ‘రాకా’ . హాలీవుడ్ నటుడు విల్‌స్మిత్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర పోషించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై మేకర్స్ గతేడాది నుంచి చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. త్వరలో దీనికి సంబంధించిన షూటింగ్ ప్రారంభం కానుందని సన్నిహిత వర్గాలు తెలిపాయి. అలాగే, షారుక్ ఖాన్ కూడా ‘రాకా’లో భాగమేనని టాక్. విల్ స్మిత్, షారుక్, అల్లు అర్జున్ ఒకే ఫ్రేమ్‌లో వస్తే ‘రాకా’ భారీ సెన్సేషన్ మూవీ కావడం ఖాయమే. అయితే.. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన లేదు.

ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తోన్న విషయం తెలిసిందే. ఇందులో నలుగురు హీరోయిన్స్ ఉంటారని జోరుగా ప్రచారం జరుగుతోంది. జాన్వీ కపూర్, రష్మిక పేర్లు కూడా ఇటీవల తెరపైకి వచ్చాయి. దీనిపై టీమ్ స్పందించాల్సి ఉంది. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని పలు భాషల్లో 2027లో విడుదల చేయనున్నారు.

# పీరియడ్స్ విషయంలోనూ సిగ్గుపడేలా చేశాడు: మాజీ ప్రియుడిపై అనుపమ కామెంట్స్



చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక అనుపమ పరమేశ్వరన్ తన వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలపై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, తన మాజీ ప్రియుడి ప్రవర్తన వల్ల ఒక నటిగా, మహిళగా తనను తాను నిందించుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ ఇంటర్వ్యూకు సంబంధించిన రెండో భాగం తాజాగా విడుదలైంది. అందులో అనుపమ మాట్లాడుతూ.. “నేను ఓ నటినైనందుకు, ధైర్యంగా ఉన్నందుకు, ప్రతి నెలా పీరియడ్స్ వచ్చే ఒక మహిళనైనందుకు సిగ్గుపడే పరిస్థితిలోకి నెట్టేశాడు. నెలలో ఏ రోజు వెళ్లి.. తన తప్పులను నేను ప్రశ్నించినా ఒక్కటే మాట అనేవాడు. ‘ఓహో.. నీకు పీరియడ్స్ సమయమా.. ఇంకా రాలేదా.. మూడ్ స్వింగ్స్ కదా’ అని చులకనగా చూసేవాడు. ఆ మాటలతో నాపై నాకే అసహ్యం వేసింది. ఒకప్పుడు నాకు 11 మంది పిల్లలు ఉండాలని కలలు కనేదాన్ని. కానీ, అసలు పిల్లలే వద్దు అనే స్థాయికి వచ్చేశాను. ఒక మహిళగా పుట్టినందుకే కదా ఇలాంటి మాటలు అనిపించేది” అని అనుపమ గుర్తుచేసుకుని బాధపడ్డారు.

సుమారు రెండేళ్ల పాటు తాను అలాంటి వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నానని అనుపమ వెల్లడించారు . ఆ బంధం కారణంగా తాను తీవ్రమైన డిప్రెషన్‌లోకి వెళ్లిపోయానని చెప్పారు. షూటింగ్ సెట్స్ వద్ద క్యారవాన్‌లోకి వెళ్లి ఒంటరిగా ఏడ్చేదానినని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి నా సొంత తమ్ముడితో చనువుగా ఉండడానికి కూడా భయపడినట్లు చెప్పారు. అయితే, మాజీ బాయ్‌ఫ్రెండ్ పేరును ప్రస్తావించకుండా అనుపమ ఈ కామెంట్స్ చేశారు.

# అనుకున్న సమయానికే ప్రభాస్ ‘స్పిరిట్’

ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ ‘స్పిరిట్’. ఈ సినిమా వాయిదా పడనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా వాటిపై టీమ్ స్పందించింది. అనుకున్న సమయానికే సినిమా విడుదలవుతుందని స్పష్టం చేసింది.

ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 5న విడుదల చేయనున్నట్లు ఇటీవల ప్రకటించారు. అయితే అదే సమయానికి సల్మాన్ ఖాన్ - వంశీ పైడిపల్లి కాంబోలో రానున్న సినిమా కూడా ఉండడంతో స్పిరిట్ విడుదల వాయిదా పడుతుందంటూ ప్రచారం మొదలైంది. ‘స్పిరిట్’ షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా పెండింగ్‌లో ఉన్నాయనేది ఆ వార్తల సారాంశం. తాజాగా వీటిపై టీమ్ స్పందించింది. “స్పిరిట్ విడుదలకు సంబంధించి ఎలాంటి మార్పూ లేదు. మేం కచ్చితంగా ప్రణాళిక ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. ఈ చిత్రాన్ని మార్చి 5, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం” అని క్లారిటీ ఇచ్చింది.

ఈ మూవీలో ప్రభాస్ ( పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా ‘స్పిరిట్’లో సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



# పిల్లలు ‘టాక్సిక్’ చూడకండి: యశ్



సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రం ‘టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్’ . యశ్ ప్రధానపాత్రలో గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా గురించి యశ్ మాట్లాడుతూ ఇది కేవలం పెద్దవాళ్ల సినిమా అని స్పష్టం చేశారు. “పిల్లలు ఈ సినిమా చూడొద్దు. ఇది పెద్దల కోసం మాత్రమే తీశాం. ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తున్నాను. పెద్దలకు తప్పొప్పులు తెలుసు. వాళ్లు ఈ సినిమా నుంచి ఏం నేర్చుకోవాలో నిర్ణయించుకుంటారు. జీవితంలో ఏం చేయాలి, ఏం చేయకూడదనే విచక్షణ వారికి ఉంటుంది. అందుకే వాళ్ల కోసమే చాలా నిజాయతీగా ఈ చిత్రం రూపొందించాం” అని చెప్పారు. ఇందులోని అశ్లీల సన్నివేశాల గురించి యశ్ మాట్లాడారు. విమర్శలను తోసిపుచ్చారు. ‘ఈ చిత్రం మిమ్మల్ని ఆలోచింపచేస్తుంది. కథ నిర్దిష్టమైన దిశకు చేరుకోవాలంటే ప్రతి పాత్రలోని వేర్వేరు పొరలను ఆవిష్కరించడం చాలా ముఖ్యం. ట్రైలర్, పాటలపై ఎన్నో విమర్శలు వచ్చాయి. అవి కేవలం రెండు పాత్రల మధ్య ప్రేమను ఆవిష్కరించే సన్నివేశాలు మాత్రమే. వాటిని అలా మాత్రమే చూడండి. గీతూ మోహన్‌దాస్ ఒక దర్శకురాలు.. మహిళలకు కూడా భావోద్వేగాలు పంచుకునే హక్కు ఉంటుంది. కేవలం పబ్లిసిటీ కోసం కాకుండా, కథలోని ప్రాధాన్యతను బట్టే ఆయా సన్నివేశాలు చిత్రీకరించాం” అని అన్నారు.

# లక్ష్యసేన్ కష్టంగా..





- ఉన్నతి ముందంజ
- ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి ద్వయం
- రెండో రౌండ్లోకి ప్రవేశం

సొంతగడ్డపై జరుగుతున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు సింగిల్స్ మెరుగైన ప్రదర్శన చేస్తున్నారు. ఇప్పటికే ఆయుష్ శెట్టి శుభారంభం చేయగా.. గట్టి పోటీ ఎదురైనా లక్ష్యసేన్, ఉన్నతి హుడా కూడా ముందంజ వేశారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో గాయత్రి-ట్రీసా జంట ప్రిక్వార్టర్స్ చేరింది. లక్ష్య తొలి రౌండ్లో చెమటోడ్చాడు. పెద్దగా పేరులేని కొలిన్స్ ఫిలిమన్ (ఆస్ట్రియా)ను ఓడించేందుకు కష్టపడ్డాడు. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో లక్ష్య 16-21, 21-8, 21-4తో ఫిలిమన్‌పై గెలిచాడు. తొలి గేమ్‌లో లక్ష్యకు ఫిలిమన్ (128వ ర్యాంకు) నుంచి అనూహ్య ప్రతిఘటన ఎదురైంది. ఆ తర్వాత రెండు గేమ్‌లను లక్ష్య అలవోకగా గెలిచాడు. మహిళల సింగిల్స్‌లో భారత యువ కెరటం ఉన్నతి హుడా శుభారంభం చేసింది. తొలి రౌండ్లో ఆమె 22-20, 21-16తో తెట్ తుజార్ (మయన్మార్)ను ఓడించింది.

గాయత్రి జోడీ ముందంజ..: మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్-ట్రీసా జోలీ జంట ప్రిక్వార్టర్స్ చేరింది. తొలి రౌండ్లో గాయత్రి ద్వయం 21-15, 21-12తో లారెన్ లామ్-అలిసన్ లీ (అమెరికా) జంటను ఓడించింది. కవిప్రియ సెల్వమ్-సిమ్రన్ సింఘి జోడీకి చుక్కెదురైంది. భారత జంట 7-21, 14-21తో గాబ్రియెలా స్టొయెవా-స్టెఫాని స్టొయెవా (బల్గేరియా) జోడీ చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ ద్వయం 22-20, 19-21, 17-21తో జొనాథన్ బింగ్-సాన్ లాయ్ (కెనడా) జోడీకి తలొంచింది. సూర్య-అమృత ప్రముతేశ్ ద్వయం హోరాహోరీగా పోరాడినా ఫలితం లేకపోయింది. గంట పైనే జరిగిన ఈ పోరులో భారత జంట 21-16, 29-30, 22-24తో సన్‌మెజ్-యాస్మిన్ (తుర్కియే) జోడీ చేతిలో ఓడింది.

# టెస్టు విజయాలు అంత సులభంగా రావు



: శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో (SL vs IND) భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టీమ్ఇండియా ఐదో స్థానంలోనే కొనసాగుతున్నప్పటికీ.. విజయాల శాతాన్ని 53.33కి పెంచుకుంది. ఈ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఇంకా ఎనిమిది మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో ఆరు మ్యాచ్‌లు గెలిస్తే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడానికి మెరుగైన అవకాశాలుంటాయి.

ఈ నేపథ్యంలో శ్రీలంకతో మ్యాచ్ అనంతరం భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (Shubman Gill) ఆట సాగిన తీరు, డబ్ల్యూటీసీ గురించి మాట్లాడాడు. “ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరడం మా అంతిమ లక్ష్యం. టెస్టు విజయాలు అంత సులభంగా రావు. ఈ గెలుపు ఎంతో ఆనందాన్నిచ్చింది. మాకు ఇది ఎంతో సంతృప్తికరమైన విజయం. మేము ఈ మ్యాచ్‌లో మెరుగైన స్థితిలోనే ఉన్నప్పటికీ వాతావరణ పరిస్థితుల (వర్షం వల్ల) కారణంగా మ్యాచ్ కొనసాగుతుందో లేదోనన్న ఆందోళన కలిగింది. కానీ, మా బౌలర్లు మ్యాచ్‌ను వేగంగా ముగించారు” అని గిల్ పేర్కొన్నాడు.

లంకతో తొలి టెస్టులో 10 వికెట్లు పడగొట్టి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన యువ ఆల్‌రౌండర్ మానవ్ సుతార్‌పై శుభ్‌మన్ ప్రశంసలు కురిపించాడు. సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడని, చాలా మంచి భవిష్యత్తు ఉన్న ఆటగాడిగా కనిపిస్తున్నాడని పేర్కొన్నాడు. అతను చాలాకాలంపాటు భారత్‌కు ఆడగలడని విశ్వాసం వ్యక్తం చేశాడు. సెంచరీ హీరో, ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దేవదత్ పడిక్కల్‌ను కూడా గిల్ ప్రశంసించాడు.“అతని ఆట చూడముచ్చటగా ఉంది. సెంచరీలు సాధించడం ముఖ్యమే. కానీ కేవలం సెంచరీతోనే ఆగిపోకుండా అతను భారీ స్కోరు చేశాడు. పడిక్కల్ అక్కడితో సంతృప్తి చెందలేదు. రెండో ఇన్నింగ్స్‌లోనూ రాణించాడు. అతను బ్యాటింగ్ చేసిన తీరు, ఆధిపత్యం ప్రదర్శించిన విధానం చూడటానికి చాలా బాగుంది” అని భారత కెప్టెన్ విశ్లేషించాడు.

# సుతార్‌కు 10 వికెట్లు.. 600వ టెస్టులో భారత్ ఘన విజయం

శ్రీలంకతో తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. 372 పరుగుల లక్ష్య ఛేదనలో శ్రీలంక 206 పరుగులకే ఆలౌటైంది. దీంతో 165 పరుగుల తేడాతో టీమ్ఇండియా గెలిచింది. రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మానవ్ సుతార్ ఫైఫర్ (6/55) నమోదు చేశాడు. భారత్‌కు ఇది 600వ టెస్టు మ్యాచ్. ఇక, రెండో ఇన్నింగ్స్‌లో శ్రీలంక బ్యాటర్లలో సోనాల్ దినుష (84), ధనంజయ డిసిల్వా (59) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ 6, ప్రసిద్ధ్ కృష్ణ 2.. సిరాజ్, జడేజా చెరో వికెట్ తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 462 పరుగులు చేయగా.. శ్రీలంక 284 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 193 పరుగులు చేసింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి మానవ్ సుతార్ 10 వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ చేసిన దేవదత్ పడిక్కల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు వరించింది. ఇక డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ స్థానం మారనప్పటికీ.. పర్సంటేజీని మాత్రం బాగా పెంచుకుంది. ప్రస్తుతం 53.33 శాతంతో ఐదో స్థానంలో ఉంది. భారత్ ఖాతాలో 60 పాయింట్లు ఉన్నాయి.

యువ స్పిన్నర్ మానవ్ సుతార్ మరోసారి అద్భుతం చేశాడు. ఒకే ఓవర్‌లో (76వ) మూడు వికెట్లు తీశాడు. సోనాల్ దినుష (84), ప్రభాత్ జయసూర్య (0)ను వరుస బంతుల్లో ఔట్ చేసిన అతడు.. ఓవర్ చివరి బంతికి లాహిరు కుమార (0)ను పెవిలియన్‌కు చేర్చాడు. సోనాల్ క్యాచ్‌ను స్లిప్‌లో ధ్రువ్ జురెల్ అందుకొన్నాడు. ప్రభాత్ జయసూర్య బౌల్డ్ అయ్యాడు. ఇక లాహిరు ఇచ్చిన క్యాచ్‌ను వికెట్ కీపర్ పంత్ అందుకొన్నాడు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 199/9.

శ్రీలంక బ్యాటర్లు వికెట్ ఇవ్వకుండా పట్టుదల ప్రదర్శిస్తున్నారు. భారత బౌలర్లు మాత్రం శతవిధాలా ఏడో వికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. లంచ్ బ్రేక్ తర్వాత ఆరు ఓవర్లపాటు ఆట జరిగింది. కేశర నువాంత (12*), సోనాల్ దినుష (80*) మాత్రం డిఫెన్స్ ఆడేస్తున్నారు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 72 ఓవర్లకు 194/6. భారత్ విజయానికి నాలుగు వికెట్ల దూరంలో ఉండగా.. శ్రీలంకకు 177 పరుగులు అవసరం.

శ్రీలంక - భారత్ తొలి టెస్టు ఐదో రోజు మొదటి సెషన్ ముగిసింది. లంచ్ బ్రేక్ సమయానికి శ్రీలంక 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. క్రీజ్‌లో సోనాల్ దినుష (65*), కేశర నువాంత (8*) ఉన్నారు. ఈ సెషన్‌లో భారత బౌలర్లు రెండు వికెట్లు తీయగలిగారు. కెప్టెన్ ధనంజయ డిసిల్వా (59)తోపాటు నిరోషన్ డిక్వెల్లా (10) పెవిలియన్‌కు చేరారు. మరో నాలుగు వికెట్లు తీస్తే టీమ్ఇండియాదే టెస్టు విజయం. మరోవైపు శ్రీలంకకు 197 పరుగులు అవసరం.

శ్రీలంకకు స్వల్ప వ్యవధిలోనే షాక్ తగిలింది. తొలి ఇన్నింగ్స్‌లో విలువైన పరుగులు చేసిన నిరోషన్ డిక్వెల్లా (10) పెవిలియన్‌కు చేరాడు. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన (59.6వ ఓవర్) బంతిని షాట్ కొట్టే క్రమంలో వికెట్ కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 156 పరుగుల వద్ద శ్రీలంక ఆరో వికెట్‌ను నష్టపోయింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 61 ఓవర్లకు 160/6. క్రీజ్‌లో కేశర (1*), సోనాల్ దినుష (57*) ఉన్నారు. మరో నాలుగు వికెట్లు తీస్తే టీమ్ఇండియాదే విజయం.

దాదాపు 24 ఓవర్ల తర్వాత భారత్‌కు వికెట్ దక్కింది. కెప్టెన్ ధనంజయ (59)ను రవీంద్ర జడేజా ఔట్ చేశాడు. జడ్డూ వేసిన (55.2వ ఓవర్) బంతిని ఆడేందుకు ప్రయత్నించి మానవ్ సుతార్‌కు ధనంజయ క్యాచ్ ఇచ్చాడు. దీంతో 95 పరుగులు ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 56 ఓవర్లకు 144/5. క్రీజ్‌లో సోనాల్ (51*), డిక్వెల్లా (1*) ఉన్నారు. శ్రీలంక విజయానికి 228 పరుగులు అవసరం. భారత్ ఐదు వికెట్లు తీస్తే గెలుస్తుంది.

శ్రీలంక - భారత్ జట్ల మధ్య తొలి టెస్టు ఐదో రోజు ఆట కొనసాగుతోంది. ఓవర్‌నైట్ 84/4 స్కోరుతో శ్రీలంక ఆఖరి రోజు ఆటను మొదలుపెట్టింది. కెప్టెన్ ధనంజయ (54*), సోనాల్ దినుష (50*) హాఫ్ సెంచరీలు సాధించారు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు ఇప్పటికే 91 పరుగులు జోడించారు. వికెట్ కోసం భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ వేస్తున్నా ఫలితం మాత్రం దక్కడం లేదు. ప్రస్తుతం శ్రీలంక స్కోరు 51 ఓవర్లకు 138/4. లంక విజయానికి ఇంకా 234 పరుగులు అవసరం కాగా.. భారత్‌కు ఆరు వికెట్లు కావాలి.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314